శనివారం
12•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 198
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



శంకర్‌పల్లి మున్సిపాలిటీ వార్డులను పెంచాలని, ఎంఎంటీఎస్ రైలును వికారాబాద్ వరకు పొడిగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు



శుక్రవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



దేశంలో మొదటిసారి ప్రాంతీయ భాషలోకి అనువదించిన మండల్, అనంతరామన్, హవనూరు కమిషన్ల తెలుగు నివేదికలు, ఆంగ్లంలోని బీసీ నోట్‌బుక్ తొలిప్రతులను గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ అందజేసింది. శుక్రవారం రాజ్‌భవన్లో గవర్నర్‌ను కలిసిన తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, సభ్య కార్యదర్శి అనితారాజేంద్ర బీసీ నోట్‌బుక్‌ను అందజేశారు. వారితోపాటు రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ఉన్నారు. దేశ సామాజిక నేపథ్యం, ప్రజలకు రిజర్వేషన్ల ఆవశ్యకతకు ప్రామాణికమైన మండల్, అనంతరామన్, హవనూర్ కమిషన్ నివేదికలను తెలుగులోకి అనువదించిన బీసీ కమిషన్‌ను గవర్నర్ అభినందించారు. ఈ నివేదికలకు సంబంధించిన పలు అంశాలపై గవర్నర్ వారితో చర్చించారు. -నమస్తే తెలంగాణ, హైదరాబాద్

సంక్రాంతికి 5,252 ప్రత్యేక బస్సులు

- ఈ నెల 16 వరకు నడుపనున్న టీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ సందర్భంగా 5,252 ప్రత్యేక బస్సులను వివిధ రూట్లలో 11 నుంచి 16 వరకు నడుపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎంజీబీఎస్, జేబీఎస్, ఎంపికచేసిన ప్రాంతాల నుంచి బస్సులు నడుపుతున్నారు. జేబీఎస్ నుంచి కరీంగనర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, జిల్లాల వైపు ప్రతిరోజూ వెళ్లే బస్సులతో పాటు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఎంజీబీఎస్ నుంచి కర్నూలు, అనంతపురం, గుత్తి, పుట్టపర్తి, ధర్మవరం, మదనపల్లికి ప్రత్యేక బస్సులు నడుస్తాయి. కాచిగూడ నుంచి నంద్యాల, ఆత్మకూరు (కే), వెలుగోడు, నందికొట్కూరు, కోయిలకుంట్ల, ఆళ్లగడ్డ, మైదుకూరు, బనగానపల్లి, అవుకు, బుద్వేల్, జమ్మలమడుగు, పొద్దుటూరు, పులివెందుల, కడప, రాజంపేట, రాయచోటి, కోడూరు, చిత్తూరు వైపు రోజువారీ బస్సలకు అదనంగా ప్రత్యేక బస్సులు కూడా నడుస్తాయి. ఉప్పల్ క్రాస్‌రోడ్డు, ఉప్పల్ బస్‌స్టేషన్ నుంచి యాదగిరిగుట్ట, వరంగల్ వైపు వెళ్లే బస్సులు తిరుగుతాయి. దిల్‌సుఖ్‌నగర్ స్టేషన్ నుంచి మిర్యాలగూడ, నల్లగొండ, కోదాడ, సూర్యాపేటకు బస్సులు తిరుగుతాయి. విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు లింగంపల్లి, చందానగర్, మియాపూర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, ఈసీఐఎల్, ఎల్బీనగర్ నుంచి నడుపుతున్నారు.



సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఎల్బీనగర్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో శుక్రవారం కిక్కిరిసిపోయిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్సీలపై విచారణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్సీలు రాములునాయక్, యాదవరెడ్డి, భూపతిరెడ్డి వ్యవహారంపై శుక్రవారం శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ విచారణ నిర్వహించారు. వీరిలో రాములునాయక్ విచారణ ముగిసినప్పటికీ తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. యాదవరెడ్డి, భూపతిరెడ్డిపై విచారణ శనివారం కూడా కొనసాగనున్నది.

ఉద్యోగులకు చెల్లింపుల్లో జాప్యం లేదు

- స్పష్టంచేసిన ఆర్థికశాఖ అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, దాదాపు రూ. 400 కోట్ల బకాయి పేరుకుపోయాయని ఒక పత్రిక (నమస్తే తెలంగాణ కాదు)లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని ఆర్థికశాఖ అధికారులు స్పష్టంచేశారు. జీపీఎఫ్, రుణాలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ అడ్వాన్స్‌లు, గృహ వాహన రుణాలు గతంలోలాగానే చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. ఆర్థికశాఖ నిబంధనల ప్రకారం ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ వరకు చెల్లింపులు జరుగుతాయని, అనుబంధ బిల్లులైన జీపీఎఫ్, రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటివి 15 నుంచి 20 వ తేదీ వరకు చెల్లించడానికి కాలపరిమితి ఉంటుందని తెలిపారు.

17 నుంచి అఖిల భారత ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శన

- వివిధ రాష్ట్రాలకు చెందిన 80 స్టాళ్ల ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ఆరో అఖిల భారత ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఈవెంట్ ఆర్గనైజర్స్ అధ్యక్షుడు ఖలీద్ అహ్మద్ చెప్పారు. బెంగళూరు, పుణె, కళింగపున్, కడియం, హైదరాబాద్ నగరాలకు చెందినవారు సుమారు 80 రకాల స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారని తెలిపారు. శుక్రవారం పీపుల్స్‌ప్లాజా వద్ద సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ.. ఈసారి కూడా పూల మొక్కలు, టెర్రస్ గార్డెన్, నిలువు తోట విత్తనాలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, సాంకేతిక పరికరాలు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు.

బయోమెట్రిక్ కొలమానం

- గతేడాది మాదిరిగా టీచింగ్ ఫ్యాకల్టీ ఫుల్‌టైం ఉండాలి
- ఎంటెక్‌లో ఇద్దరు పీహెచ్‌డీలు, బీటెక్‌లో ప్రతి 120 సీట్లకు ఒక పీహెచ్‌డీ తప్పనిసరి
- వరుసగా మూడేండ్లు 25 శాతంకన్నా తక్కువ అడ్మిషన్లు ఉన్న కోర్సులకు అఫిలియేషన్ నిరాకరణ
- 2019-20 అఫిలియేషన్ నిబంధనలు విడుదలచేసిన జేఎన్టీయూహెచ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల అఫిలియేషన్‌కు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను జేఎన్టీయూహెచ్ కొలమానంగా భావిస్తున్నది. అఫిలియేషన్ నోటిఫికేషన్ కంటే ముందుగానే బీటెక్/బీఈ కాలేజీల్లో బయోమెట్రిక్ తప్పనిసరిగా అమలుచేయాలని యాజమాన్యాలకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. ఈ విషయంలో విఫలమైన కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చే ప్రసక్తే లేదని ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం 2019-20 విద్యాసంవత్సరానికిగాను అఫిలియేషన్ నిబంధనల బుక్‌లెట్‌ను ఆయన విడుదలచేశారు. గత ఏడాది నిబంధనలను ఈసారి కూడా కొనసాగుతున్నాయి. గతేడాది ఇంజినీరింగ్‌లోని యూజీ కోర్సులకు నిలిచిపోయిన బయోమెట్రిక్ విధానాన్ని ఈసారి అమలుచేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు. అఫిలియేషన్ దరఖాస్తులు, ఆధార పత్రాలను ఆన్‌లైన్‌లో యూనివర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్‌పోర్టల్‌కు చేరుకునేలా పంపాలని సూచించారు. వరుసగా మూడేండ్లు 25 శాతం కంటే తక్కువ ప్రవేశాలున్న కోర్సులకు అఫిలియేషన్ నిరాకరించనున్నట్టు స్పష్టంచేశారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల బోధన సిబ్బంది ఒక విద్యాసంవత్సరానికి సంబంధించిన బయోమెట్రిక్ అటెండెన్స్‌ను చూపాలని, టీచింగ్ ఫ్యాకల్టీ ఫుల్‌టైం కళాశాలలోనే ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. గతఏడాది మాదిరిగా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ, ఎంటెక్‌లో ఇద్దరు పీహెచ్‌డీలు, బీటెక్‌లో ప్రతి 120 సీట్లకు ఒక పీహెచ్‌డీ తప్పనిసరి ఉండాలని, ఒక కాలేజీలో పనిచేస్తూ తరచూ మారుతున్న ఫ్యాకల్టీ పేరును యూనివర్సిటీ బ్లాక్‌లిస్ట్‌లో పెడుతామని వెల్లడించారు. కాలేజీల్లో సైన్స్‌ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, కేంద్రీకృత కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యాకాలేజీల్లో విద్యార్థులకు సబ్జెక్టుల సమీక్ష కోసం పలురకాల పబ్లికేషన్ల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

ర్యాండమ్ తనిఖీలు కొనసాగుతాయి

ఏడాదిమొత్తం ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో అఫిలియేషన్‌తో పాటు ర్యాండమ్ తనిఖీలు కొనసాగుతాయి. అఫిలియేషన్ తనిఖీల తర్వాత తయారుచేసిన నివేదికలను నిజనిర్ధారణ కమిటీ పరిశీలిస్తుంది. ఆపై అఫిలియేషన్ కంటే ముందు విడుదలచేసిన ప్రతిపాదిత జాబితాలపై ఫిర్యాదుల స్వీకరణకు కనీసం రెండువారాల గడువు విధిస్తుంది. ఆ తర్వాత అఫిలియేషన్ తుదిజాబితా విడుదల చేస్తామని యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. 2019-20 విద్యాసంవత్సరానికి అఫిలియేషన్ నోటిఫికేషన్‌ను త్వరలోనే జారీచేస్తామని పేర్కొన్నారు.

కాలేజీల మూసివేతకు దరఖాస్తు చేసుకోండి

ఈ నెల 31 వరకు గడువు విధించిన జేఎన్టీయూహెచ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమ పరిధిలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసి, మేనేజిమెంట్, కంప్యూటర్స్ వంటి వృత్తివిద్య కాలేజీలను, కోర్సులను మూసివేయాలనుకొన్న యాజమాన్యాలకు జేఎన్టీయూహెచ్ అవకాశం కల్పిస్తుంది. తమ నుంచి నిరభ్యంతర పత్రాలు పొందేందుకు ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నిరభ్యంతర పత్రాలను పొందేందుకు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవావాలని, గడువు తేదీ తర్వాత చేసుకొనే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉండదని జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తెలిపారు. కోర్సు మూసివేతకు రూ.25 వేలు, కాలేజీ మూసివేతకు రూ.45వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, పూర్తివివరాల కోసం జేఎన్టీయూహెచ్ అకడమిక్ ఆడిట్ సెల్ పోర్టల్‌లో సంప్రదించాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌తోనే అప్‌డేషన్

- కోర్ బ్యాంకింగ్ తరహాలో ఎల్ఆర్‌యూపీ
- పరిగిలో ప్రయోగాత్మకంగా అమలు
- పరిశీలించిన స్పెషల్ సీఎస్ రాజేశ్వర్‌తివారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వికారాబాద్ జిల్లా పరిగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా కోర్ బ్యాంకింగ్ తరహాలో ఎల్ఆర్‌యూపీ (ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం)కు చెందిన అధునాతన సాఫ్ట్‌వేర్ ద్వారా చేపట్టిన రిజిస్ట్రేషన్ల విధానాన్ని శుక్రవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌తివారీ, సీసీఎల్‌ఏ డైరెక్టర్ వాకాటి కరుణ పరిశీలించారు. వందరోజుల్లో భూ రికార్డుల ప్రక్షాళన పూర్తిచేసినప్పటికీ.. వీటిని కంప్యూటరీకరించి ఆన్‌లైన్‌లో ప్రజలు చూసుకోవడానికి వీలుగా రూపొందించిన 'ధరణి' పలు సాంకేతిక కారణాలతో అనుకున్నంతగా ముందుకుసాగలేదు. దీంతో ప్రత్యామ్నాయమార్గాలను అన్వేషించిన సీసీఎల్‌ఏ అధికారులు అత్యంత అధునాతనమైన సాఫ్ట్‌వేర్‌ను తీసుకొని రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే భూమి రికార్డులను కూడా సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఇందుకోసం సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో 'నౌ యువర్ ల్యాండ్స్' అనే ఆప్షన్ ఇచ్చారు. ఇందులో భూ రికార్డుల ప్రక్షాళనలో ఎలాంటి వివాదాలు లేకుండా ఉన్న భూముల వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో రైతులు భూమిని కొనుగోలు చేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే బ్యాంకు అకౌంట్ మాదిరిగా అమ్మినవారి పట్టాదార్ పాస్‌బుక్ నుంచి తొలగించి కొనుగోలు చేసినవారి పాస్‌బుక్‌లోకి ఎక్కించే విధానాన్ని పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేపట్టారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా వికారాబాద్‌తోపాటు, నల్లగొండ జిల్లాలోని నకిరేకల్‌లో పూర్తిస్థాయిలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



కవ్వాల్ అభయారణ్యంలో కెమెరా ట్రాప్‌కు చిక్కిన పెద్దపులి

అటవీ స్మగ్లర్లపై కెమెరా కన్ను

- టైగర్ కారిడార్లలో అడుగడుగునా కెమెరాల ఏర్పాట్లు
- కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్
- రంగంలోకి దిగనున్న ప్రత్యేక డాగ్‌స్క్వాడ్లు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ కవ్వాల్, నాగర్‌కర్నూల్ అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యాల్లో వన్యప్రాణుల భద్రతకు అటవీశాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. టైగర్ కారిడార్లలో అడుగడుగున కెమెరా ట్రాప్‌లను అమర్చుతున్నారు. పెద్దపులుల సంరక్షణకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపుతున్నారు. దాదాపు 2015 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న కవ్వాల్‌లో వేటగాళ్ల కదలికలు ఉన్నట్టు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ) వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్‌బ్యూరో హెచ్చరికలు జారీచేసింది. ఇచ్చోడలో ఇటీవలనే పెద్దపులిని చంపి తోలు ఒలిచిన కేసు సంచలనం సృష్టించింది. కవ్వాల్ అభయారణ్యంలోకి మహారాష్ట్ర తడోబా అంథేరి టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతి నుంచి పులులు వలస వస్తున్నాయి. మార్గమధ్యలో అనువైన గడ్డిమైదానాలు లేకపోవడాన్ని గుర్తించిన అధికారులు.. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య అడవులను దట్టంగా పెంచాలని నిర్ణయించారు. కవ్వాల్‌లో 400 నుంచి 500 కెమెరాలు, అమ్రాబాద్‌లో 400 నుంచి 450 కెమెరా ట్రాప్‌లను అమర్చి వలస వస్తున్న పులుల జాడలతోపాటు స్మగ్లర్ల కదలికలను పసిగడుతున్నారు. మహారాష్ట్ర తడోబా నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే పులుల కారిడార్లో దాదాపు 240 కెమెరా ట్రాప్‌లను అమర్చారు.

రంగంలోకి ప్రత్యేక డాగ్‌స్క్వాడ్లు

పెద్దపులుల అభయారణ్యాల్లో కుక్కల కాపలా పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలోభాగంగా కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలకు రెండు డాగ్‌స్క్వాడ్లను కేటాయించింది. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో జర్మన్ షెపర్డ్ కుక్కలతోపాటు సిబ్బందికి శిక్షణనిచ్చి అడవులకు పంపారు. దేశవ్యాప్తంగా పెద్దపులుల రక్షణ సవాల్‌గా మారిన నేపథ్యంలో.. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ డాగ్‌స్క్వాడ్లను రంగంలోకి దించింది.

నామినేషన్లకు ముందే ఓటర్ల నమోదు ఫ్రీజ్ చేయాలి

- పోటీచేసేవారికే నమోదుకు అవకాశమివ్వాలి
- ఈఆర్వోనెట్‌లో సాంకేతిక సమస్యలు
- కేంద్ర ఎన్నికల సంఘానికి సీఈవో రజత్‌కుమార్ సూచన



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : నామినేషన్ల ప్రారంభం కన్నా ముందే ఓటర్ల నమోదును ఫ్రీజ్ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. కేవలం పోటీలో ఉండే అభ్యర్థికి మాత్రం రిటర్నింగ్ అధికారి అనుమతితో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకు చివరి గడువు వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతునాయని తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో శుక్రవారం జరిగిన సీఈవోల కాన్ఫరెన్స్‌లో ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు, త్వరలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై సీఈవో రజత్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నకిలీ ఓటర్లను గుర్తించడానికి, అభ్యంతరాలను పరిష్కరించడానికి రాష్ట్రంలో తొలిసారిగా ఈఆర్వో నెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధానంగా ప్రస్తావించిన సీఈవో ఒక్కో దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేందుకు కనీసంగా 15 నిమిషాల నుంచి 20 నిమిషాల సమయం తీసుకుందని పేర్కొన్నారు. ఈఆర్వోనెట్ కారణంగా ఓటరు తుదిజాబితా ప్రకటించే సమయంలో అనేక ఇబ్బందులు పడ్డట్టు తెలిపారు. సిడాక్ ఇంజినీర్లు పని చేస్తున్నప్పటికీ ఈఆర్వో నెట్ మొరాయించిందని చెప్పారు.

3.9 శాతం పోలింగ్ పెంచాం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 73.40 శాతం పోలింగ్ నమోదైందని సీఈవో ఈసీకి వివరించారు. 2014 ఎన్నికలతో చూస్తే 3.9శాతం పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఉండాలని కోరారు.

ఆపద్బాంధవుడు కేటీఆర్

- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చొరవతో పోలియో బాలుడికి సాంత్వన
- పరీక్షలు నిర్వహించిన సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి
- ఫిబ్రవరిలో శస్త్ర చికిత్స-నడిచేలా చేస్తామని భరోసా

హైదరాబాద్/గోదావరి ఖని : నమస్తే తెలంగాణ : ఓ పోలియో బాధిత బాలుడికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆపద్బాంధవుడయ్యారు. రామగుండానికి చెందిన బాలుడు శివసాయి వైద్య ఖర్చులు తానే భరిస్తానని ప్రకటించిన ఆయన సికింద్రాబాద్‌లోని సన్‌షైన్ దవాఖాన వైద్యులతో శుక్రవారం పరీక్షలు జరిపించారు. పరీక్షలు నిర్వహించిన ఎండీ డాక్టర్ గురువారెడ్డి శివసాయిని నడిచేలా చేస్తానని భరోసా ఇచ్చారు. ఫిబ్రవరి మొదటివారంలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రామగుండానికి చెందిన పోలియో బాధిత బాలుడు శివ సాయి స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ద్వారా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. బాలుడికి అవసరమైన చికిత్సను అందిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. బాలుడిని డాక్టర్లకు చూపించాల్సిందిగా జీహెచ్ఎంసీ టీఆర్ఎస్ నాయకులు కట్టెల శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. కాగా శుక్రవారం వైద్యులు పరీక్షలు నిర్వహించడం విశేషం



శుక్రవారం శివసాయికి వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు వెల్లడిస్తున్న సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి

కంటి వెలుగు@ కోటి 28 లక్షలు

శుక్రవారంనాడు 99,789 మందికి కంటిపరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని ప్రతి పౌరుడు కంటిచూపు కోల్పోవద్దన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ కంటివెలుగు కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 89 రోజుల్లో.. 1,28,09,356 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఇందులో 19,98,329 మందికి కండ్లద్దాలను అందజేశారు. మరో 15,40,282 మందికి ప్రత్యేక అద్దాలను ప్రతిపాదించారు. కాగా శుక్రవారంనాడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో 99,789 మందికి కంటిపరీక్షలు చేసి.. 7,531 మందికి కండ్లద్దాలను అందజేశారు. కాగా ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు కంటిపరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య ఐదులక్షలు దాటింది. జిల్లావ్యాప్తంగా శుక్రవారంనాటికి మొత్తం 5,15,157మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 96,253 మందికి కండ్లద్దాలను అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటివరకు 4,32,599 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 93,294 మందికి కండ్లద్దాలు పంపిణీ చేశారు. శుక్రవారం ఒక్కరోజే 2,688 మందికి కంటిపరీక్షలు చేశారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	శుక్రవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	99,789	1,28,09,356
రీడింగ్ అద్దాలు పొందినవారు	7,531	19,98,329
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	5,885	15,40,282
కంటి సమస్యలపై రెఫరల్	4,944	8,06,002
కంటి సమస్యలులేనివారు	81,429	84,64,743



కంటి సమస్యకు పరిష్కారం

కొన్నాళ్ల నుంచి కంటి మసకలతో బాధపడుతున్నాను. కంటి వెలుగు శిబిరంలో నాకు కంటిపరీక్షలు చేశారు. కండ్లద్దాలు ఇచ్చారు. ఇప్పుడు కంటిచూపు బాగుంది. ఇక్కడకు వచ్చిన అరగంటలోపే నా సమస్యకు పరిష్కారం దొరికింది.

- పల్లపు రాజు, కూలీలైన్, కొత్తగూడెం

శనివారం
12•1•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




తెలంగాణ హైకోర్టు సీజే
జస్టిస్ రాధాకృష్ణన్
బదిలీ



కలకత్తా హైకోర్టు సీజేగా నియమిస్తూ కొలీజియం నిర్ణయం

5



గగన్‌యాన్‌లో మహిళా వ్యోమగామి!

2021 డిసెంబర్ నాటికి మానవ సహిత అంతరిక్ష యాత్ర

రోదసిలోకి ముగ్గురు భారతీయులు

వ్యోమగాములకు మనదేశంలో, రష్యాలో శిక్షణ

ఈ ఏడాది ఏప్రిల్‌లో చంద్రయాన్-2 ప్రయోగం

మొదటిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనలు

ఇస్రో చైర్మన్ కే శివన్ వెల్లడి

బెంగళూరు, జనవరి 11: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'గగన్‌యాన్' ప్రాజెక్టు ద్వారా 2021 డిసెంబర్ నాటికి ముగ్గురు భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఇస్రో చైర్మన్ కే శివన్ వెల్లడించారు. వ్యోమగామి బృందంలో మహిళ కూడా ఉండే అవకాశం ఉందని తెలిపారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో శుక్రవారం శివన్ మీడియాతో మాట్లాడుతూ... గతేడాది ఇస్రో సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాల గురించి వివరించారు. భారత అంతరిక్ష చరిత్రలో

మిగతా 5వ పేజీలో

సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఫిబ్రవరి నుంచి శిక్షణ

ఉద్యమంలా గ్రామవికాసం

- గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆస్కి, ఎంసీఆర్‌హెచ్చార్డీ ద్వారా నిర్వహణ
- ప్రతి పంచాయతీకి కొత్త పీఆర్ చట్టం తెలుగు ప్రతులు
- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణపై సమీక్షలో సీఎం కేసీఆర్



శుక్రవారం ప్రగతి భవన్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నూతనంగా ఎన్నికయ్యే సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఫిబ్రవరి నుంచి మే వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దే విషయంలో వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచడం లక్ష్యంగా రూపొందించిన చట్టంపై అవగాహన కోసం.. ప్రతి గ్రామ పంచాయతీకి కొత్త చట్టం తెలుగుప్రతులను పంపించాలని సూచించారు. కొత్తగా నియామకమయ్యే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్‌లు మూస పద్ధతిలో కాకుండా.. గ్రామాల సమగ్ర వికాసానికి పాటుపడే ఉద్యమకారులుగా మారాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే అంశంపై శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. 'రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతి గ్రామానికీ ఒక కార్యదర్శి

మిగతా 4వ పేజీలో



మటన్ వినియోగంలో
మనమే నం.1

- గొర్రెల సంఖ్యలోనూ దేశంలో తెలంగాణ ముందంజ
- రాష్ట్రంలో గొర్రెలసంఖ్య 2.24 కోట్లు
- రాజస్థాన్‌ను వెనుకకు పడేసిన రాష్ట్రం
- ఫలించిన గొర్రెల పంపిణీ పథకం
- రాష్ట్రంలో ఏడాదికి మాంసం సగటు వినియోగం 7.5 కిలోలు
- జాతీయ పశుగణన శాస్త్రీయ నివేదికలో వెల్లడి

4



అలోక్‌వర్మ రాజీనామా

తనపై నిరాధార ఆరోపణలు చేసి బదిలీ చేశారంటూ కేంద్రంపై ఆగ్రహం

కమిటీ ఎదుట వాదనలు వినిపించుకునే అవకాశం కల్పించలేదని ధ్వజం

అందుకే పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీబీఐ మాజీ డైరెక్టర్ సంచలన ప్రకటన

అగ్నిమాపక, హోంగార్డ్స్ డీజీగా బదిలీపై గంటల్లోనే అనూహ్య నిర్ణయం

రాకేశ్ ఆస్తానా ఫిర్యాదునే సీవీసీ యథాతథంగా తన నివేదికలో పేర్కొన్నట్లు విమర్శ

ఆత్మవిమర్శ చేసుకోవాలంటూ కేంద్రానికి హితవు

5

ఆస్తానాకు చుక్కెదురు



లంచాల కేసు కొట్టివేతకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

క్రిమినల్ విచారణ నుంచి రక్షణ కల్పించే ఉత్తర్వు రద్దు

5

మొదలైన రెండోదశ నామినేషన్లు

- 4,137 పంచాయతీలకు ఎన్నికలు
- తొలిరోజు 14,048 నామినేషన్లు దాఖలు
- తొలిదశలో అభ్యంతరాల స్వీకరణ పూర్తి.. నేడు పరిశీలన
- 11 పంచాయతీల్లో నామినేషన్లు నిల్
- సోమవారం నుంచి ప్రచార పర్వం.. ఆరురోజులకే పరిమితం

9

హెచ్1బీ వీసాదారులకు
సులభంగా పౌరసత్వం

- త్వరలోనే నిబంధనల్లో మార్పులు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్
- భారతీయ నిపుణులకు ప్రయోజనకరం



5

గిరిజన వర్సిటీలో
ఆరు కోర్సులు

జూలై నుంచే తరగతులు ప్రారంభం

స్థానిక గిరిజన యువతకు 30% సూపర్ న్యూమరరీ సీట్లు

4

మన వారసత్వ సంపదపై
మరో వివక్ష

తెలంగాణ చారిత్రక ఇమేజ్‌పై కేంద్ర పురావస్తుశాఖ కుట్ర

హైదరాబాద్‌ను మినీ సర్కిల్‌గా మార్చేందుకు యత్నం



8



టీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర నాయకుడు పేరాల ప్రణీత్ రూపొందించిన క్యాలెండర్‌ను టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామరావు శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నేత కిశోర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.
-నమస్తే తెలంగాణ, హైదరాబాద్

రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ ప్రకటన విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో జనవరి 2020లో నిర్వహించే ప్రవేశాలకు సంబంధించి ప్రవేశపరీక్షకు ప్రకటన విడుదలైనట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. 02.01.2007 నుంచి 01.07.2008 మధ్య జన్మించినవారు మాత్రమే పాఠశాల విద్యలో చేరేందుకు అర్హులని, ఈ ఏడాది జూన్ ఒకటిన పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నది. హైదరాబాద్‌లో మాత్రమే నిర్వహించే ఈ పరీక్షకు తెలంగాణ వారు మాత్రమే అర్హులని వెల్లడించింది. ఆర్ఐఎంసీ డెహ్రాడూన్ నుంచి దరఖాస్తు ఫారాలను నేరుగా పొందవచ్చని తెలిపింది. వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

తగ్గిన చలి తీవ్రత

- కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో మూడు నుంచి నాలుగు డిగ్రీలు పెరుగుదల
- దిశను మార్చుకున్న ఉత్తరాది గాలులు
- గురువారం రాత్రి నుంచి మొదలైన ఆగ్నేయ గాలులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాలుగు రోజులుగా వణుకు పుట్టిస్తున్న చలిగాలుల తీవ్రత శుక్రవారం నుంచి క్రమంగా తగ్గుతున్నది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలులు దిశను మార్చుకోవడంతోపాటు గురువారం రాత్రి నుంచి ఆగ్నేయ గాలులు మొదలయ్యాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దీంతో చలి తీవ్రత తగ్గిందన్నారు. 24 గంటల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగాయి. ఆదిలాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 6.5 డిగ్రీల నుంచి 8.8 డిగ్రీలకు, హైదరాబాద్‌లో 11 నుంచి 16.3 డిగ్రీలకు, రంగారెడ్డి జిల్లాలో 13 నుంచి 15.4 డిగ్రీలకు, హన్మకొండలో 10.5 డిగ్రీల నుంచి 15.5 డిగ్రీలకు, మెదక్‌లో 7 డిగ్రీల నుంచి 8.5 డిగ్రీలకు, నిజామాబాద్‌లో 11 డిగ్రీల నుంచి 14.4 డిగ్రీలకు పెరిగాయి. రాగల మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతాయని, చలి తీవ్రత మరింత తగ్గుతుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి రాజారావు తెలిపారు. నెలాఖరులోపు ఒకటిరెండుసార్లు చలిగాలులు వీచే అవకాశం ఉందన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలకేంద్రంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిని కప్పేసిన పొగమంచు



సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే అంశాలపై శుక్రవారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, కాలె యాదయ్య, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ఫిబ్రవరి నుంచి శిక్షణ

మూడోపేజీ తరువాయి...

ఉండేలా పంచాయతీ కార్యదర్శుల నియామకం కూడా జరుగుతున్నది. గ్రామాభివృద్ధిలో వీరిద్దరి పాత్ర చాలా కీలకం. గ్రామ పంచాయతీకి విధులు, బాధ్యతలు అప్పగించే విషయంలో కొంత జాప్యం అనివార్యమవుతున్నది. కేంద్రప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్‌కు పోయే అవకాశం ఉన్నందున.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్ ఆన్ అకౌంట్‌కే పోతుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయి. ఆ తరువాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతాం. అప్పుడే పంచాయతీలకు నిధులు కేటాయించడం సాధ్యమవుతుంది. ఆలోగా సర్పంచులు, కార్యదర్శులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి, గ్రామాభివృద్ధి కోసం పాటుపడే కార్యకర్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆస్కి, ఎంసీఆర్ హెచ్చార్డీ తదితర సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించాలి' అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కాలె యాదయ్య, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 ధ్రువపత్రాల పరిశీలన 23న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 పోస్టులకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 23న తమ కార్యాలయంలో చేపట్టనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. అభ్యర్థుల జాబితాను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నది.

16 నుంచి విదేశీ విద్యానిధి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించిన విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తులను జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు స్వీకరించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ కమిషనర్ తెలిపారు. అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.53 గంటలకు

సూర్యాస్తమయం: 5.56 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం షష్ఠి రాత్రి 10.07 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉదయం 8.44 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం ఉదయం 9.39 నుంచి 11.01 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.53 నుంచి 8.21 వరకు, వర్జ్యం: రాత్రి 9.55 నుంచి 11.31 వరకు.

లోకం పోకడ



ఆమెకు బస్సులు, రైళ్లు అక్కర్లేదట.. ముగ్గేసుకుంటూ సొంతూరుకు వెళ్లిపోతుందట!

మటన్‌లో మనమే నంబర్‌వన్

- మాంసం వినియోగంలో, గొర్రెల సంఖ్యలోనూ దేశంలోనే తెలంగాణ ముందంజ
- రాజస్థాన్‌ను వెనుకకు నెట్టేసిన రాష్ట్రం
- ఫలించిన గొర్రెల పంపిణీ పథకం
- రాష్ట్రంలో గొర్రెలసంఖ్య 2.24 కోట్లు
- రాష్ట్రంలో ఏడాదికి ప్రతివ్యక్తి సగటు మాంసం వినియోగం 7.5 కిలోలు
- జాతీయ పశుగణన శాస్త్రీయ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మాంసం వినియోగంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచింది. గొర్రెల సంఖ్యలో కూడా ప్రథమస్థానం సాధించింది. ఇప్పటివరకు మొదటిస్థానంలో ఉన్న రాజస్థాన్‌ను వెనుకకు నెట్టింది. తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఉన్నాయి. డిసెంబర్ 31తో ముగిసిన జాతీయ పశుగణన నివేదిక ఈ విషయాన్ని స్పష్టంచేసింది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న గొర్రెల పంపిణీ పథకం సత్ఫలితాలనిస్తున్నది. గ్రామాల్లో గొల్ల, కుర్మ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ పథకం అమలుచేసే (2017 జూన్ 20న) నాటికి రాష్ట్రంలో గొర్రెల సంఖ్య కోటి మాత్రమే. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి కొనుగోలుచేసి 74 లక్షల గొర్రెలను ప్రభుత్వం గొల్ల, కుర్మలకు పంపిణీ చేసింది. వీటికి 55 లక్షల పిల్లలు పుట్టాయి. దీంతో రాష్ట్రంలో కొత్తగా 1.28 కోట్ల గొర్రెలు తయారయ్యాయి. వీటివిలువ రూ.2,500 కోట్లు. గొర్రెల పంపిణీ పథకంతో రూ.2,500 కోట్ల అదనపు సంపద చేకూరింది. పశుగణన చేపట్టేనాటికి మొత్తం ఇతర ప్రాంతాలకు విక్రయించినవి, వివిధ కారణాలతో మృతి చెందినవి, మాంసానికి వినియోగించినవి మినహాయించగా.. రాష్ట్రంలో 2.24 కోట్ల గొర్రెలు ఉన్నట్టు జాతీయ పశుగణన శాస్త్రీయ నివేదిక స్పష్టంచేసింది. ఈ సంఖ్య దేశంలోనే అత్యధికం. దీంతో అత్యధిక గొర్రెలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించింది. ఇప్పటివరకు దేశంలో అత్యధిక గొర్రెలు ఉన్న రాష్ట్రంగా రాజస్థాన్ గుర్తింపు పొందింది. ఆ రాష్ట్రంలో దాదాపు రెండు కోట్ల గొర్రెలు ఉన్నాయి.

పథకం తీరుతెన్నులు



గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లో రూ.3,000 కోట్లు (60 శాతం) నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్సీడీసీ) నుంచి రుణంగా గొర్రెలు మేకల అభివృద్ధి సంస్థ తీసుకున్నది. మరో 20 శాతం నిధులను కేంద్రప్రభుత్వం సబ్సిడీగా అందించింది. రూ.1000 కోట్లు లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించారు. ఒక్కొక్క యూనిట్ వ్యయం రూ.1,25,000 కాగా, ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అంటే రూ.93,750 అందించింది. లబ్ధిదారుడు 25 శాతం రూ.31,250 చెల్లించారు. ఈ పథకం అమలుకోసం మొత్తం రూ.3,299.98 కోట్లు మంజూరుచేయగా, రాష్ట్రంలో తొలివిడుతగా 3,67,020 మంది గొల్ల, కుర్మలకు 73,70,769 గొర్రెలను పంపిణీ చేశారు. వీటికి 55 లక్షలల గొర్రె పిల్లలు కొత్తగా పుట్టాయి. రెండోవిడుతలో దాదాపు 3.5 లక్షల కుటుంబాలకు గొర్రెలు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వరుస ఎన్నికల కారణంగా ఇప్పటివరకు సుమారు 18 వేల కుటుంబాలకు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. మిగతా వారికి పంపిణీ చేసేందుకు కసరత్తు కొనసాగుతున్నది.


పెరిగిన మాంసం ఉత్పత్తి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్తర పథకంతో రాష్ట్రంలో గొర్రెల సంఖ్యతోపాటు మాంసం ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. ఏడాదికి సగటున రాష్ట్రంలో 26,839 టన్నుల మాంసం ఉత్పత్తి అవుతున్నది. మాంసం ఉత్పత్తిలో 15 శాతం వృద్ధి సాధించినట్టు అధికారులు తెలిపారు. 2017 జూన్‌కు ముందు రాష్ట్రానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు రోజుకు 500 నుంచి 600 లారీల గొర్రెలు దిగుమతి అవుతుండేవి. ప్రస్తుతం ఈ సంఖ్య గణనీయంగా పడిపోయి 100 వచ్చింది.

మాంసం వినియోగంలోనూ మనమే టాప్

మాంసం వినియోగంలోనూ దేశంలో తెలంగాణ టాప్‌లో నిలిచింది. సగటున ప్రతివ్యక్తి ఏడాదికి 7.5 కిలోల మాంసం వినియోగిస్తున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణలో 97 శాతం మంది మాంసాహారులే. జాతీయ పోషకాహార సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి ఒక మనిషి 11 కిలోల మాంసం వినియోగించాలి. ఆ స్థాయిలో ఏ రాష్ట్రం కూడా మాంసం తినకపోయినా, తెలంగాణ 7.5 కిలోలతో మొదటిస్థానంలో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ 7.2 కిలోలు, తమిళనాడు 6.5 కిలోలు, కర్ణాటక 6 కిలోలు, కేరళ 5.5 కేజీల చొప్పున వినియోగిస్తున్నాయి. మాంసం అత్యధికంగా వినియోగించే రాష్ట్రాల్లో మొదటి ఐదుస్థానాల్లో దక్షిణాది రాష్ట్రాలే ఉండటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన గొర్రెల పంపిణీ పథకం దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నది. కర్ణాటక మంత్రుల బృందం, రాజస్థాన్ ప్రభుత్వ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటించి పథకం అమలుతీరును తెలుసుకున్నారు. ఇక్కడి పథకాన్ని తమ రాష్ట్రాల్లో అమలుచేస్తామని పర్యటన సందర్భంగా పేర్కొన్నారు.

వేసవిలో పశుగ్రాసం, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి (ఫైల్)

దేశంలోనే గొర్రెలసంఖ్యలో తెలంగాణ మొదటిస్థానంలో నిలువడం ఆనందంగా ఉంది. సీఎం కేసీఆర్ ఆలోచనలనుంచి పుట్టిన గొర్రెల పంపిణీ పథకంతో రాష్ట్రంలో రూ.2,500 అదనపు సంపద సృష్టించగలిగాం. గొల్ల, కుర్మల కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. వేసవిలో గొర్రెలకు పశుగ్రాసం, తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నీటితొట్లు, ఎండనుంచి రక్షణకు షెడ్ల నిర్మాణం చేపడుతాం. ఫిబ్రవరి నుంచి మే వరకు జిల్లాకు 100 టన్నుల చొప్పున పశుగ్రాసం గింజలు పంపిణీ చేస్తాం. నీటితొట్ల నిర్మాణాలకు రూ.28వేలు, షెడ్ల నిర్మాణాలకు రూ.88,500 చొప్పున అందజేస్తాం.

- గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ఎండీ వీ లక్ష్మారెడ్డి

పండుటాకులు పెద్దమనసు చాటారు!

- వృద్ధ దంపతులకు కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెద్దమనసు చాటుకున్న వృద్ధ దంపతులను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మరోమారు అభినందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన వృద్ధదంపతులు సొంత డబ్బుతో నిర్మించిన రూ. కోటి విలువైన వృద్ధాశ్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన సంగతి తెలిసిందే. వారి దాతృత్వాన్ని గుర్తుచేసుకుంటూ శుక్రవారం మరోమారు కేటీఆర్ ట్వీట్ చేశారు. 'చౌటుప్పల్‌కు చెందిన వృద్ధదంపతులు శ్రీ సత్యనారాయణరెడ్డి, జానకమ్మ గారు పెద్దమనసు చాటుకున్నారు' అని కొనియాడారు.

ఎంసెట్ కన్వీనర్‌గా యాదయ్య

- లాసెట్‌కు జీబీరెడ్డి, ఎడ్‌సెట్‌కు మృణాళిని నియామకం
- తెలంగాణ సెట్స్ కన్వీనర్లను ప్రకటించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి



ప్రొఫెసర్ ఎన్ యాదయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఎంసెట్-2019 కన్వీనర్‌గా జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ఎన్ యాదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి శుక్రవారం తెలంగాణ సెట్స్ -2019 కన్వీనర్ల పేర్లను ప్రకటించారు. టీఎస్ఈసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూహెచ్ రెక్టార్ ఏ గోవర్ధన్, పీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ వీ సత్యనారాయణ (కేయూ), ఐసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ సీహెచ్ రాజేశం (కేయూ), లాసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ జీబీ రెడ్డి (ఓయూ), పీజీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎం కుమార్ (ఓయూ), ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ మృణాళిని (ఓయూ) నియమితులయ్యారు. సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్య చెప్పారు.

గిరిజన వర్సిటీ సాకారం

- ఆరు కోర్సులతో గిరిజన యూనివర్సిటీ
- ఈ ఏడాది జూలైనుంచే తరగతుల నిర్వహణ
- ఏర్పాట్లపై చర్చించిన సీఎస్ ఎస్కే జోషి



గిరిజన వర్సిటీ తరగతుల నిర్వహణ అంశాలపై శుక్రవారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ, విద్యాశాఖ, అటవీశాఖ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన యూనివర్సిటీ ద్వారా ఈ ఏడాది జూలైనుంచి ఆరు కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభించాలని, ప్రతి కోర్సులో 30 మంది విద్యార్థులను చేర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, కోర్సులు, మొదటి సంవత్సరం ఆయా కోర్సుల్లో తరగతుల నిర్వహణపై ఆయన శుక్రవారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ, విద్యాశాఖ, అటవీశాఖ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. గిరిజన యూనివర్సిటీ ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం జాకారం వద్ద నిర్వహిస్తున్న యువ శిక్షణ కేంద్రంలోనే తరగతులు నిర్వహించాలని, ఇందుకు అనుగుణంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాలని సీఎస్ సూచించారు. యూనివర్సిటీలో స్థానిక గిరిజన యువత కోసం 30 శాతం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయించాలని చెప్పారు. గిరిజన యూనివర్సిటీ ద్వారా ఈ ఏడాది బీఏ (హోటల్ మేనేజ్‌మెంట్), బీసీఏ, ఎంసీఏ, ఎంబీఏ (అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, ప్యాకేజింగ్‌పై ప్రత్యేక కోర్సులు) బీబీఏ, మాస్టర్స్ ఇన్ ట్రైబల్ కల్చర్ ఫోక్‌లోర్ (గిరిజన సంస్కృతి, జానపద కళలు) కోర్సుల్లో తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణాన్ని గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం చేపట్టాలని చెప్పారు. యూనివర్సిటీ స్థానిక గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించి రూ.10 కోట్లను గిరిజన సంక్షేమశాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాలని చెప్పారు. అటవీశాఖ భూమిలో చట్ట నిబంధనల మేరకు అనుమతించి గిరిజన సంస్కృతికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గిరిజన యూనివర్సిటీ కమిటీలో ఉన్నత విద్య, గిరిజన సంక్షేమం, అటవీశాఖ ముఖ్య కార్యదర్శులను సభ్యులుగా నియమించాలని, తరగతుల నిర్వహణకు అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని, తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని సీఎస్ ఎస్కే జోషి సూచించారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా, కమిషనరు క్రిస్టినా చౌంగ్తు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ దాసం వెంకటేశ్వర్లు, అదనపు పీసీసీఎస్ రఘువీర్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చక్రధర్‌రావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజశేఖర్, సీపీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

ఇతరులనూ ఆదుకుందాం

- ఆలిండియా వెలమ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు
- చిరాన్‌ఫోర్ట్ క్లబ్ వేదికగా ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ ప్రారంభం



శుక్రవారం బేగంపేటలోని చిరాన్‌ఫోర్ట్ క్లబ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఆ సంఘం ఆలిండియా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్

బేగంపేట్ : వెలమలతోపాటు, ఇతర సామాజికవర్గాలకు చెందిన పేదలను ఆదుకుందామని ఆలిండియా వెలమ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ బేగంపేటలోని చిరాన్‌ఫోర్ట్ క్లబ్ వేదికగా ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ ప్రారంభమైంది. అమెరికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, గల్ఫ్, యూరప్ దేశాలకు చెందిన వెలమ కులస్థులు హాజరైన ఈ సమావేశంలో భానుప్రసాద్‌రావు మాట్లాడారు. మెరిట్ ఆధారంగా మెడిసిన్, ఇంజినీరింగ్‌లలో సీట్లు సంపాదించుకున్నా నెలవారీ ఖర్చులు సైతం భరించుకోలేని వారు ఎందరో ఉన్నారని చెప్పారు. ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ అనే కాన్సెప్ట్‌తో ముందుకొచ్చిన రమేశ్, నర్సింగ్‌రావు, జగ్గన్న, కల్యాణ్, సాయిచరణ్, కల్వకుంట్ల ప్రసాద్, రామారావు తదితరులను భానుప్రసాద్‌రావు అభినందించారు. సంస్థ ప్రారంభించడంలో కీలకపాత్ర వహించిన నర్సింగ్‌రావు, జగ్గన్న మాట్లాడుతూ టెక్నాలజీతో ప్రపంచంలోని వెలమ కులస్థులను, వివిధ దేశాల్లోని సంస్థలను ఒకే గొడుకు కిందకు తెచ్చి పేదవారికి సహాయం చేయడంతోపాటు మంచి ఆలోచనలతో ముందుకొచ్చే యువతను ప్రోత్సహించడంలో ఓవర్సీస్ వెలమ అసోసియేషన్ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. సంఘం భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను ఆ అసోసియేషన్ ప్రతినిధి రమేశ్ గడవూరి వివరించారు. వైజాగ్ వెలమ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రావు మాట్లాడుతూ మనకు మనం సహాయం చేసుకుంటూ ఇతరవర్గాలకు సహాయం చేసేస్థాయికి ఎదుగాలని కోరారు. ఒడిశా వెలమ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిరంజీవి మాట్లాడుతూ భాష ఏదైనా మనందరిదీ ఒకేసంస్కృతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ టీ తిరుపతి, లాసెక్రటరీ నిరంజన్‌రావు, ఎక్సైజ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీ రవీందర్‌రావు, వెలమ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనర్సింగరావు, చెన్నాడి సుధాకర్‌రావు, జగన్మోహన్‌రావు, తన్నీరు బాపురావు, విఠల్‌రావు, నిజామాబాద్ వెలమ సంఘం మాజీ అధ్యక్షుడు రాంకిషన్‌రావు, టెక్ మహీంద్ర సీఈవో రంగినేని విజయ్, మహేశ్ తన్నీరు, అభిలాశ్, బాలకిషన్‌రావు, సుధీర్, నీలగిరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ రాధాకృష్ణన్ బదిలీ

- కలకత్తా హైకోర్టు సీజేగా నియామకం
- సుప్రీంకోర్టు జడ్జిలుగా జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాలకు పదోన్నతి
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ కలకత్తా హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంగన్ గొగోయ్ నేతృత్వంలో గురువారం సమావేశమైన ఐదుగురు సభ్యుల కొలీజియం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కలకత్తా సీజే జస్టిస్ డీకే గుప్తా డిసెంబర్ 31న పదవీ విరమణ చేయడంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సీజేను అక్కడికి బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది. మరోవైపు కర్ణాటక హైకోర్టు సీజే జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ ఖన్నాలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించింది. అలాగే జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రమత్ పట్నాయక్‌ను ఒరిస్సా హైకోర్టుకు, కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీఎస్ నాయుడిని బాంబే హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రానికి సిఫార్సు చేసింది. కొలీజియంలో సీజేఐతోపాటు జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.



జస్టిస్ టీబీ రాధాకృష్ణన్

సరిహద్దుల్లో ఐఈడీ పేల్చిన ఉగ్రవాదులు

ఆర్మీ మేజర్, సైనికుడు మృతి ■ పాక్ కాల్పుల్లో ఆర్మీ పోర్టర్ మరణం

జమ్ము, జనవరి 11: భారత సైనికుల్ని లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ఉగ్రవాదులు మారోమారు పెట్రేగిపోయారు. జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో అత్యాధునిక పేలుడు పదార్థాన్ని (ఐఈడీ) పేల్చడంతో ఆర్మీ మేజర్, ఒక సైనికుడు ప్రాణాలు కోల్పోయారు. రోజువారీ విధుల్లో భాగంగా శుక్రవారం నౌషెరా సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వద్ద సైనికులు గస్తీ తిరుగుతుండగా ఉగ్రవాదులు ఐఈడీ బాంబును పేల్చారు. ఈ ఘటనలో మేజర్, సైనికుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారు దవాఖానలో కన్నుమూసినట్లు అధికారులు ప్రకటించారు. మరో ఘటనలో రాజౌరి జిల్లా సుందర్బనీ సెక్టార్‌లో పాక్ సైనికులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఆర్మీ పోర్టర్ హేమరాజ్ మరణించారు. గత నాలుగు రోజులుగా రాజౌరి, పూంచ్ జిల్లాల్లో ఒప్పందాలకు తూట్లు పొడుస్తూ పాక్ సైనికులు నిరంతరాయంగా కాల్పులు జరుపుతున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన భారత సైనికులు కాల్పులతోనే పాక్‌కు గుణపాఠం చెప్పారు. మరోవైపు శ్రీనగర్‌లోని సీఆర్పీఎఫ్ బంకర్‌పై ఉగ్రవాదులు గ్రనేడ్ దాడి చేశారు. లాల్‌చౌక్ సిటీ సెంటర్ సమీపంలో ఉన్న సీఆర్పీఎఫ్ బంకర్‌పై మిలిటెంట్లు గ్రనేడ్ దాడి చేశారని, ఈ ఘటనలో ఎవరూ గాయపడినట్లు వివరాలు అందలేదని పోలీసులు చెప్పారు.



శ్రీనగర్‌లో ఉగ్రవాదులు గ్రనేడ్ దాడి జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న భద్రతా సిబ్బంది

జర్నలిస్టు హత్య కేసులో
డేరా అధిపతి గుర్మీత్ దోషి

మరో ముగ్గురు కూడా.. ■ ఈ నెల 17న శిక్షలు ఖరారు చేయనున్న సీబీఐ న్యాయస్థానం

పంచకుల, జనవరి 11: ఓ జర్నలిస్టు హత్య కేసులో డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాంరహీమ్ సింగ్, మరో ముగ్గురిని సీబీఐ కోర్టు దోషులుగా తేల్చింది. వీరికి శిక్షలను ఈ నెల 17న ప్రకటించనుంది. హర్యానాలోని సిర్సాలో ఉన్న డేరా సచ్చా సౌదా ప్రాంగణంలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని పేర్కొంటూ అందులో ఉన్న ఓ మహిళ రాసిన లేఖను 'పూరా సచ్' అనే సాయంకాల పత్రిక జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతి 2002లో ప్రచురించారు. ఈ నేపథ్యంలో అదే ఏడాది రాంచందర్ ఛత్రపతిని ఆయన ఇంటి బయట కొందరు కాల్చి చంపారు. దీనిపై గుర్మీత్‌తోపాటు మరో ముగ్గురిపై 2003లో కేసు నమోదైంది. అనంతరం 2006లో ఈ కేసును సీబీఐకి అప్పగించారు. దీనిలో భాగంగా శుక్రవారం విచారణ జరిపిన సీబీఐ కోర్టు గుర్మీత్‌పాటు మరో ముగ్గురిని దోషులుగా ప్రకటించింది. ఇద్దరు మహిళలపై లైంగికదాడి కేసులో ఇప్పటికే జైలు శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్ శుక్రవారం విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యాడు. దోషులుగా తేలిన వారిలో కుల్‌దీప్ సింగ్, నిర్మల్ సింగ్, క్రిషన్‌లాల్ ఉన్నారు.



అలోక్‌వర్మ రాజీనామా

- తనపై నిరాధార ఆరోపణలు చేసి బదిలీ చేశారంటూ కేంద్రంపై ఆగ్రహం
- కమిటీ ఎదుట వాదనలు వినిపించుకునే అవకాశం కల్పించలేదని ధ్వజం
- అందుకే పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీబీఐ మాజీ డైరెక్టర్ సంచలన ప్రకటన
- అగ్నిమాపక, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్స్ డీజీగా బదిలీ చేసిన గంటల్లోనే అనూహ్య నిర్ణయం
- రాకేశ్ ఆస్తానా ఫిర్యాదునే సీవీసీ యథాతథంగా తన నివేదికలో పేర్కొన్నట్లు విమర్శ
- ఆత్మవిమర్శ చేసుకోవాలంటూ కేంద్రానికి హితవు



న్యూఢిల్లీ, జనవరి 11: సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించి విస్మయానికి గురిచేశారు. సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి ఆయన్ను తప్పించి అగ్నిమాపక, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్స్ విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా గురువారం రాత్రి బదిలీ చేయడంతో మనస్తాపం చెందిన వర్మ గంటల వ్యవధిలోనే ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున ఖర్గే, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ప్రతినిధి జస్టిస్ ఏకే సిక్రీల నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఎదుట తన వాదనలను వినిపించుకునే అవకాశం కూడా ఇవ్వలేదని ఈ సందర్భంగా వర్మ వాపోయారు. కేంద్రం వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శికి వర్మ శుక్రవారం ఒక లేఖ రాశారు. కేంద్రం అవమానకర రీతిలో, కనీసం తన వాదనలు కూడా వినకుండా ఏకపక్షంగా బదిలీ చేసిందని 1979వ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వర్మ (61) తన లేఖలో ఆరోపించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా.. ఎవరో చేసిన ఆరోపణలకు తనను బలి చేశారని విమర్శించారు.

సహజ న్యాయ సూత్రాన్ని విస్మరించారు

'ప్రధాని నేతృత్వంలోని కమిటీ సహజ న్యాయ సూత్రాన్ని పూర్తిగా విస్మరించింది. సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి నన్ను తప్పించేందుకు విచారణ ప్రక్రియను పూర్తిగా తప్పుదోవ పట్టించారు. సెంట్రల్ విజిలెన్స్ కమిటీ (సీవీసీ) నివేదికను అడ్డం పెట్టుకుని వాస్తవాలను నిర్ధారించుకోకుండానే ఏకపక్షంగా నన్ను తొలిగించారు. కమిటీ ఎదుట నా వాదనల్ని వినిపించుకునే అవకాశం నాకు కల్పించలేదు. సీబీఐ విచారణ జరుపుతున్న వ్యక్తి (రాకేశ్ ఆస్తానా) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే సీవీసీ తన నివేదికను రూపొందించింది' అని వర్మ విమర్శలు గుప్పించారు. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా సంతకం చేసి ఇచ్చిన ఫిర్యాదును యథాతథంగా సీవీసీ తన నివేదికలో పేర్కొందని ఆరోపించారు. సీవీసీ రిపోర్టులో కొత్త అంశాలేవీ లేవని పేర్కొన్నారు. సీబీఐలో అంతర్గత కుమ్ములాటలు, అవినీతి ఆరోపణలపై జరుగుతున్న విచారణను పర్యవేక్షిస్తున్న రిటైర్డ్ జస్టిస్ ఏకే పట్నాయక్ కమిటీ ఎదుట ఆస్తానా ఒక్కసారి కూడా హాజరు కాలేదని చెప్పారు. సీవీసీ నివేదికలో పేర్కొన్న అంశాలకు జస్టిస్ పట్నాయక్ ఆమోదముద్ర వేయలేదని వర్మ గుర్తుచేశారు. దేశంలో ఇప్పటికీ సీబీఐ అత్యంత విశ్వసనీయమైన, సమర్థమైన, కీలక సంస్థ అని పేర్కొన్నారు. 'కేంద్రం సీవీసీని అడ్డుపెట్టుకుని సీబీఐ లాంటి స్వతంత్ర సంస్థను ఎలా ఇబ్బందులకు గురిచేస్తుందనేందుకు నా బదిలీ సంఘటనే తాజా ఉదాహరణ. ఈ విషయంలో కేంద్రం ఇప్పటికైనా సమిష్టిగా ఆత్మపరిశీలన చేసుకోవాలి' అని పేర్కొన్నారు.

ఆరోపణలన్నీ అవాస్తవం

తనపై నిరాధారమైన, నిష్ప్రయోజనమైన, తప్పుడు ఆరోపణలు చేసి పదవి నుంచి తొలిగించారని కేంద్రంపై వర్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. తనపై మోపిన అభియోగాలపై కనీసం విచారణ కూడా జరుపలేదని ధ్వజమెత్తారు. 'అవినీతి కేసుల దర్యాప్తు విషయంలో బయటి శక్తుల ప్రమేయం లేకుండా సీబీఐ స్వతంత్రంగా పనిచేయాలి. సంస్థ సమగ్రత, విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరిగినా వాటిని నిలువరించాను. కానీ, న్యాయపరమైన సమ్మతి లేకుండా అక్టోబర్ 23, 2018న కేంద్రం, సీవీసీ నాకు వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీచేశాయి. నిరాధారమైన ఆరోపణలతో నన్ను బలవంతంగా, నిరవధికంగా సెలవులపై పంపారు. మరో 21 రోజుల్లో నా పదవీకాలం ముగియనున్న తరుణంలో సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోకుండా బదిలీ చేశారు' అని పేర్కొన్నారు. 2017, జూలై 31 నాటికే తాను పదవీ విరమణ చేశానని, కానీ కేంద్రం సీబీఐ డైరెక్టర్‌గా మరో అవకాశం కల్పించిందని వర్మ చెప్పారు. 2019, జనవరి 31 వరకు సీబీఐ డైరెక్టర్‌గా తన పదవీకాలం ఉందని, ఇంతలోనే బదిలీ చేశారని పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే తన పదవీ విరమణ వయస్సు దాటిపోయింది కాబట్టి, అగ్నిమాపక, హోంగార్డుల డీజీగా కూడాతాను సేవలందించలేనని చెప్పారు. తన పదవీ విరమణ ఇప్పట్నుంచే అమల్లోకి వస్తున్నట్లు గుర్తించాలని లేఖలో పేర్కొన్నారు.

మచ్చ లేకుండా నాలుగు దశాబ్దాలుగా సేవలు

ప్రజా సేవలో నాలుగు దశాబ్దాలకు పైగా ఉన్నానని, కానీ ఎన్నడూ ఒక మచ్చ కూడా తనపై పడలేదని అలోక్ వర్మ చెప్పారు. 'ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా సేవలందించాను. అండమాన్-నికోబార్ దీవుల్లో పోలీసు బలగాలకు నేతృత్వం వహించాను. పుదుచ్చేరి, మిజోరాం రాష్ట్రాల్లో పనిచేశాను. ఢిల్లీ జైళ్లశాఖకు, సీబీఐకి నేతృత్వం వహించిన అరుదైన రికార్డు నాది. ఇన్నేండ్లపాటు సేవ చేసే భాగ్యం కల్పించిన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు, నాకు సహకరించిన సంస్థలు, అధికారులకు కృతజ్ఞతలు' అని తెలిపారు.

ఆస్తానాకు చుక్కెదురు

- లంచాల కేసు కొట్టివేతకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ
- క్రిమినల్ విచారణ నుంచి రక్షణ కల్పించే ఉత్తర్వు రద్దు
- 10 వారాల్లోగా దర్యాప్తు పూర్తిచేయాలని సీబీఐకి ఆదేశం



న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాకు శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురయ్యింది. లంచాలు స్వీకరించారన్న ఆరోపణలతో ఆస్తానాపై దాఖలైన కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించడంతోపాటు క్రిమినల్ విచారణల నుంచి ఆయనకు రక్షణ కల్పిస్తూ గతంలో జారీచేసిన తాత్కాలిక ఉత్తర్వును రద్దుచేసింది. సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దేవేందర్ కుమార్‌తోపాటు మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మనోజ్ ప్రసాద్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసేందుకు కూడా జస్టిస్ నజ్మీ వజీరీ నిరాకరించారు. ఈ కేసుకు సంబంధించిన వాస్తవాలను పరిశీలిస్తే.. రాకేశ్ ఆస్తానా, దేవేందర్ కుమార్‌లను ప్రాసిక్యూట్ చేసేందుకు ముందస్తు అనుమతి అవసరంలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసులో ఆస్తానా, ఇతరులపై 10 వారాల్లోగా దర్యాప్తు పూర్తిచేయాలంటూ సీబీఐని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో అప్పటి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ 'దురుద్దేశం'తో వ్యవహరించినట్టు చేసిన ఆరోపణను నిరూపించలేకపోయారని న్యాయస్థానం పేర్కొన్నది. తమపై దాఖలైన కేసును సవాలుచేస్తూ ఆస్తానా, దేవేందర్ కుమార్, మనోజ్ ప్రసాద్ దాఖలు చేసుకున్న పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. నేరపూరిత కుట్రకు, అవినీతికి, నేరపూరిత ప్రవర్తనకు పాల్పడ్డాడన్న ఆరోపణలతో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఆస్తానాపై ఈ కేసు దాఖలయింది. ఓ కేసులో ఉపశమనాన్ని పొందేందుకు లంచం ఇచ్చానంటూ హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సానా సతీశ్‌బాబు చేసిన ఫిర్యాదు మేరకు ఆస్తానాపై ఈ కేసు నమోదు చేశారు. ఆస్తానా తీవ్రమైన అక్రమాలకు, బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారని, తలబిరుసుతో వ్యవహరించారని కూడా సానా సతీశ్ తన ఫిర్యాదులో ఆరోపించారు.

వర్మ చేసిన బదిలీలను రద్దుచేసిన నాగేశ్వరరావు



న్యూఢిల్లీ: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన ఎం.నాగేశ్వరరావు... మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ గురువారం చేసిన బదిలీలను రద్దు చేస్తూ ఆగమేఘాలపై ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా అధికారులను యథావిధిగా వారి స్థానాల్లోనే నియమిస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు సీబీఐ అధికార ప్రతినిధి, ముఖ్య సమాచార అధికారిగా సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ నితిన్ వాకంకర్‌ను నియమించారు. గతంలో ఈ స్థానంలో ఉన్న అభిషేక్ దయాల్‌ను పబ్లికేషన్స్ విభాగానికి బదిలీ చేశారు. సంయుక్త డైరెక్టర్ స్థాయిలోని నలుగురు అధికారులను కూడా ఆయన బదిలీ చేశారు.

బీఎస్పీతో కలిసి బీజేపీని ఓడిస్తాం

- అమేథీ, రాయ్‌బరేలీలో పోటీ చేయబోమన్న అఖిలేశ్
- నేడు మాయావతితో కలిసి మీడియా ముందుకు

కనోజ్, జనవరి 11: ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీఎస్పీతో కలిసి పోటీ చేసి బీజేపీని ఓడించామని, త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఎస్పీతో కలిసి బీజేపీని దారుణంగా ఓడిస్తామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చెప్పారు. 'ఉప ఎన్నికల్లో మా అంచనాలు తప్పలేదు.. ఈసారి కూడా తప్పవు' అని ఆయన భరోసా వ్యక్తం చేశారు. శుక్రవారం అఖిలేశ్ యాదవ్ యూపీలోని చౌపాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు విషయాన్ని శనివారం మాయావతితో కలిసి ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు గురించి విలేకరులు ప్రశ్నించినపుడు..ఆ పార్టీ నాయకులే స్పందించనప్పుడు తాను పొత్తు గురించి ఎందుకు మాట్లాడాలన్నారు. కానీ అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాలను ఆ పార్టీకి వదిలేస్తున్నామని చెప్పారు. ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ అగ్రనేతలైన రాహుల్, సోనియాగాంధీ ఎంపీలుగా కొనసాగుతున్న నేపథ్యంలోనే తాము పోటీ చేయడం లేదని పేర్కొన్నారు. 'మా పొత్తును చూసి బీజేపీ మాత్రమే భయపడటం లేదు. కాంగ్రెస్ కూడా వణికిపోతున్నది' అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'హమారా కామ్ బోల్తాహై(మేము చేసిన పనులే మాట్లాడుతాయి).. బీజేపీకా ధోకా బోల్తాహై(బీజేపీ చేసిన మోసం మాట్లాడుతుంది)' అనే నినాదంతో ముందుకు వెళ్లనున్నట్లు అఖిలేశ్ ప్రకటించారు.

దేశంలో సూపర్ ఎమర్జెన్సీ



'**అధికార** బీజేపీ రాజకీయ లబ్ధి కోసం సీబీఐని దుర్వినియోగపరుస్తున్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఆర్బీఐలాంటి సంస్థలను కూడా నాశనం చేస్తున్నది. పౌరసత్వ ముసాయిదా బిల్లుకు మతం రంగు పులమడానికి ప్రయత్నిస్తున్నది. ఈ రోజు పార్లమెంట్‌లో బలం ఉందికదా అని పౌరసత్వ బిల్లును ఆమోదించుకున్నారు. రేపు కేంద్రంలో ప్రభుత్వం మారితే ఈ బిల్లును మార్చదా? మోదీ పాలనను చూస్తుంటే దేశంలో సూపర్ ఎమర్జెన్సీ ఉన్నట్లు కనిపిస్తున్నది'

–మమతాబెనర్జీ (పశ్చిమబెంగాల్ సీఎం)

సీవీసీ భుజాల మీద నుంచి రాజకీయ బుల్లెట్లు

'**కేంద్రం**.. సీవీసీ భుజాల మీద నుంచి రాజకీయ బుల్లెట్లు పేల్చుతున్నది. సీవీసీ కూడా డబుల్ గేమ్ ఆడుతున్నట్లు కనిపిస్తున్నది. ఎలాంటి అవినీతి ఆధారాలు లేకుండా కేవలం ఆరోపణలను ప్రామాణికంగా తీసుకొని సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి వర్మను తొలిగించాలంటూ సీవీసీ ఎలా సిఫారసు చేస్తుంది? పంజరంలోని చిలుక(సీబీఐ) ఎగిరిపోకుండా ప్రభుత్వం అందులోనే బంధించింది. ఎందుకంటే ఆ చిలుక బయటికి వస్తే తమకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందేమోనని ప్రభుత్వ భయం'.

–అభిషేక్ సింఘ్వి, కపిల్ సిబల్ (కాంగ్రెస్ నాయకులు)

రాఫెల్ భయం వల్లే అలోక్‌ను తొలిగించారు



'**రాఫెల్** యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై అలోక్ వర్మ దర్యాప్తునకు ఆదేశిస్తాడేమోనన్న భయంతో ప్రధాని మోదీ కుట్రకు తెరలేపారు. సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మను తొలిగించడానికి రెండు నెలలుగా తీవ్రంగా ప్రయత్నించారు. అన్ని రకాల అవకాశాలను వినియోగించుకొని చివరికి ఆయనను తొలిగించారు.

–కేజ్రీవాల్ (ఢిల్లీ సీఎం)

సీబీఐ డైరెక్టర్ బదిలీ అక్రమం

సీబీఐ డైరెక్టర్‌ను ఆగమేఘాలమీద బదిలీ చేయడం అక్రమం, అధికారాలను దుర్వినియోగం చేయడమే. సుప్రీం తీర్పుతో సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మ విధుల్లో చేరడం ఇష్టంలేని ప్రధాని మోదీ వెంటనే ఆయనను ఫైర్‌సర్వీసెస్ విభాగానికి బదిలీ చేయడం దారుణం. రాఫెల్ కుంభకోణం నుంచి తప్పించుకోవడానికే ఈ బదిలీ చేశారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కును ప్రధాని స్వార్థానికి వాడుకున్నారు.

–మాజీ ఎంపీ మల్లు రవి


ప్రధానే చట్టాన్ని ధిక్కరిస్తే..



'రాఫెల్ కుంభకోణం బయటపడుతుందన్న భయంతోనే ప్రధాని మోదీ సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను బదిలీ చేశారు. సీబీఐపై ఇటువంటి చర్య గత 55 సంవత్సరాలుగా ఎన్నడూ జరుగలేదు. అందుకే అలోక్‌వర్మ రాజీనామా చేశారు. ప్రధాని స్థాయిలోనే చట్టాల ధిక్కరణ జరిగితే ప్రజాస్వామ్యం మనుగడ ఎలా సాధ్యమవుతుంది?'

– కే నారాయణ (సీపీఐ జాతీయ కార్యదర్శి)

గగన్‌యాన్‌లో మహిళా వ్యోమగామి!



► మూడో పేజీ తరువాయి...

గగన్‌యాన్ కీలక మలుపు అని చెప్పారు. ఈ మానవ సహిత యాత్రకు సంబంధించి ఇస్రో ప్రత్యేకంగా హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సెంటర్‌కు సీనియర్ శాస్త్రవేత్త ఉన్నికృష్ణన్ నాయర్ డైరెక్టర్‌గా ఉంటారని, డాక్టర్ కే హట్టన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో ఇంజనీరింగ్, హ్యూమన్ సైన్స్ అనే రెండు విభాగాలు ఉన్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో ఉండే లాంచ్ వెహికల్, క్రూ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్‌లో ఇస్రోకు ప్రావీణ్యత ఉందని, అయితే హ్యూమన్ సైన్స్ విభాగంలో వ్యోమగాముల ఎంపిక, శిక్షణ, వారికి అనువైన వాతావరణం రూపొందించే అంశాలు ఇస్రోకు కొత్త అని చెప్పారు. గగన్‌యాన్ ప్రాజెక్టుకు ఈ ఏడాది అధిక ప్రాధాన్యమిస్తామని శివన్ తెలిపారు. 2020 డిసెంబర్‌లో తొలి మానవ రహిత రోదసి యాత్రను, 2021 జూలైలో రెండో యాత్రను చేపడతామని, ఇవి పూర్తయిన తర్వాత 2021 డిసెంబర్‌లో మానవ సహిత యాత్ర చేపట్టనున్నట్లు వివరించారు. గగన్‌యాన్‌కు సంబంధించి వ్యోమగాములకు ప్రాథమిక శిక్షణ మనదేశంలోనే ఇస్తామని, తదుపరి అడ్వాన్స్‌డ్ శిక్షణ రష్యాలో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వ్యోమగాముల బృందంలో మహిళ కూడా ఉండాలని, అదే తమ లక్ష్యమని చెప్పారు. పురుషులతో పాటు మహిళలకూ శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. వ్యోమగాముల ఎంపికపై స్పందిస్తూ... భారత వాయుసేన సహాయంతో భారతీయులే ఈ ప్రక్రియను పూర్తి చేస్తారని, చివరి దశలో మాత్రం విదేశీ సంస్థ సహకారం కూడా తీసుకుంటామన్నారు. గగన్‌యాన్ ప్రయోగం విజయవంతమైతే మానవులను స్వతంత్రంగా రోదసిలోకి పంపిన నాలుగో దేశంగా భారత్ ఘనత సాధిస్తుంది. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ గగన్‌యాన్ ప్రాజెక్టు గురించి ప్రకటిస్తూ 2022 నాటికి భారత పుత్రిక లేదా పుత్రుడు అంతరిక్షంలోకి జాతీయ జెండాను మోసుకెళతారని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు కేటాయించేందుకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపింది.

చైనాతో పోటీపడుతున్నాం

చంద్రుడిపైకి భారత్ చేపడుతున్న రెండో ప్రయోగమైన 'చంద్రయాన్-2'ను ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ వెల్లడించారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మధ్య ఈ ప్రయోగాన్ని చేపట్టాలని తొలుత నిర్ణయించినా, కొన్ని పరీక్షలు నిర్వహించలేకపోయిన కారణంగా ప్రయోగాన్ని ఏప్రిల్‌కు వాయిదా వేసినట్లు వివరించారు. పదేండ్ల కిందట ప్రయోగించిన చంద్రయాన్-1కు ఇది అడ్వాన్స్‌డ్ వర్షన్ అని చెప్పారు. రూ.800 కోట్ల వ్యయంతో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ ప్రయోగం చేపడతున్నట్లు తెలిపారు. చంద్రయాన్-2లో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ ఉంటాయన్నారు. రోవర్ అంతరిక్ష ప్రయోగాల విషయంలో చైనాతో భారత్ ఏమాత్రం వెనుకబడి లేదని శివన్ స్పష్టం చేశారు. చంద్రుడి ఆవలివైపునకు చైనా రోవర్‌ను పంపిందని, అయితే ఇంతవరకు ఎవరూ చేరని చంద్రుడి దక్షిణ ధ్రువం వైపు భారత్ వెళుతున్నదని వివరించారు. ఆ ప్రాంతంపై ఇప్పటివరకూ ఎవరూ పరిశోధనలు జరుపలేదని, అక్కడ నీరు ఉండే అవకాశం ఉందన్నారు.

2020 నాటికి సూర్యుడిపై ప్రయోగాలు

గతేడాది 26 రోదసి ప్రయోగాలు చేపట్టినట్లు శివన్ తెలిపారు. ఇస్రో చరిత్రలోనే అత్యంత బరువైన ఉపగ్రహం జీశాట్-11ను కూడా గతేడాది ప్రయోగించారు. అలాగే జీఎస్ఎల్వీ మార్క్-3 క్రూ మాడ్యూల్‌ను కూడా పరీక్షించారు. ఇక ఈ ఏడాది ఇస్రో 32 ప్రయోగాలు చేపట్టనుంది. ఇందులో 14 రాకెట్లు, 17 ఉపగ్రహాలు, ఒక టెక్ డెమో మిషన్ ఉండనుంది. జనవరి 17న 'ఉన్నతి'(యూనిస్పేస్ నానో శాటిలైట్ అసెంబ్లీ అండ్ ట్రైనింగ్ బై ఇస్రో) ప్రోగ్రామ్‌ను ఇస్రో ప్రారంభించనుంది. పునర్వినియోగ అంతరిక్ష వాహక నౌకను కూడా ఈ ఏడాది పరీక్షించనున్నారు. సూర్యుడిపై పరిశోధనల కోసం 'ఆదిత్య-ఎల్1' ప్రయోగాన్ని 2020 నాటికి చేపట్టేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత తేలికైన, చవకైన వాహన నౌక ఎస్ఎస్ఎల్వీని ఈ ఏడాది జూలైలో పరీక్షించేందుకు ఇస్రో సిద్ధమవుతున్నది.

శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో..
నళిని చిదంబరంపై సీబీఐ చార్జిషీట్



న్యూఢిల్లీ, జనవరి 11: శారదా చిట్ ఫండ్ కుంభకోణానికి సంబంధించి మనీ ల్యాండరింగ్ కేసులో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం భార్య నళిని చిదంబరానికి వ్యతిరేకంగా సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. కోల్‌కతాలోని బరాసత్ కోర్టులో శుక్రవారం ఈ చార్జిషీట్ సమర్పించింది. శారదా చిట్ ఫండ్ స్కామ్‌లో నళిని రూ.1.4 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు సీబీఐ ఆరోపించింది. శారదా గ్రూప్ వ్యవస్థాపకులు సుదీప్తా సేన్‌తో కలిసి నళిని నిధుల దుర్వినియోగం చేయడంతోపాటు మోసపూరిత కుట్రకు పాల్పడ్డారని పేర్కొంది. 2016లో తొలిసారి ఈ కేసులో సాక్షిగా నళినికి దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేశాయి. టీవీ చానల్ ఒప్పందానికి సంబంధించి శారదా గ్రూప్ తరపున వాదనలు వినిపించేందుకు ఆమె రూ.1.26 కోట్లు ఫీజుగా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సీబీఐ తాజాగా దాఖలు చేసిన ఆరో అనుబంధ చార్జిషీటులో నళినితోపాటు అరుంధతీ ప్రింటర్స్ అండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సుదీప్తా సేన్ నిందితులుగా ఉన్నారు. 2013లో పశ్చిమ బెంగాల్‌లో వెలుగుచూసిన శారద చిట్‌ఫండ్ కుంభకోణం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అధిక మొత్తంలో చెల్లిస్తామని ఇన్వెస్టర్లు, ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిన శారదా గ్రూప్ అనంతరం బోర్డు తిప్పేసింది. దీనిపై బెంగాల్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగా, 2014లో సుప్రీంకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. ఈ కుంభకోణంలో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు మంత్రులు, నేతలు అరెస్టయ్యారు.

హెచ్1బీ వీసాదారులకు సులభంగా పౌరసత్వం

- త్వరలోనే నిబంధనల్లో మార్పులు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్
- భారతీయ నిపుణులకు ప్రయోజనకరం



వాషింగ్టన్: హెచ్1-బీ వీసాదారులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుభవార్త అందించారు. అమెరికాలో ఉండేందుకు, సులభంగా అమెరికా పౌరసత్వం పొందేందుకు మార్గం సుగమం చేసేలా హెచ్1బీ విధానాల్లో త్వరలోనే మార్పులు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రతిభను ప్రోత్సహించేందుకు, అత్యంత నిపుణులైన ఉద్యోగులు అమెరికాలో ఉద్యోగావకాశాలు పొందేందుకు వీలుగా తమ ప్రభుత్వం హెచ్1బీ నిబంధనలను సరళీకృతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ట్రంప్ శుక్రవారం ట్వీట్ చేశారు. అమెరికాలో ఉద్యోగం చేసే భారతీయ ఐటీ నిపుణులు, ఇతర ఉద్యోగులకు దీని ద్వారా ప్రయోజనం చేకూరనుంది. అమెరికాలో చట్టబద్ధంగా శాశ్వతంగా నివసించేందుకు అవసరమైన గ్రీన్‌కార్డు పొందాలంటే ప్రస్తుతం సుమారు పదేండ్లు వేచిచూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రకటన భారతీయ నిపుణులకు ఊరటనివ్వనుంది. హెచ్1బీ వీసాల జారీ, పొడిగింపు విషయంలో తొలి రెండేండ్ల పదవీకాలంలో ట్రంప్ కఠినంగా వ్యవహరించారు. అత్యంత నిపుణులైన ఉద్యోగులను ఆకట్టుకునేందుకు, వారు అమెరికాలోనే ఉండేలా చూసేందుకు హెచ్1బీ వీసాల విషయంలో ట్రంప్ తాజాగా కీలక ప్రకటన చేశారు. అమెరికాకు వలసలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా ప్రతిభ ఆధారిత వలస విధానం తీసుకురావాలని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానిస్తున్న విషయం తెలిసిందే. హెచ్1బీ దరఖాస్తుదారుల్లో అత్యంత నిపుణులైన వారినే ఎంపిక చేయాలని హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ కిర్స్ట్‌జెన్ నీల్సన్ గత నెలలో అమెరికా చట్టసభ్యులను కోరారు.



ఎన్డీయేలోకి పాత మిత్రులందరినీ ఆహ్వానిస్తున్నామని మోదీ అంటున్నారు. మోదీ ఉన్న కూటమిలోకి మేం వెళ్లే ప్రసక్తే లేదు. మోదీ ఎన్నటికీ వాజపేయి కాలేడు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సమగ్రత ప్రమాదంలో పడింది. సామాజికన్యాయం పాతర వేయబడింది. గంజాయి వనంలో తులసిమొక్క వంటివాడు వాజపేయి.

ఎం.కె.స్టాలిన్, డీఎంకే అధినేత

గత కొన్నేండ్లుగా దేశంలో కొంతమంది జాతీయత, దేశభక్తి ముసుగులో మూకదాడులు చేస్తున్నారు. హత్యలు చేస్తున్నారు. మతపరమైన విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. కశ్మీర్‌లో అంతులేని హత్యాకాండ జరుగుతున్నది. దేశ ప్రజలు కశ్మీర్ ప్రజల బాధలను పట్టించుకోవాలి, కాపాడాలి.

షా ఫైజల్, కశ్మీర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి



చరిత్రలో నేడు



1820
ఆస్ట్రానమికల్ సొసైటీ ఆఫ్ లండన్ ఇంగ్లండ్‌లో ప్రారంభం.

1898
మొదటిసారి ఎక్స్-రే ఫొటో తీసిన డాక్టర్ హెర్రీ స్మిత్, డేవిడ్సన్.





1954
న్యూజిలాండ్ పార్లమెంట్‌ను ప్రారంభించిన ఎలిజబెత్ రాణి-II

ప్రపంచవ్యాప్తంగా 2019 ఆరంభం నాటికి వివిధ దేశాల్లో సరికొత్త వాదాలు ముందుకు వచ్చాయి. ముఖ్యంగా జాతీయవాద నినాదాలతో పాలక ప్రభుత్వాలు తమ విధానాలకు పదునుపెట్టాయి. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం మెక్సికో సరిహద్దు వెంట గ్రేట్ వాల్ ఆఫ్ అమెరికా పేరిట గోడను నిర్మించటానికి తలపెట్టారు. అలాగే భారత్‌లో ప్రధాని మోదీ జాతీయవాద నినాదంతో దూసుకుపోవటానికి ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద వర్తమాన ప్రపంచపు దిశను మార్చేదిగా జాతీయవాదాలు ముందుకురావటం గమనార్హం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సిరియా నుంచి అమెరికా సేనలు దశలవారీగా ఉపసంహరించుకుంటామన్న ట్రంప్ ప్రకటన ఆచరణలో అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నది. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. సిరియాలో ఐఎస్ ఉగ్రవాదులు పూర్తిగా సమసిపోకముందే అమెరికా సేనలు వైదొలుగుతూ, ఆ ప్రాంతంలో శాంతిస్థాపనకు విఘాతం కలుగుతుందని ఆయన అంటున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా జాతీయ భద్రతా సలహాదారుని కలువటానికి కూడా ఎర్డోగన్ నిరాకరించటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

ది హిందూ

సీబీఐలో సంక్షోభం

దేశంలోని ప్రధానమైన దర్యాప్తు సంస్థపై నీలినీడలు ప్రసరించడం కొత్త కానప్పటికీ, ఈ వ్యాధి ముదిరిపోవడం, రాజకీయ నాయకత్వంపై కూడా అనుమానాలు ప్రసరించడం తీవ్ర ఆందోళనకరం. సీబీఐ కేంద్రంగా దాదాపు మూడు నెలలుగా నెలకొన్న పరిణామాలు ఈ సంస్థ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చాయి. అలోక్ వర్మను హుటాహుటిన సీబీఐ డైరెక్టర్ పదవిని నుంచి తప్పించడం వివాదాస్పదమైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే ప్రధాని నేతృత్వంలోని కమిటీ ఆయనను బదిలీ చేయడం తాత్కాలిక డైరెక్టర్ మళ్లీ బాధ్యతలు చేపట్టం వేగంగా జరిగిపోయాయి. అలోక్‌వర్మ నిర్ణయాలను తాత్కాలిక డైరెక్టర్ అతివేగంగా మార్చాడు. మళ్లీ అలోక్‌వర్మ బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే గత బదిలీలు చేపట్టాడు. ఈయన తీసుకున్న నిర్ణయాలను ఇప్పుడు మళ్లీ తాత్కాలిక డైరెక్టర్ రద్దు చేశాడు. దేశంలోనే కీలకమైన దర్యాప్తు సంస్థలో చిన్నపిల్లల ఆటలాగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరం. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఏండ్ల తర్వాత కూడా వ్యవస్థలు ఇంకా కుదుట పడలేదా? లేదా స్థిరపడిన వ్యవస్థలను నిర్వీర్యపరుస్తున్నారా? అసలు సీబీఐలోని గ్రూపుల వివాదం కాదని, సీబీఐ స్వతంత్రంగా పనిచేయకుండా రాజకీయ నాయకత్వం అడ్డు తగులుతున్నదని ఆరోపణలు బలంగా ఉన్నాయి. సీబీఐకి, రాజకీయ నాయకత్వానికి మధ్య వివాదమైతే దానిని ఇంకా తీవ్రమైన విషయంగా పరిగణించాల్సిందే. ఒక్క సీబీఐ మాత్రమే కాదు, అనేక వ్యవస్థలు నిర్వీర్యమైపోతున్నాయనే ఆరోపణలు ఇటీవలికాలంలో వస్తున్నాయి. ఈ పరిస్థితికి రాజకీయ నాయకత్వమే బాధ్యత వహించక తప్పదు.


సీబీఐ డైరెక్టర్‌గా ఉన్న అలోక్ వర్మ రెండవ స్థానంలో ఉన్న కీలక అధికారి రాకేశ్ ఆస్థానాపై చర్య తీసుకోవాలని భావించడంతో సీబీఐలో సంక్షోభం పతాకస్థాయికి చేరుకున్నది. రాకేశ్ ఆస్థానా గుజరాత్‌కు చెందిన అధికారి. రాజకీయ నాయకత్వానికి సన్నిహితుడనే అభిప్రాయం ఉన్నది. అతడిపై అవినీతి ఆరోపణలకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ దాఖలైంది. అయితే ఉన్నతాధికారి కనుక అతడిని అరెస్టు చేయడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఇందుకు ప్రభుత్వ అనుమతిని కోరినప్పుడు, కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. ఈ క్రమంలో వర్మ, ఆస్థానా మధ్య పరస్పరం అవినీతి ఆరోపణలు సాగాయి. ప్రధాని సముదాయింప ప్రయత్నించినట్టు, సాధ్యం కాపోవడంతో ఇరువురిని బదిలీ చేసినట్టు కనిపిస్తున్నది. కానీ అలోక్ వర్మను తొలిగించినప్పటికీ, తమపై బురద పడకుండా కేంద్రం జాగ్రత్తగా పావులు కదిపిందనే ఆరోపణలున్నాయి. కేంద్రం అలోక్ వర్మను బదిలీ చేయడం ద్వారా తొలిగించడం లేదనే విధంగా వ్యవహరించింది. అలోక్ వర్మతో పాటు ఆస్థానాను కూడా తొలిగించింది. కానీ ఇరువురిని తొలిగించిన తదుపరి పగ్గాలు తీసుకున్న తాత్కాలిక డైరెక్టర్ ఆస్థానాపై దర్యాప్తు జరుపుతున్న అధికారులను బదిలీ చేయడం గమనార్హం. దీన్నిబట్టి కేంద్రం తనకు వ్యతిరేకంగా ఉన్న అలోక్ వర్మను తొలిగించి, తమకు అప్తుడైన ఆస్థానాను కాపాడుకున్నదనే అభిప్రాయానికి ఆస్కారం ఏర్పడ్డది. కేంద్రంలోని ఒక కీలక నాయకుడిపై ఉన్న ఆరోపణలపై దర్యాప్తు పట్ల అలోక్ వర్మ ఆసక్తి ప్రదర్శించాడనేది ఒక కథనం. బీహార్‌కు చెందిన ఒక రాజకీయ నాయకుడిని ఇబ్బంది పెట్టడానికి సీబీఐని సాధనంగా వాడుకోవాలనే కుట్రకు అలోక్ వర్మ సహకరించలేదని కూడా అనుకుంటున్నారు. రాఫెల్, బొగ్గు మొదలైన కుంభకోణాలపై దర్యాప్తు సాగుతున్న దశలో అందుకు సంబంధించిన అధికారులపై ఒత్తిళ్ళు పెరిగాయని తెలుస్తున్నది.

> **రాజకీయ నాయకులు తమ అనుకూలమైన వ్యక్తులను నియమించుకోవడం వల్లనే సీబీఐకి పంజరంలోని చిలుక అనే ముద్ర పడ్డది. ఈ రెండు జాడ్యాలకు అంతిమంగా బాధ్యత వహించాల్సింది రాజకీయ నాయకత్వమే. రాజకీయ నాయకత్వం నిజాయితీగా ఉండాలె. సీబీఐ అధికారులు కర్తవ్య పారాయణులై ఉండాలె.**

అలోక్ వర్మ, రాకేశ్ ఆస్థానా వివాదంలో దోషమెవరిదైనా సీబీఐ ప్రతిష్ఠ మసకబారుతున్నది. సీబీఐ డైరెక్టర్లపై ఆరోపణలు రావడం ఇది మొదటిసారి కాదు. రంజిత్ సిన్హా పలు కేసులలో నిందితులకు తోడ్పడ యత్నించాడని, దర్యాప్తుల్లో జోక్యం చేసుకున్నాడని వచ్చిన ఆరోపణలు ప్రాథమికంగా నమ్మదగినట్టుగా ఉన్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడ్డది. ఆయనను 2జీ టెలికం కేసుల నుంచి దూరంగా ఉండాలని ఆదేశించింది. ఈడీ దర్యాప్తులో ఉన్న మాంసం వ్యాపారి మొయిన్ ఖురేశీతో సంబంధాలున్నందుకు ఏపీసింగ్‌పై కేసులు ఉన్నాయి. ఇదే కేసుకు సంబంధించి సీబీఐలోని ఒక దర్యాప్తు అధికారి అరెస్టయ్యాడు. సీబీఐలో అవినీతి పెరిగిపోవడం ఒక విషయమైతే, నిజాయితీ గల అధికారులపై రాజకీయ ఒత్తిడులు ఉండటం రెండవ అంశం. రాజకీయ నాయకులు తమ అనుకూలమైన వ్యక్తులను నియమించుకోవడం వల్లనే సీబీఐకి పంజరంలోని చిలుక అనే ముద్ర పడ్డది. ఈ రెండు జాడ్యాలకు అంతిమంగా బాధ్యత వహించాల్సింది రాజకీయ నాయకత్వమే. రాజకీయ నాయకత్వం నిజాయితీగా ఉండాలె. సీబీఐ అధికారులు కర్తవ్య పారాయణులై ఉండాలె. వారు నిజాయితీగా ఉన్నప్పుడు రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడానికి సంకోచిస్తారు. ఇవన్నీ ఒకేసారి ఏర్పడవు. ఒకేసారి పొమ్మంటే పోవు. అటువంటి రాజకీయరంగంలో, అధికార బృందంలో ఉన్న వ్యక్తులు తాము ఆదర్శంగా ఉంటూ, సత్సంప్రదాయాలను నెలకొల్పాలె. అలోక్‌వర్మను సాగనంపి తాత్కాలిక డైరెక్టర్‌ను నియమించడంతో ప్రధాని బాధ్యత తీరిపోదు. ప్రధాని చర్యలు చట్టపరంగానే కాదు, నైతికంగా కూడా సరైనవేనా అనేది ప్రజలు గమనిస్తుంటారు. సీబీఐ పరిణామాలకు ప్రధాని మోదీతో పాటు కార్యనిర్వాహక వర్గాన్ని నియంత్రించే పార్లమెంట్ కూడా తమ బాధ్యతను విస్మరించకూడదు.

జనగళం

యువతకు స్ఫూర్తి వివేకానందుని జీవితం



'ఆధునిక యువతపైనే నాకు విశ్వాసం ఉన్నది. నేను నిర్మించిన ఆదర్శాన్ని దేశమంతా వ్యాప్తిచేసేది ఆధునిక యువతే, అలాంటి యువత ముందుగా బలిష్టంగానూ, జవసంపన్నులు గానూ, ఆత్మవిశ్వాసులు గానూ, రుజు వర్తనులుగానూ మారాలి. ఇలాంటి యువత వందమంది ఉన్నా ఈ ప్రపంచాన్నే మార్చేయవచ్చు'నని యువతను కొనియాడారు స్వామి వివేకానంద. ఆయన సందేశాలు సూటిగా యువత హృదయాన్ని తాకుతాయి. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనసులో ఉన్న యువత ఈ దేశానికి కావాలని వివేకానందుడు కోరుకున్నాడు. వివేకానందుడు పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తాలోని సిమ్లా అనే పేటలో విశ్వనాథ దత్తా, భువనేశ్వరీదేవి దంపతులకు 1863 జనవరి 12న జన్మించాడు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

వివేకానంద తన ఉపన్యాసంలో 'ఏ ధర్మమైతే ప్రపంచానికి గౌరవించడం నేర్పిందో, ఆ ధర్మానికి చెందినవాడిగా నేను గర్విస్తాను. అన్ని మతాలు సత్యమని మేము అంగీకరిస్తాం. మతతత్వం, పిడివాదం, వాటి భయంకరమైన వారసత్వం ఈ సుందరమైన భూమిపై చాలాకాలం రాజ్యం చేశాయి. అవి ఈ భూమిని హింసతో నింపేశాయి. మానవుల రక్తంతో తడిపేశాయి. సభ్యత సంస్కారాలను నాశనం చేశాయి. దేశం మొత్తాన్ని నైరాశ్యంలో ముంచేశాయి. ఈ భయంకరమైన దహనకాండ లేకపోతే మానవ సమాజం ఇప్పటికి ఎంతో అభివృద్ధి చెందేదంటూ ఉపన్యాసం చేశారు. వివేకానంద ఎక్కడ ప్రసంగించినా ప్రజలు ఓపికతో వినేవారు. వివేకానంద ఇచ్చిన సందేశాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి.

- కాళంరాజు వేణుగోపాల్

(నేడు జాతీయ యువజన దినోత్సవం)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com, Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

ట్రంప్ గారి రెండేండ్లు

డొనాల్డ్ ట్రంప్ రెండేండ్ల కిందట అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నప్పుడు ఇంతవరకు అమెరికా జాతీయంగా, అంతర్జాతీయంగా అనుసరించిన ప్రభుత్వ విధానాలన్నింటినీ నకారాత్మక ధోరణితో వ్యతిరేకించారు, విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో ఎన్ని మాటలు మాట్లాడినా, జాతి వివక్షతో, దురభిమానంతో 'అమెరికా అమెరికన్లదే' అంటూ ట్రంప్ ఇచ్చిన నినాదమే ఎక్కువగా క్లిక్ అయింది. జాతీయంగా, అంతర్జాతీయంగా ట్రంప్ అనుసరించే విధానాలేమిటో రెండేండ్లయినా స్పష్టం కావడం లేదు.

అమెరికా 45వ అధ్యక్షుడిగా డొనాల్డ్ జాన్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసి ఓ వారం రోజులైతే రెండేండ్లవుతుంది. 2016 నవంబర్‌లో రిపబ్లికన్ పార్టీ (గ్రాండ్ ఓల్డ్ పార్టీ) అభ్యర్థిగా, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌ను ఓడించి ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లతో (పాపులర్ ఓట్లలో రెండవ స్థానంలో ఉన్నప్పటికీ) గెలుపొందిన డొనాల్డ్ ట్రంప్ 2017 జనవరి 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. ట్రంప్ జాతీయంగా, అంతర్జాతీయంగా బంప్‌ల దారిలో నడుస్తూ అమెరికా అధ్యక్ష పదవిలో, వైట్‌హౌజ్‌లో రెండేండ్లు పూర్తిచేయడం నిజంగా చోద్యమే, ఘన కార్యమే. తమ పార్టీ ప్రైమరీల్లో (ట్రంప్ డెమొక్రటిక్ పార్టీ నుంచి రిపబ్లికన్ పార్టీలో దుమికిన వాడే) 16 మంది అభ్యర్థులను ఓడించి అధ్యక్ష పదవికి అభ్యర్థిగా టిక్కెట్ సంపాదించగలిగినప్పటికీ, మొత్తం ఓటర్లలో అధిక సంఖ్యాకులు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, ఒపీనియన్ పోల్స్ అన్నింటిలో ట్రంప్ ఓడిపోతాడన్న జోస్యం వినిపించినప్పటికీ, వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ వంటి ప్రముఖ పత్రికలు ఆయనకు వ్యతరేకంగా సంపాదకీయాలను, రసవత్తర వార్తా కథనాలను ప్రచురించినప్పటికీ ఆయన గెలిచి నిలిచారు. ఆయన మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్ సతీమణి హిల్లరీ క్లింటన్‌ను (అధ్యక్ష పదవి నుంచి అప్పుడే రిటైరవుతున్న ఒబామా తమ డెమొక్రటిక్ పార్టీ పక్షాన అనర్గళ ప్రసంగాలతో మేడమ్ హిల్లరీ గెలుపు కోసం ఉధృత ప్రచారం జరిపినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు.!) పరాజయం పాలుచేసి ప్రపంచానికి, ముఖ్యంగా రాజకీయ పరిశీలకులకు దిగ్భ్రాంతి కలిగించారు. అధ్యక్ష పదవికి రెండేండ్ల కిందట జరిగిన ఎన్నికల్లో ట్రంప్ ప్రచారం వివాదాలు, కీచులాటలు, కుమ్ములాటలు, అసభ్య-అశ్లీల ఆరోపణలతో మొదలైంది. ట్రంప్, ఆయన అనుచరులు, ప్రచార సహాయకులు హద్దు లేకుండా అబద్ధాలు ఆడుతున్నారన్న విమర్శలు చెలరేగాయి. ట్రంప్‌కు అనుకూలంగా, హిల్లరీ క్లింటన్‌కు ప్రతికూలంగా రష్యా అధినేత పుతిన్, ఆయన ప్రభుత్వం వాళ్లు సైబర్ జోక్యం చేసుకుంటున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదుల మీద ఇప్పటికీ అమెరికా అటార్నీలు శోధన, విచారణ జరుపుతుండటం విశేషం. చివరి క్షణాల్లో యు.ఎస్. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) వెల్లడించిన కథనం హిల్లరీ క్లింటన్‌కు బాగా నష్టం కలిగించిందని విశ్లేషకులు భావించారు. ఎన్నికల ప్రచారం ముమ్మరమవుతున్న దశలో కొందరు మహిళలు-సుందరాంగులు-ట్రంప్ తమతో అసభ్యంగా ప్రవర్తించారని రొమాంటిక్ కథనాలను కొన్ని ఛానళ్లలో, పత్రికల్లో ప్రచారంలోకి తెచ్చారు. ఏమైనప్పటికీ, ట్రంప్ అసహనం, జాతి వివక్ష, దురుసుతనం, పరుష భాషణం, అజ్ఞానం, అవలక్షణాలు ఆయన ఎన్నికల విజయానికి దోహదపడ్డాయి. అధ్యక్ష పదవికి ఎన్నికయ్యే నాటికి ట్రంప్ వయస్సు డెబ్బై ఒక్కటి. అప్పటికే ఆయన రియలెస్టేట్, వర్తకరంగంలో బడా శ్రీమంతుడు. ఇంత వయసున్నవారు, ఇంతటి శ్రీమంతులు ఇంతవరకు అమెరికా అధ్యక్షుడు కాలేదని గతంలోని అధ్యక్షుల వివరాలను పరికిస్తే స్పష్టమవుతున్నది. మరికొన్ని విషయాల్లో కూడా ట్రంప్ మొదటివాడిగా కనిపిస్తున్నాడు. సాధారణంగా అమెరికాలో అధ్యక్షుని ఎన్నిక తర్వాత రాజకీయ వాతావరణం ప్రశాంతమవుతుంది. కానీ, ట్రంప్ ఎన్నిక మరింత వివాదాస్పదమై ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. అసాధారణ రీతిలో అమెరికా అంతటా ఆయన ఎన్నికకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ముఖ్యంగా మహిళలు ముఖ్య నగరాల్లో వేల సంఖ్యలో ముందుకొచ్చి 'నువు మా అధ్యక్షుడివి కావు' అన్న నినాదం గల ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఆయన ప్రమాణ స్వీకారోత్సవం కూడా రభసగా మారింది. ఒబామా రెండు ప్రమాణోత్సవాలకు అమెరికన్లు లక్షల సంఖ్యలో వచ్చారని, ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రజలు చాలా తక్కువ సంఖ్యలో వచ్చారని, ఉత్సవం పేలవంగా జరిగిందని పత్రికలు రాయడం, మీడియాలో ప్రచారం జరుగడం ట్రంప్ మండిపాటుకు కారణమైనాయి. ఇప్పటికీ మీడియా వాళ్లంటే అధ్యక్షుడు ట్రంప్‌కు ఒళ్లుమంట. ఈ మధ్య వైట్‌హౌజ్‌లో ఆయన మాట్లాడుతున్న ఒక పత్రికా గోష్టిలో ఒక పాత్రికేయుడు ఇమ్మిగ్రేషన్ గురించి ప్రశ్నించడంతో ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. అధికారులు మైక్ లాక్కొని ఆ సదరు పాత్రికేయుడిని బయటికి గెంటివేశారు.


ఇండియాతో సహా ప్రపంచంలోని వివిధ దేశాల్లో రియల్ ఎస్టేట్ వర్తకం లాభసాటిగా నడుపుతున్న ట్రంప్‌కు అమెరికా, అంతర్జాతీయ రాజకీయాలతో సంబంధం తక్కువ. రాజకీయ పరిజ్ఞానం, పరిపాలనానుభవం, ఆర్థికశాస్త్ర పరిజ్ఞానం, న్యాయశాస్త్రం, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ట్రంప్‌కు శూన్యమనేది పచ్చినిజం. ఆయనకు తెలియదు, తెలిసిన వాళ్లు చెబితే ఆయన వినడు. ఇది ఆ మహానుభావుడి ప్రత్యేకత. 'చట్టం లేదు, గిట్టం లేదు. నేను చెప్పినట్టు చేయండి'.. అని ట్రంప్ ఆదేశిస్తాడని గత రెండేండ్లలో, వైట్‌హౌజ్‌లో, ఆయన వద్ద ఉన్నత పదవుల్లో (విదేశాంగ మంత్రిగా, రక్షణ మంత్రిగా, ఆర్థిక మంత్రిగా, సలహాదారులుగా) కష్టపడి పనిచేసి, ఇక పనిచేయలేక రాజీనామా చేసి బయటికివచ్చిన మేధావులు, నిష్ణాతులు, పాలనాదక్షులు కొందరు వెల్లడించారు. ట్రంప్ ఎప్పుడేం మాట్లాడుతాడో, ఎప్పుడేం చేస్తాడో తెలియదని వాళ్లన్నారు. గత రెండేండ్ల ట్రంప్ పాలనలో ఆయనతో మొదట సన్నిహితంగా ఉండి, తర్వాత ఆయన ధోరణి నచ్చక బయటికివచ్చిన వారు అనేకులు. రెండేండ్లు అయినప్పటికీ, ఈ మధ్యనే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికల దెబ్బ తగిలినప్పటికీ (కాంగ్రెస్‌లో, ప్రతినిధుల సభలో, ప్రతిపక్షం డెమొక్రటిక్ పార్టీ నవంబర్ ఎన్నికల్లో మెజార్టీ సాధించింది) ట్రంప్ ప్రభుత్వం ఇంకా స్థిరంగా ఏర్పడలేదు, ఉన్నత పదవుల, మంత్రుల (అక్కడ కార్యదర్శులు) నియామకాలు పూర్తికాలేదు. నిన్నమొన్నటి వరకు తన వద్ద మంత్రులుగా, ఉన్నతాధికారులుగా ఉండి అభిప్రాయభేదాల కారణంగా రాజీనామా చేసి వెళ్తున్నవారిని పరుష పదజాలంతో, తిట్లతో అవమానించడం ట్రంప్ అలవాటు. రాజీనామా చేసినవారు ఈ అవమానాలను సహించలేక ట్రంప్ బలహీనతలను, వ్యక్తిగత లోపాలను, ఆయన దుర్గుణాలను బయట కక్కుతున్నారు. సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐ.ఎస్.) మతోన్మాద టెర్రిజం అంతమైందని లెక్కలు వేసి అక్కడి నుంచి అమెరికన్ సేనల ఉపసంహరణకు అధ్యక్షుడు ట్రంప్ చేసిన హడావుడి నిర్ణయం పెద్ద తప్పిదమని భావించి, తనతో సంప్రదించకుండానే ట్రంప్ ఈ నిర్ణయం చేశారని బాధపడి రక్షణమంత్రి పదవికి జేమ్స్ మ్యాటిస్ రాజీనామా చేశారు. వైట్‌హౌజ్‌లో ఇప్పుడు హుందాతనం లేదని, తన ప్రైవేట్ ఛాంబర్స్‌లో ఆ గది నుంచి ఈ గదికి అధ్యక్షుడు ట్రంప్ ఒంటరిగా పచార్లు చేస్తుంటాడని మాజీ రక్షణమంత్రి మ్యాటిస్ అన్నాడు. ఇప్పుడు వైట్‌హౌజ్‌లో తాను ఒంటరినని ట్రంప్ స్వయంగా ఈ మధ్య అన్నాడు. అది స్వయంకృతాపరాధ విషమ పరిణామం. మ్యాటిస్‌ను అమెరికన్ మీడియా మెచ్చుకోవడం ట్రంప్‌కు ఇష్టం కాకపోయేది. మ్యాటిస్ కంటే తెలివితేటలు తనకే ఎక్కువని ట్రంప్ అన్నాడు. అది ఆయన విపరీత ఆత్మస్తుతి స్వభావానికి ఒక మచ్చుతునక. ట్రంప్ విచిత్ర ధోరణిని తట్టుకోలేక, అభిప్రాయ భేదాలతో రెక్స్‌టిల్లర్‌సన్ విదేశాంగ మంత్రి పదవికి రాజీనామా చేశాడు. పదవిలో తన పక్కన ఉన్నంతకాలం టిల్లర్‌సన్‌ను ఆకాశానికి ఎత్తిపొగిడిన ట్రంప్ ఆయన రాజీనామా చేయగానే పనికిరాని వాడని హేళన చేశాడు. చట్టాలకు వ్యతిరేకమైన పనులు చేయాలని ట్రంప్ తన మీద ఒత్తిడి తెచ్చాడని టిల్లర్‌సన్ అన్నాడు. ట్రంప్ క్రూరుడని, మూర్ఖుడని, వెన్నుపోట్లు పొడిచే విశ్వాస ఘాతకుడని టిల్లర్‌సన్ విమర్శల వర్షం కురిపించాడు. పుస్తకాలు, అధికార పత్రాలు చదివే అలవాటు ట్రంప్‌కు లేదన్నాడు.

> **ఇంతవరకు మోదీజీ అమెరికాలోని భారతీయుల భవిష్యత్తు గురించి ట్రంప్‌తో మాట్లాడకపోవడం ఈ స్వతంత్ర దేశం పరాధీనతకు ప్రబల నిదర్శనం. బంపుల మార్గంలో రెండేండ్ల పాలన పూర్తిచేస్తున్న ట్రంప్‌ను అభినందించాలో, అభిశంసించాలో ప్రపంచానికి అర్థం కావడం లేదు.**

డొనాల్డ్ ట్రంప్ రెండేండ్ల కిందట అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నప్పుడు ఇంతవరకు అమెరికా జాతీయంగా, అంతర్జాతీయంగా అనుసరించిన ప్రభుత్వ విధానాలన్నింటినీ నకారాత్మక ధోరణితో వ్యతిరేకించారు, విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో ఎన్ని మాటలు మాట్లాడినా, జాతి వివక్షతో, దురభిమానంతో 'అమెరికా అమెరికన్లదే' అంటూ ట్రంప్ ఇచ్చిన నినాదమే ఎక్కువగా క్లిక్ అయింది. జాతీయంగా, అంతర్జాతీయంగా ట్రంప్ అనుసరించే విధానాలేమిటో రెండేండ్లయినా స్పష్టం కావడం లేదు. ఎన్నికల సమయంలో నాటో అమెరికా సైనిక కూటమిని ట్రంప్ నాటో పనికిరాని దండుగ కూటమి అన్నాడు. రష్యాకు వ్యతిరేకంగా నాటో ఇంకా కొనసాగుతున్నది. రెండేండ్ల ట్రంప్ పాలనపై ఆయన మాజీ సన్నిహితులు, ఆయనతో కలిసి పనిచేసిన వారు, ఆయనకు దూ ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడిస్తున్నారు. ట్రంప్ రెండేండ్ల పాలన లో మరో మాజీ సన్నిహితుడు సెనేటర్ బాబ్ కార్కర్. ఆయన (కార్కర్) రెండు పర్యాయాలు టెన్నెసి నుంచి సెనేట్‌కు ఎన్నికయ్యాడు. ట్రంప్ రెండేండ్ల పాలనలో వైట్‌హౌజ్ 'అడల్ట్ కేర్ సెంటర్' అయిందని కార్కర్ విమర్శించాడు. అంతే కాదు, ట్రంప్ మూడవ ప్రపంచ యుద్ధం తెచ్చే భయంకర ప్రమాదం పొంచి ఉందని కార్కర్ హెచ్చరించాడు. ఇటువంటి ప్రమాదం ఉంది గనుకనే అధ్యక్షుడు ట్రంప్‌ను ఇంపీస్ చేసే ఆలోచనకు అమెరికన్ కాంగ్రెస్‌లో అప్పుడే అంకురార్పణ జరిగింది. ట్రంప్ పాలనలో అక్కడి భారతీయులు, విశేషించి ఈ మధ్యనే ఎన్నో ఆశలతో అక్కడికి వెళ్లినవారు, వెళ్లాలనుకుంటున్నవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇంతవరకు మోదీజీ అమెరికాలోని భారతీయుల భవిష్యత్తు గురించి ట్రంప్‌తో మాట్లాడకపోవడం ఈ స్వతంత్ర దేశం పరాధీనతకు ప్రబల నిదర్శనం. బంపుల మార్గంలో రెండేండ్ల పాలన పూర్తిచేస్తున్న ట్రంప్‌ను అభినందించాలో, అభిశంసించాలో ప్రపంచానికి అర్థం కావడం లేదు.

విత్తన చిరునామా 'తెలంగాణ'

వ్యవసాయం



సి.పార్థసారథి (ఐఏఎస్)

తెలంగాణ ఖాతాలో మరో కలికితురాయి చేరింది. దేశ విత్తన భాండాగారంగా వెలుగొందుతున్న తెలంగాణ ప్రపంచ ప్రఖ్యాత 'ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్' 32వ కాంగ్రెస్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ISTA 94 ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆసియాలో ఇస్టా కాంగ్రెస్ జరుగుతుంది. అదికూడా హైదరాబాద్‌లో జరుగటం రాష్ట్ర ప్రభుత్వానికి గర్వకారణం. అంతర్జాతీయ, జాతీయ విత్తన నిపుణులు హైదరాబాద్ సదస్సులో పాల్గొంటారు. దేశ, రాష్ట్ర విత్తనరంగం మరింత అభివృద్ధికి ఈ అంతర్జాతీయ కాంగ్రెస్ ఉపయోగపడుతుంది. రైతులు, విత్తనోత్పత్తిదారులకు ఆధునిక విత్తన సమాచారం అందనున్నది. విదేశాలకు విత్తనం ఎగుమతి చేసే అవకాశాలు పెరుగుతాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విత్తనరంగాలు మరింత బలోపేతమవుతాయి.

ప్రపంచ విత్తనరంగంలో భారత్‌ది 5వ స్థానం. ప్రపంచ విత్తన మార్కెట్లో 4.4 శాతం వాటా ఉన్నది. అమెరికా (27 శాతం), చైనా (20 శాతం), ఫ్రాన్స్ (8 శాతం), బ్రెజిల్ (6 శాతం)తో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇప్పటికే విత్తన రంగంలో స్వయం సమృద్ధిని పొందిన భారత్‌లో విత్తనరంగం వృద్ధిరేటు సాలీనా 12-15 శాతం వరకు ఉన్నది. దేశంలో మొత్తం విత్తన మార్కెట్‌లో వ్యవస్థీకృత విత్తన రంగం ఉంటే ధృవీకరణ/నాణ్యమైన విత్తన మార్కెట్ 25-30 శాతం ఉన్నది. ప్రభుత్వ, ప్రైవేట్ విత్తన కంపెనీలు ఐదువందలకు పైగానే ఉన్నాయి. ప్రభుత్వరంగంలో రాష్ట్ర విత్తన కార్పొరేషన్లు, కో ఆపరేటివ్‌లు కలిసి 16కు పైగానే ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలతో దేశీయ విత్తన పరిశ్రమలో 90 శాతానికి పైగా ఉన్నాయి. వరి, గోధుమ, అపరాలు, నూనె గింజలు వంటి తక్కువ విలువ కలిగి, అధిక మొత్తం అవసరం ఉన్న పంటల విత్తనాల ఉత్పత్తి, నాణ్యత, సరఫరాలో పబ్లిక్‌రంగ సంస్థలున్నాయి. తక్కువ మొత్తం అవసరం ఉండి అధిక విలువ కలిగిన విత్తనాలు దేశీయ అవసరాలను తీరుస్తున్నాయి. ప్రపంచ విత్తన వాణిజ్య విలువ అంచనా 50 బిలియన్ అమెరికా డాలర్లు ఉంటే, భారత విత్తన మార్కెట్ 2.7 బిలియన్ డాలర్లుగా ఉన్నది. దేశంలో ఇక విత్తన నాణ్యత పరీక్షించేందుకు గాను 125 నోటిఫైడ్ విత్తన పరీక్ష ప్రయోగశాలలు, 26 విత్తన ధృవీకరణ ఏజెన్సీలు, 6 ఇస్టా ఆమోదం పొందిన ప్రయోగశాలలు, OECD సభ్యత్వం కలిగి ఉన్నది.

దేశం విత్తన రంగంలో ముందున్నది. ఇందులో ప్రధాన పాత్ర తెలంగాణ రాష్ట్రానిది. రాష్ట్రమంతా విత్తనోత్పత్తికి అత్యంత అనుకూలం. ప్రపంచంలో రెండే పూర్తిగా విత్తనోత్పత్తికి అనుకూలంగా ఉన్నాయి. వాటిలో అమెరికాలోని అరిజనా రాష్ట్రం, రెండోది తెలంగాణ రాష్ట్రం. ఏడాది అంతా నాణ్యమైన విత్తనోత్పత్తికి అత్యంత అనుకూల వాతావరణం రాష్ట్రానిది. తేమ, సూర్యరశ్మి, ఉష్ణోగ్రత నాణ్యమైన విత్తనం తయారీకి అనుకూలంగా ఉన్నాయి. రైతులు క్షేత్రస్థాయిలో వాడుకోవడానికి అవసరమయ్యే నిల్వకు కావాల్సిన అన్నీ మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో ఉన్నాయి. అందుకే దేశంలో ఉత్పత్తి అవుతున్న హైబ్రిడ్ వరి విత్తనాల్లో 90 శాతం, హైబ్రిడ్ పశుగ్రాస జొన్న, సజ్జల్లో 100 శాతం తెలంగాణ నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. పత్తి, మక్కజొన్న, సోయాబీన్, పల్లి పంటల విత్తనోత్పత్తిలో రాష్ట్రం పాత్ర ప్రధానమైనది. అందుకే భారత విత్తన రాజధానిగా ఇప్పటికే హైదరాబాద్‌కు పేరు వచ్చింది. దేశ విత్తన అవసరాల్లో 60 శాతానికి పైగా విత్తనాలను అందిస్తున్నది. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు రాష్ట్రం ఇప్పటికే ఏర్పాటుచేసింది. 45 లక్షల చదరపు అడుగుల విత్తన గిడ్డంగుల సామర్థ్యం ఉన్నది. అలాగే 1.30 కోట్ల సీఎఫ్‌టీ శీతల నిల్వ గదులు అందుబాటులో ఉన్నాయి. విత్తన ప్రాసెసింగ్ సామర్థ్యం గంటకు 650 మెట్రిక్ టన్నులకు పైగానే ఉన్నది. ఒకే ప్రాంతంలో ఇంత ఎక్కువగా ఉండటంతో హైదరాబాద్ ప్రపంచంలో మొదటిస్థానంలో ఉన్నది. అలాగే మక్కజొన్న కంకులు ఎండబెట్టే సామర్థ్యం 1.2 లక్షల మెట్రిక్ టన్నులు. దాదాపు ఐదు రాష్ట్రాల నుంచి ముడి విత్తనం రాష్ట్రానికి వస్తుంది. వాటిని ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం కేవలం తెలంగాణలోనే ఉన్నది. తెలంగాణలోని విత్తన రంగంలో 17000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అదేవిధంగా విత్తనం కోత దశలో లక్షకు పైగానే మందికి ఈ రంగంలో ఉపాధి లభిస్తుంది. రాష్ట్రం నుంచి 20 దేశాలకు విత్తనం ఎగుమతి చేయబడుతున్నది.

> **2019 జూన్ 26 నుంచి జూలై 3 వరకు జరుగబోయే 32 ఇస్టా విత్తన కాంగ్రెస్‌కు హైదరాబాద్ వేదిక కానున్నది. అంతరజాతీయ విత్తన సదస్సుతో రాష్ట్ర రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని రైతులు ఇప్పటికే విత్తనోత్పత్తిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం కూడా ఏటా బడ్జెట్‌లో విత్తనరంగ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నది. పంట కాలనీల తరహాలో విత్తన కాలనీలను ప్రోత్సహిస్తున్నది.**

విత్తనోత్పత్తిలో పెద్దన్నగా ఉన్న రాష్ట్రం ప్రభుత్వ సహకారంతో పలు ప్రతిష్ఠాత్మక విత్తన సంబంధిత కాంగ్రెస్‌లు, సదస్సులు నిర్వహించింది. 2015లో ప్రతిష్ఠాత్మక 8వ జాతీయ విత్తన కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించింది. ఇప్పటికే తెలంగాణ విత్తన ధృవీకరణలో అంతర్జాతీయ ప్రమాణాల పరస్పర మార్పిడి ప్రాజెక్టులో జర్మనీతో భాగస్వామిగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణే. హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత ఆధునిక ప్రమాణాలతో ఇస్టా ప్రయోగశాల నెలకొల్పబడినది. అంతర్జాతీయ విత్తన ధృవీకరణ ఎగుమతికి కీలకమైన OECDలో సంస్థ మన రాష్ట్రంలోని మెదక్ జిల్లా ములుగులో బండ మైలారం గ్రామంలో ఆధునిక సౌకర్యాలతో విత్తన పార్కు ఏర్పాటుచేసింది. ఇందులో విత్తన ధృవీకరణ, పరీక్షలు, ఫైటోశానిటరీ, నిల్వ, శిక్షణ, పరిశోధనకు కావాల్సిన మౌలిక వసతులున్నాయి.

2019 జూన్ 26 నుంచి జూలై 3 వరకు జరుగబోయే 32 ఇస్టా విత్తన కాంగ్రెస్‌కు హైదరాబాద్ వేదిక కానున్నది. అంతరజాతీయ విత్తన సదస్సుతో రాష్ట్ర రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని రైతులు ఇప్పటికే విత్తనోత్పత్తిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం కూడా ఏటా బడ్జెట్‌లో విత్తనరంగ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నది. పంట కాలనీల తరహాలో విత్తన కాలనీలను ప్రోత్సహిస్తున్నది. ఎగుమతులకు సహాయ సహకారాలు అందిస్తున్నది. ప్రపంచానికి విత్తనోత్పత్తి పాఠాలు నేర్పిన అంకాపూర్ గ్రామం తెలంగాణలోనే ఉన్నది. అదే తరహాలో రాష్ట్రంలోని అన్నీ అనుకూల గ్రామాలను విత్తన గ్రామాలుగా తీర్చిదిద్ది, వాటి ఫలితాలను రైతులకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

(వ్యాసకర్త: రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ప్రధాన కార్యదర్శి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy**. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలో కైట్ ఫెస్టివల్ కోసం ముస్తాబైన బతుకమ్మ ఘాట్

నేడు సిరిసిల్లలో కైట్ ఫెస్టివల్

సిరిసిల్ల టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం మెగా ఈవెంట్‌కు సిద్ధమైంది. సిరిసిల్లలోని మానేరువాగు తీరంలో బతుకమ్మ ఘాట్ వేదికగా శనివారం కైట్ ఫెస్టివల్ జరుగనున్నది. హైదరాబాద్‌కు చెందిన ప్రత్యేక కైట్ ఫ్లయర్స్ ఈ వేడుకల్లో పాల్గొంటారు. పతంగుల ఆవిష్కరణతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, మిమిక్రీ, మెజీషియన్ కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి. ఫుడ్ స్టాల్స్, కైట్ స్టాల్స్ ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తున్నారు.



ఏడుపాయల దుర్గామాతను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. - పాపన్నపేట

పెద్దగట్టు జాతర ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆదేశం

సూర్యాపేట, నమస్తేతెలంగాణ: పెద్దగట్టు లింగమంతులస్వామి జాతర పనులను ముమ్మరం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు పెద్దగట్టు లింగమంతులస్వామి జాతర జరుగనున్నది. ఈ మేరకు జగదీశ్‌రెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో పెద్దగట్టు జాతర పనులపై కలెక్టర్ అమయ్‌కుమార్‌తోకలిసి అధికారులతో సమీక్షించారు. అనంతరం పెద్దగట్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.



పాకాల కట్టపై సైకిల్ తొక్కుతున్న వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ హరిత

పాకాలలో కలెక్టర్ సైకిల్ సవారీ

ఖానాపురం: వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలంలోని పర్యాటక ప్రదేశమైన పాకాలలో శుక్రవారం నిర్వహించిన నేచర్‌క్యాంపులో కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఆమె వివిధశాఖల అధికారులతో కలిసి పాకాల అడవుల్లో దాదాపు రెండు గంటలపాటు 5 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్, నేచర్‌వాక్ నిర్వహించారు. అనంతరం పాకాల కట్టపై కిలోమీటర్ మేర సైకిల్ తొక్కారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యపరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె తోటి అధికారులకు సూచించారు. పాకాల ఎకో టూరిజం అభివృద్ధికి ప్రజలు, పర్యాటకులు సహకరించాలన్నారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ మహేందర్‌రెడ్డి, డీఎఫ్‌వో పురుషోత్తం, డీపీఆర్వో పల్లవి తదితరులు ఉన్నారు.



కరీంనగర్ జిల్లా మొగిలిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి

పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటాలి

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపు

తిమ్మాపూర్ రూరల్: పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించి, సత్తాచాటాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ఉంటూ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. మొగిలిపాలెంలో అశోక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

మొలచింతపల్లిలో బ్రూనోడాగ్‌తో తనిఖీలు

టేకు, వేప దుంగలు స్వాధీనం



నాగర్‌కర్నూల్ జిల్లా మొలచింతపల్లిలో బ్రూనో డాగ్‌తో తనిఖీ చేస్తున్న అటవీఅధికారులు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో శుక్రవారం కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ మనోహర్ పర్యవేక్షణలో బ్రూనోడాగ్‌తో పలువురి ఇండ్లల్లో తనిఖీలు చేపట్టి టేకు, నారవేప దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సామిల్ వద్ద ఉంచిన వేప కలప దుంగలను బ్రూనోడాగ్ గుర్తించింది. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు, అమ్రాబాద్ టైగర్ ఫారెస్టులకు మాత్రమే రెండు బ్రూనోడాగ్‌లు వచ్చాయన్నారు. అడవిలో మోదుగాకులు తెంపేందుకు, వంట చెరుకు సేకరించేందుకు వీలులేదన్నారు. కలప తరలింపు, వన్యప్రాణుల వేటకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కలపను పట్టుకున్న అటవీ అధికారులు

ధర్పల్లి: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం రేకులపల్లిలోని ఓ టింబర్ డిపోలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్టు అటవీశాఖ సెక్షన్ అధికారి ఆసిఫ్ తెలిపారు. ఈ కలప విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందన్నారు. ఈ కలపను సీజ్ చేసి ఇందల్వాయి ఎఫ్‌ఆర్వోకు రిపోర్టు చేశామన్నారు.

అటవీ భూముల్లో చెట్లను నరికిన నలుగురి అరెస్టు

బాన్సువాడ రూరల్: కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడ్కోల్ పరిధిలోని కొయ్యగుట్ట శివారులో అటవీ భూముల్లో చెట్లను నరికిన నలుగురిని అరెస్టు చేసినట్టు సెక్షన్ అధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం పోలీసుల సహకారంతో కొయ్యగుట్టలో విచారణ చేపట్టి చెట్లను నరికిన ఒడ్డె సాయిలు, ఒడ్డె ఎల్లయ్య, ఒడ్డె లింగయ్య, రాములును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. మిగితా 40మంది కోసం గాలిస్తున్నామన్నారు. సుమారు 21 హెక్టార్ల పరిధిలో అటవీ భూముల్లో చెట్లను నరికినట్టు అధికారులు గుర్తించారు.



సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్ అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్‌కు ముస్తాబవుతున్నది. దేశ విదేశాల నుంచి పతంగులు ఎగరేయడానికి కైట్ ఫ్లయర్స్ ఇక్కడకు రానున్నారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ వేడుకను ప్రారంభించనున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు 10 లక్షలమంది హాజరుకానున్నారని అందుకు తగినట్టు ఏర్పాట్లు చేస్తున్నామని పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు.



సైకత శిల్పి రేవెళ్లి శంకర్

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్‌కు చెందిన సైకతశిల్పి రేవెళ్లి శంకర్ శుక్రవారం అదే గ్రామంలో వివేకానందుడి సైకత శిల్పాన్ని ఆవిష్కరించారు. ఈ శిల్పం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నది. - పాలకుర్తి

కన్నుల పండువగా శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం



వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం ఊరుగొండలో స్వామివారికి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

దామెర: వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం ఊరుగొండలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీరుక్మిణీ సత్యభామ సహితంగా ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీనర్సింహ స్వామికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకం, మహానైవేద్యంతో ప్రాబోధికం నిర్వహించారు. సాయంత్రం డప్పుచప్పుళ్లు, మేళవాయిద్యాల నడుమ పటేళ్లవాడ వద్ద శ్రీరుక్మిణీ సత్యభామ, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు ఎదురుకోళ్లు నిర్వహించారు. మేళవాయిద్యాలు మధ్య ఉత్సవమూర్తులను ఆలయప్రవేశం చేయించి స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఏకగ్రీవం వైపు..

గ్రామ స్వరాజ్యం

అభివృద్ధికే జనం ఓటు

ప్రోత్సాహకాల కోసం పట్టు





సిరిసిల్ల జిల్లా కమ్మరిపేట తండాలో ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు మెంబర్లు (ఇన్‌సెట్‌లో) వనపర్తి జిల్లా తిరుమలాయపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన ఇందిర

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పల్లె ప్రజలు ఏకగ్రీవం వైపు మొగ్గుచూపుతున్నారు. అభివృద్ధి కోసం ఆయా గ్రామస్థులంతా ఒక్కతాటిపైకి వచ్చి ఏకగ్రీవం దిశగా కదులుతున్నారు. ప్రభుత్వంతోపాటు స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చే ప్రోత్సాహకాలను దక్కించుకునేందుకు జనం పట్టుదలతో ఉన్నారు. శుక్రవారం కూడా పలు గ్రామాల్లో సమావేశమై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం తిరుమలాయపల్లి సర్పంచ్‌గా ఇందిరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదటి విడతలో ఎన్నిక జరుగుతున్న ఈ గ్రామ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. తిరుమాలయపల్లి గ్రామ సర్పంచ్‌గా ఇందిరను ఎన్నుకోవడంతో ఈ మండలంలో ఏకగ్రీవాల సంఖ్య పదికి చేరింది. వికారాబాద్ మండలం పాతూరు సర్పంచ్‌గా దొడ్ల లలితమ్మ, కోట్‌పల్లి మండలం లింగంపల్లి సర్పంచ్‌గా పన్నాల పెంటారెడ్డిని ఆయా గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు తీర్మానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కమ్మరిపేట తండాలో సర్పంచ్ మాలోతు సూర్య, ఉపసర్పంచ్ భూక్య రాజును ఈనెల 8న ఏకగ్రీవంగా ఎన్నుకోగా శుక్రవారం వార్డు మెంబర్లుగా ఇస్లావత్ గోరవ్వ, బానోతు చంద్రవ్వ, మాలోతు రాజవ్వను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు



హైమన్ డార్ఫ్ వర్ధంతి కార్యక్రమానికి మార్లవాయిలోని గ్రామ పెద్ద ఇంటి నుంచి ర్యాలీగా వస్తున్న గిరిజనులు

హైమన్‌డార్ఫ్ దంపతులకు నివాళి

అధికారికంగా వర్ధంతి.. పెద్ద ఎత్తున హాజరైన ఆదివాసీలు

ఆకట్టుకున్న గిరిజనుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

జైనూర్: ఆదివాసుల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతిని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. ఎంపీ గోడాం నగేశ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎస్పీ మల్లారెడ్డి, ఐటీడీఏ పీవో కృష్ణ ఆదిత్య తదితరులు హాజరై ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సంస్కృతి ప్రకారం గ్రామపెద్ద ఇంటి నుంచి తుడుం మోగించి ర్యాలీగా డార్ఫ్ దంపతుల సమాధుల వద్దకు చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. హైమన్‌డార్ఫ్ ఆదివాసీలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గిరిజనుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐటీడీఏ చైర్మన్ లక్కెరావ్, డీటీడీవో దిలీప్‌కుమార్, ఆదివాసీ సమాజ నాయకులు, హైమన్‌డార్ఫ్ యువజన సంఘం సభ్యులు కనక వెంకటేశ్వర్‌రావు, అంబాజిరావ్, ధర్మేందర్, రాయ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలిస్తున్న ఆపరేషన్ స్మైల్

తప్పిపోయిన పిల్లలను అమ్మ ఒడికి చేరుస్తున్న పోలీస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తప్పిపోయిన పిల్లల కేసులను ఛేదించేందుకు తెలంగాణ పోలీసులు ప్రారంభించిన ఆపరేషన్ స్మైల్-వీ కార్యక్రమం చక్కటి ఫలితాలిస్తున్నది. ఆపరేషన్ స్మైల్ ద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 350 మంది పిల్లలను రక్షించారు. తాజాగా శుక్రవారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని బాలుడిని స్థానిక పోలీసులు గుర్తించారు. ఆ బాలుడి ఫొటోను దర్పణ్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయగా.. అతను ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సదానంద్(15)గా వెల్లడైంది. అక్కడికి సమాచారం అందించగా సంబంధీకులు వచ్చి ఆ బాలుడిని తీసుకొని వెళ్లారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పోలీస్‌శాఖ సాంకేతికంగా ఎంతో పురోభివృద్ధి సాధించిందని, దీంతో కేసులు త్వరగా పరిష్కారం అవుతున్నాయని రామగుండం సీపీ సత్యనారాయణ పేర్కొన్నారు.



అమీర్ రజాక్

ముంబై బాలుడిని చేరదీసిన చైల్డ్‌లైన్

మయూరిసెంటర్: తల్లిదండ్రులు మందలించారని ఇంట్లో చెప్పకుండా ముంబై నుంచి పారిపోయి రైలెక్కి ఖమ్మం చేరుకున్న ఓ బాలుడిని.. చైల్డ్‌లైన్ 1098 సంస్థ శుక్రవారం క్షేమంగా బంధువులకు అప్పగించింది. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ చెప్పిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సయ్యద్ అమీర్ రజాక్(16) గురువారం ముంబైలో రైలు ఎక్కి ఖమ్మం చేరుకున్నాడు. గమనించిన రైల్వే టీసీ ద్వారా చైల్డ్‌లైన్ ప్రతినిధులు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. ఆ బాలుడిని చేరదీసి సంబంధీకులకు అప్పగించారు.



గుడి సంబురాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, వేయిస్తంభాల ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ

16న వేయిస్తంభాల ఆలయంలో 'గుడి సంబురాలు'

రెడ్డికాలనీ(వరంగల్): కాకతీయులకాలం నాటి శిల్ప సంపద, కళానైపుణ్యం, భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకుగాను ఈ నెల 16న హన్మకొండలోని వేయిస్తంభాల దేవాలయం లో 'గుడిసంబురాలు' నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం హన్మకొండలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడిసంబురాలు నృత్య ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేయి స్తంభాల ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు.

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మసాజ్‌చైర్స్



కాచిగూడ: చారిత్రక వారసత్వ సంపదగా పేరొందిన కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలను సమకూర్చడమే ధ్యేయమని రైల్వే డీఆర్‌ఎం అరుణ్‌కుమార్‌జైన్ చెప్పారు. గ్రేబాక్స్ టెక్నికల్ (బెంగళూర్) సహకారంతో భారతీయ రైల్వేలోనే తొలిసారిగా ప్రయాణికుల కోసం ప్లాట్‌ఫారం-1, 2, 3లలో ఏర్పాటుచేసిన 12 మసాజ్ చైర్లను శుక్రవారం ఏడీఆర్‌ఎంలు శ్రీనివాసరాజు, సాయిప్రసాద్, సీనియర్ డీసీఎం ఏ శ్రీధర్‌తో కలిసి డీఆర్‌ఎం ప్రారంభించారు. ప్రయాణికులు మసాజ్ చేయించుకోవడానికి ఐదు నిమిషాలకు రూ.40, పది నిమిషాలకు రూ.80, 15 నిమిషాలకు రూ.120 చెల్లించాల్సి ఉంటుందని డీఆర్‌ఎం పేర్కొన్నారు.

రైలు కిందపడి ఇద్దరి ఆత్మహత్య

వివాహేతర సంబంధమే కారణం





భాస్కర్, సావిత్రి (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్/చివ్వెంల: రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బాధితుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మాల్యాతండాకు చెందిన ధరావత్ రవి, ధరావత్ సాల్కీ అలియాస్ సావిత్రి(28) దంపతులు. వీరికి కుమార్తె శ్రీలక్ష్మి, కుమారుడు జశ్వంత్ ఉన్నారు. రవి లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, సావిత్రి కూలీగా పనిచేస్తున్నది. సావిత్రి కొడుకు వరుస అయ్యే భాస్కర్(30)తోఐదేండ్లుగా వివాహేతర సంబంధం నడుపుతున్నది. ఇతను కూడా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత నెలలో వీరిద్దరు గ్రామం నుంచి వెళ్లిపోగా.. మరుసటి రోజే సావిత్రి భర్త రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 15 రోజుల క్రితం భాస్కర్ ఒక్కడే తండాకు రాగా గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి సర్దిచెబుతామని భాస్కర్‌కు తెలిపారు. కానీ భాస్కర్, సావిత్రి ఇద్దరు కలిసి శుక్రవారం మిర్యాలగూడకు వచ్చి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డి బినామీ ఆస్తులపై ఐటీ నజర్

స్వాధీనం చేసుకుంటున్నట్టు ప్రకటన

కరీంనగర్ క్రైం: మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డి బినామీ ఆస్తులపై ఐటీశాఖ దృష్టి సారించింది. మోహన్‌రెడ్డి బినామీ ఆస్తులు కూడబెట్టారని సీఐడీ కేసు నమోదుచేసిన సంగతి తెలిసిందే. సీఐడీ సమాచారం మేరకు మోహన్‌రెడ్డి భార్య లత, తండ్రి ఆదిరెడ్డి పేర్ల మీద ఉన్న నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ భవనం, లాడ్జీ భవనాన్ని అటాచ్డ్ చేస్తున్నట్టు ఐటీశాఖ ప్రకటించింది. ఈ మేరకు ఆ రెండు భవనాలను స్వాధీనం చేసుకుంటున్నట్టు అధికారులు నోటీసులు అతికించారు.

టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, ఆత్మకూర్ ఎస్ మండలాలకు చెందిన 1150 మంది మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, కోదాడ సెగ్మెంట్‌కు చెందిన 290 మంది ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో, హుజూర్ నగర్ గరిడేపల్లి మండలం ఎల్బీనగర్‌కు చెందిన 60 కుటుంబాల వారు, మఠంపల్లి మండలానికి చెందిన 50 మంది, హుజూర్‌నగర్ మండలం లక్కవరానికి చెందిన 50 మంది టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన 50మంది ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో, నల్లగొండ మండలం ముషంపల్లికి చెందిన 50మంది సీపీఎం కార్యకర్తలు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో, శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 500 మంది, సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో పలువురు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో, ఖమ్మం జిల్లా వైరాలో ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సమక్షంలో కారేపల్లి మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన 70 కుటుంబాల వారు, కొణిజర్ల మండలం గోపవరం గ్రామానికి చెందిన 70 కుటుంబాల వారు టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కౌఠ గ్రామానికి చెందిన పలువురు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో, నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన 22మంది బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన 150 మంది ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో, శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్ల మల్లారెడ్డి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల, కిష్టంపల్లి గ్రామాలకు చెందిన 50మంది బీజేపీ కార్యకర్తలు, నర్వకు చెందిన 35మంది ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలానికి చెందిన 20మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్ గూటికి చేరారు.



సూర్యాపేటలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



నార్కట్‌పల్లిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న భువనగిరి ఎంపీ బూర, పక్కన మాజీ ఎమ్మెల్యే వేముల



ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు



టీఆర్‌ఎస్‌లో చేరిన అనంతరం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు



ఖమ్మం జిల్లా వైరాలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్



కుర్మసంఘం నాయకుడికి గులాబీ కండువా కప్పుతున్న కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రికార్డుల గని.. సింగరేణి

- తెలంగాణ ఏర్పాటు తర్వాత రెట్టింపైన వృద్ధి
- బొగ్గు రవాణా, ఓబీ తొలిగింపు, అమ్మకాలు, లాభాల్లో 129 ఏండ్ల రికార్డులు బద్ధలు


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ ఆల్ టైం రికార్డును నెలకొల్పింది. 129 ఏండ్ల చరిత్రలో మునుపెన్నడూ నమోదు కాని వృద్ధిని స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత నుంచి నమోదు చేస్తున్నది. ఐదేండ్లుగా అన్ని ప్రభుత్వ సంస్థల్లోకెల్లా అగ్రభాగంలో నిలుస్తూ సత్తా చాటుతున్న సింగరేణి.. బొగ్గు రవాణా, ఓబీ తొలిగింపు, అమ్మకాలు, లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదుచేసింది. దీంతో తెలంగాణ ఏర్పడితే పరిశ్రమలు మూతపడుతాయన్న వాదనలను పటాపంచలు చేయడంతో పాటు దేశంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలకు తలమానికంగా నిలిచింది.

ఐదేండ్లలో అద్భుత విజయాలు

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఐదేండ్ల కాలం (2009-14)లో బొగ్గు రవాణా, ఓబీ తొలిగింపు, అమ్మకాలు, నికర లాభాలతో పోల్తిస్తే తెలంగాణ ఆవిర్భావం తర్వాత (2014-19) కాలంలో సింగరేణి సాధించిన విజయాలు అద్భుతం. దేశంలో 8 సబ్సిడరీ కంపెనీలు ఉన్న కోలిండియా కూడా గత ఐదేండ్లలో ఇంత వృద్ధిని నమోదుచేయలేదు. 2009-14 మధ్య బొగ్గు రవాణాలో వృద్ధి కేవలం 90లక్షల టన్నులు ఉండగా.. స్వరాష్ట్రంలో 122 శాతం వృద్ధి రేటుతో 200 లక్షల టన్నులకు పెంచుకుంది. ఓబీ తొలిగింపు గతంలో 70మిలియన్ క్యూబిక్ మీటర్లు ఉంటే, గత ఐదేండ్లలో 257శాతం వృద్ధిరేటుతో 250 మిలియన్ క్యూబిక్ మీటర్లను తొలిగించింది. ఇక అమ్మకాలు రూ.5,600 కోట్ల నుంచి రూ.13,000 కోట్లకు పెరిగాయి. అంటే 132 శాతం వృద్ధిరేటు నమోదైంది. నికర లాభంలోనూ 314శాతం వృద్ధి సాధించి అద్భుతమైన రికార్డును నెలకొల్పింది. తెలంగాణ రాకముందు ఐదేండ్లలో రూ.290 కోట్లుగా ఉన్న నికర లాభం.. తెలంగాణ ఏర్పడిన ఐదేండ్లలో రూ.1,200 కోట్లు ఆర్జించింది.

నోముల రచనల ప్రభావం అపారం

- సంస్మరణసభలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు

రాంనగర్: దివంగత సాహితీవేత్త నోముల సత్యనారాయణ రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నోముల సంస్మరణసభను తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ సాహితీ, సంఘటిత వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ.. నోముల సాహితీ రచనలు తక్కువగానే ఉన్నప్పటికీ, అవి సమాజంపై ఎంతో ప్రభావం చూపాయన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దు భాషల్లో రచనలుచేసిన నోముల.. మంచి అనువాదకుడిగా కూడా గుర్తింపుపొందారని గుర్తుచేసుకున్నారు. ఆయన ఉపన్యాసాలు సైతం అద్భుతంగా ఉంటాయన్నారు. ఆయన గొప్ప మానవతావాది అని, నేటితరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. రచయిత భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సాహిత్యాన్ని గొప్పగా చెప్పిన వ్యక్తుల్లో నోముల ఒకరని ప్రశంసించారు. ప్రతిదీ అధ్యయనం చేసిన తర్వాతే ఆచరణలో ముందుకెళ్లేవాడని కొనియాడారు. ఆయన రచనలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రచయితలు సట్లపల్లి వరప్రసాద్, వేణు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28న రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో 'పాఠశాల సైన్స్ పాఠాలు- అవసరాలు, సవాళ్లు' అనే అంశంపై ఫిబ్రవరి 28న రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సును నిర్వహిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ బీ శేషుకుమారి శుక్రవారం తెలిపారు. 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 1 ఇన్నోవేటివ్ సైన్స్ టీచింగ్ ఫర్ క్రియేటివ్ మైండ్స్, 2 డెవలప్‌మెంట్ ఆఫ్ వాల్యూస్ త్రూ సైన్స్ టీచింగ్, 3 ఐసీటీ- సైన్స్ టీచింగ్‌పై పత్రాలను సమర్పించడానికి ఫిబ్రవరి 8 వరకు గడువు విధించామని వివరించారు. పూర్తి వివరాలకు ఎస్సీఈఆర్టీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

మన వారసత్వ సంపదపై మరో వివక్ష

- తెలంగాణ చారిత్రక ఇమేజ్‌పై కేంద్ర పురావస్తుశాఖ కుట్ర
- హైదరాబాద్‌ను మినీ సర్కిల్‌గా మార్చేందుకు యత్నం
- మాన్యుమెంట్స్ సంఖ్య తక్కువగా ఉన్నదనే నెపంతో ఏఎస్ఐలోని ఆంధ్ర ప్రాంత అధికారుల ఒత్తిడి
- ఏపీలో రెండు సర్కిళ్ల కోసం ప్రతిపాదనలు?


నూర శ్రీనివాస్/ వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ చారిత్రక, వారసత్వ సంపదను మరుగునపడేసిన ఆంధ్రప్రాంత అధికారులు.. రాష్ట్రం విడిపోయినప్పటికీ వివక్ష మాత్రం మానడం లేదు. కేంద్ర పురావస్తుశాఖ (ఏఎస్ఐ)లో తెలంగాణలో మాన్యుమెంట్స్ సంఖ్య తక్కువగా ఉందన్న సాకుతో హైదరాబాద్ సర్కిల్‌ను మినీ సర్కిల్‌గా మార్చేందుకు యత్నిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇక్కడి చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై నీళ్లు చల్లేందుకు ఏఎస్ఏ యత్నిస్తున్నది. ఢిల్లీ, అమరావతి కేంద్రంగా పనిచేసే కొంతమంది ఏఎస్ఐ ఉన్నతాధికారులు ఈ కుట్రకు ఆజ్యం పోస్తున్నట్టు సమాచారం. ఇదే జరిగితే జాతీయస్థాయిలో తెలంగాణ చారిత్రక కట్టడాలకు ప్రస్తుతం ఉన్న ప్రభ, ప్రాముఖ్యం తగ్గిపోయి ప్రపంచ పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదం ఉన్నది.

ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర అధికారుల ఆధిపత్య ధోరణి వల్ల.. తెలంగాణలోని చారిత్రక, వారసత్వ ప్రాధాన్యంగల ప్రాంతాలపై వివక్ష కొనసాగింది. ఆంధ్రాప్రాంతంలో అంతగా ప్రాముఖ్యం లేని అనేక ప్రాంతాలను ఏఎస్ఐ పరిధిలో చేర్చి.. తెలంగాణలోని ప్రాంతాలను పట్టించుకోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో 137 కట్టడాలను కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో ఉంటే.. అందులో ఆంధ్రా ప్రాంతానికి చెందినవే 129 కట్టడాలు ఉండగా.. తెలంగాణకు చెందినవి ఎనిమిది మాత్రమే. కేంద్రప్రభుత్వం ప్రతిఏటా ఏఎస్ఐకి కేటాయించే నిధులను సంఖ్యాపరంగా అధికంగా ఉన్నాయని ఆంధ్రాకే ఎక్కువభాగం మళ్లించి తెలంగాణపై వివక్ష చూపారు. ఇందుకు ఉదాహరణ 2006లో ప్రారంభమైన వరంగల్‌లోని వేయిస్తంభాల గుడి మంటప నిర్మాణ పనులు 13 ఏండ్లు గడిచినా పూర్తికాకపోవడమే. దీనిపై తెలంగాణ ప్రభుత్వం అనేక పర్యాయాలు ఏఎస్ఐకి విన్నవించినా స్పందించిన పాపానపోవడం లేదు.


ఆంధ్రాలో 129.. హైదరాబాద్‌లో 8..

'అడుగడుగు శిల్పాలురా తెలగాణ.. నాట్యపు శిఖరాలురా' అని రావెళ్ల తెలంగాణ చారిత్రక, శిల్ప సౌందర్యాన్ని ఏనాడో కీర్తించారు. తొలి శాతవాహనులు, చాళుక్యులు, కాకతీయులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు ఇలా అనేక రాజవంశాలు తెలంగాణను పాలించి ఇక్కడి సాంస్కృతిక, జీవన వైవిధ్యాన్ని నలుదిశలా చాటారు. నాటి ఘనమైన చరిత్ర నేడు ప్రతి పల్లెల్లోనూ సాక్షాత్కరిస్తున్నది. ఊరూరా ఇండ్లనే కోటలుగా కట్టుకున్న వారసత్వ సంపద తెలంగాణ సొంతం. దేశ, విదేశీ రాయబారులు ఎంతోమంది ఇక్కడి సంపదను మెచ్చుకొన్నారు. కానీ, ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా ప్రాంతాల అధికారులు తెలంగాణ చారిత్రక, వారసత్వ సంపద మరుగునపడేశారు. ఏఎస్ఐ జాబితాలోని 137 ప్రొటెక్టెడ్ మాన్యుమెంట్స్‌లో 129 ప్రాంతాలు ఆంధ్రాకు చెందినవి ఉంటే.. తెలంగాణ నుంచి 8 మాత్రమే చేర్చారు. రెండు కోటలు (గోల్కొండ, ఖిలా వరంగల్) రామప్ప, వేయిస్తంభాలగుడి, జానంపేట, ఆలంపూర్, చార్మినార్, కొండాపూర్‌ను మాత్రమే తెలంగాణ ప్రాంతం నుంచి కేంద్ర పురావస్తుశాఖ తమ పరిధిలోకి తీసుకున్నది. రాష్ట్ర విభజన అనంతరం ఈ ప్రాంతాలను మాత్రమే నోటిఫై చేస్తూ హైదరాబాద్ ప్రత్యేక సర్కిల్ ఏర్పాటుచేశారు. హైదరాబాద్ సర్కిల్ పరిధిలో గోల్కొండతోపాటు వరంగల్ సబ్ సర్కిల్ (వేయి స్తంభాల గుడి, రామప్ప, ఖిలా వరంగల్, జానంపేట) మాత్రమే ఉన్నాయి. నిజానికి ఆలంపూర్ (ప్రస్తుతం జోగుళాంబ గద్వాల జిల్లా)లోని 8 మాన్యుమెంట్స్, శక్తిపీఠంతోసహా ఇక్కడ సబ్ సర్కిల్ చేయదగ్గ ప్రాంతం. ఇవేవీ పట్టించుకోకుండా.. ఉన్న హైదరాబాద్ సర్కిల్‌ను మినీసర్కిల్‌గా మార్చాలని ఏఎస్ఐలో ఉన్న ఆంధ్రా అధికారులు కుట్ర పన్నుతున్నట్టు తెలిసింది. అదే సమయంలో ఏపీ సర్కిల్‌ను అమరావతి, మరో ప్రాంతం పేరుతో రెండు సర్కిళ్లు చేయాలని ప్రతిపాదనలు కూడా పెట్టినట్టు తెలిసింది.



మినీ సర్కిల్‌గా మారిస్తే..

వాస్తవంగా ఏఎస్ఐ బడ్జెట్ కేటాయింపులు చేస్తే హైదరాబాద్ సర్కిల్‌కు, ఆంధ్రా సర్కిల్‌కు సమానంగా నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. అదే హైదరాబాద్‌ను సబ్‌సర్కిల్ చేస్తే చాలావరకు నిధులు తగ్గుతాయి. అంతేకాకుండా సిబ్బంది స్థాయి కూడా మారిపోతుంది. నిధులు, అధికారుల పోస్టుల స్థాయిని పక్కనపెడితే.. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద ప్రాముఖ్యం తగ్గే ప్రమాదం అధికంగా పొంచి ఉన్నది. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో తెలంగాణ చారిత్రక ఇమేజ్ దెబ్బతింటుంది. తను చేయదు, చేయనివ్వదు అని ముద్రపడ్డ కేంద్ర పురావస్తుశాఖ తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ ఔన్నత్యాన్ని మరింత దిగజార్చే కుట్ర లోపాయికారిగా చేస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.



శుక్రవారం హైదరాబాద్‌లో మాజీమంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

ఎల్లారెడ్డి, నమస్తే తెలంగాణ: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో లేగదూడ మృతిచెందింది. గురువారం మేత కోసం వెళ్లిన పశువుల మంద నుంచి ఒక లేగ దూడ తప్పిపోయింది. యజమాని దాన్ని వెతకడానికి వెళ్లగా చనిపోయి కనిపించడంతో అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం అటవీ శాఖ డిప్యూటీ రెంజ్ అధికారి బాలకృష్ణం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.



శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్

వారసత్వ కట్టడాల పునర్నిర్మాణం!

- కార్యాచరణ ప్రణాళికను వెంటనే రూపొందించాలి
- పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న వారసత్వ కట్టడాలను వెంటనే గుర్తించి, వాటితోపాటు వివిధ ప్రాంతాల్లోని కట్టడాల పునర్నిర్మాణానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేయాలని పురావస్తుశాఖ అధికారులకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ సూచించారు. వారసత్వ కట్టడాలను శుభ్రపర్చడం, వాటికి ఫెన్సింగ్, లైటింగ్ ఏర్పాటుచేయడం వంటి పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వారసత్వ కట్టడాల పునర్నిర్మాణంపై శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. బోధన్‌లోని దేవల్ మజీద్, నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయం, డిచ్‌పల్లిలోని రామ్ టెంపుల్, జగిత్యాల కోట, కొలనుపాకలోని జైన మందిరాల వద్ద పునర్నిర్మాణ చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలో ఈ వారసత్వ కట్టడాలను సందర్శించనున్నట్టు చెప్పారు. నగరంలో ఉన్న క్లాక్‌టవర్ల వివరాలను ఇవ్వాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. సమీక్షా సమావేశంలో పురావస్తుశాఖ డైరెక్టర్ విశాలాచ్చితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమ
నైపుణ్యాలపై ఉచిత శిక్షణ

- హైదరాబాద్‌లో 8 నెలలపాటు ట్రైనింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్మీడియెట్ పాసైన నిరుద్యోగులకు శుభవార్త. వస్త్ర పరిశ్రమ నిర్వహణకు సంబంధించిన పారిశ్రామిక ఇంజినీర్ ఎగ్జిక్యూటివ్ కోర్సును ఉచితంగా బోధించనున్నట్లు అపారెల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్(ఏటీడీసీ) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎనిమిది నెలలపాటు కొనసాగే ఈ కోర్సును దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద అభ్యర్థులకు అందిస్తారు. శిక్షణకాలంలో గ్రామీణ అభ్యర్థులకు హైదరాబాద్‌లో ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ఈ కోర్సులో భాగంగా వస్త్ర పరిశ్రమలో సమయపాలన, ఉత్పత్తి నిర్వహణ, ఉత్పత్తి ప్రణాళికల గురించి బోధిస్తారు. సాఫ్ట్ నైపుణ్యాలు, ఇంగ్లిషు, కంప్యూటర్ కోర్సులు నేర్పిస్తారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు వస్త్ర పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపింది. ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుంచి 25 ఏండ్లలోపు వయస్సున్న నిరుద్యోగులు ఈ కోర్సుకు అర్హులు. వైట్ రేషన్‌కార్డు కలిగి ఉండాలి. ఆధార్‌కార్డు, నివాసధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఏటీడీసీ, సర్వే నంబర్ 64, హోటల్ ఆవాస ఎదురుగా, మాదాపూర్, హైటెక్‌సిటీ, హైదరాబాద్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు. పూర్తి వివరాల కోసం 040-23112155/66, 9912108844, 9885089801, 9611238944 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మెట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా లింబాద్రి

ఎన్నిక ఏకగ్రీవం



లింబాద్రి

మెట్‌పల్లి టౌన్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి బల్దియా వైస్ చైర్మన్‌గా టీఆర్ఎస్ కౌన్సిలర్ మైలారపు లింబాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశమందిరంలో మెట్‌పల్లి సబ్ కలెక్టర్ గౌతమ్ పొత్రు పర్యవేక్షణలో వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించారు. సమావేశానికి 12 మంది టీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్, ఒకరు బీజేపీ కౌన్సిలర్లు హాజరయ్యారు. మున్సిపల్ అధ్యక్షురాలు మర్రి ఉమారాణి 15వ వార్డు టీఆర్ఎస్ కౌన్సిలర్ మైలారపు లింబాద్రిని వైస్ చైర్మన్ పదవికి ప్రతిపాదిస్తున్నట్టు ప్రకటించగా.. స్వతంత్ర కౌన్సిలర్ జక్కని నర్సయ్య, టీఆర్ఎస్ కౌన్సిలర్ ద్యావతి అరుణ బలపరిచారు. పోటీకి ఎవరూ నిలబడకపోవడంతో లింబాద్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సబ్ కలెక్టర్ ప్రకటించి ఎన్నిక పత్రాన్ని అందజేశారు. అనంతరం లింబాద్రి వైస్ చైర్మన్‌గా ప్రమాణం చేశారు. గతంలో వైస్‌చైర్మన్‌గా ఉన్న గంగాధర్‌పై కౌన్సిలర్ల అవిశ్వాసం నెగ్గడంతో ఇక్కడ ఎన్నిక అనివార్యమైంది.



భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవం నిర్వహించారు. గోదాదేవికి 108 గంగాళాలతో పాయస్నానం చేపట్టారు. నక్షత్ర హారతి ఇస్తూ కూడారై అనే పాశురాన్ని పఠించారు.
- భద్రాచలం, నమస్తే తెలంగాణ

ఖానాపురం కాంగ్రెస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

- టీఆర్ఎస్ పార్టీకే దక్కనున్న ఎంపీపీ పదవి

ఖానాపురం: వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం ఎంపీపీ తక్కళ్లపల్లి రవీందర్‌రావుకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నర్సంపేట ఆర్డీవో రవి అధ్యక్షతన ఎంపీపీ రవీందర్‌రావుపై అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. మండలంలో ఆరుగురు టీఆర్ఎస్, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఉన్నారు. డిసెంబర్ 9న టీఆర్ఎస్ ఎంపీటీసీలు ఆర్డీవోకు అవిశ్వాస నోటీసు ఇవ్వడంతో నిబంధనల మేరకు శుక్రవారం అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. అవిశ్వాస పరీక్షకు టీఆర్ఎస్ ఎంపీటీసీలు మాత్రమే హాజరుకావడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు అధికారులు ప్రకటించారు. త్వరలో నూతన ఎంపీపీని ఎన్నుకోనున్నారు.

ఔటర్‌పై ఘోర రోడ్డుప్రమాదం

- అంబులెన్సును ఢీకొట్టిన ఇన్నోవా.. నలుగురు దుర్మరణం
- చికిత్స తర్వాత ఇంటికి వెళ్తుండగా విషాదం
- ముగ్గురు కుటుంబసభ్యులు, డ్రైవర్ మృత్యువాత





ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన అంబులెన్స్, ఇన్నోవా. (ఇన్‌సెట్) మృతులు వెంకటేశ్వరరావు, అంబులెన్స్ డ్రైవర్ శివ

ఆదిబట్ల: ఔటర్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డుప్రమాదంలో నలుగురు కర్ణాటకవాసులు దుర్మరణం చెందారు. వైద్యం చేయించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురితోపాటు డ్రైవర్ మృత్యువాత పడ్డారు. విషాదకరమైన ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావిర్యాల ఔటర్ రింగు రోడ్డుపై వండర్‌లా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఆదిబట్ల సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా గంగావతికి చెందిన బుల్లిరెడ్డి వెంకటేశ్వర్‌రావు (60) కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆయనకు వైద్యం చేయించేందుకు ఆంధ్రప్రదేశ్ ఏలూరులో ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. వైద్యం చేయించిన తర్వాత ఏలూరు నుంచి ప్రైవేటు అంబులెన్సులో గురువారం రాత్రి బళ్లారికి బయల్దేరారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాల ఔటర్‌రింగు రోడ్డుపై వండర్‌లా సమీపంలోకి రాగానే శంషాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు డివైడర్‌ను దాటుకొని వేగంగా వచ్చి అంబులెన్సును ఢీకొట్టింది. దీంతో అంబులెన్సులో ఉన్న వెంకటేశ్వర్‌రావు (60), అతడి భార్య సుబ్బలక్ష్మి (55), అంబులెన్స్ డ్రైవర్ శివ (28) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్‌రావు కుమారుడు హేమచందర్ (35) ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. గాయపడిన మరో డ్రైవర్ కౌశిక్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఇన్నోవాలో ఉన్న హస్తినాపురానికి చెందిన అవినాశ్, ఆయన భార్య శివాణి, కుమారుడు మనోజ్, చిన్నారులు కౌశిక్, రేనా ఉన్నారు. వీరు కర్ణాటక, తమిళనాడులోని వివిధ ప్రాంతాలను సందర్శించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరంతా స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకొన్న స్థానికులు అంబులెన్సులో చిక్కుకొన్నవారిని బయటకుతీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించిన పోలీసులు.. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.


నూనె దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

వేములవాడ, నమస్తేతెలంగాణ: వేములవాడ పట్టణంలోని పలు నూనె దుకాణాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కల్తీనూనె విక్రయిస్తున్నారనే సమాచారంతో వేములవాడలోని మెయిన్‌రోడ్డు, కోరుట్ల బస్టాండ్ ప్రాంతాల్లోని నూనె దుకాణాలపై దాడులు చేశారు. ఎలాంటి వివరాలు, సమాచారం లేకుండా కవర్లలోనే స్థానికంగానే ప్యాక్ చేసి విక్రయిస్తున్న నూనె నమూనాలు సేకరించారు. దుకాణాల నిర్వాహకులు కిషన్, రాజేందర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

మునగాల: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురంలో శుక్రవారం జరిగింది. గణపవరానికి చెందిన సూరేపల్లి చినముత్తయ్య(55), అతని భార్య కమలమ్మ(49) దంపతులు ఓ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆటోలో ముకుందాపురం చేరుకున్నారు. ఆటోదిగి రోడ్డు దాటుతుండగా కోదాడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. కమలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడ్డ ముత్తయ్య కోదాడలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఢీకొట్టిన కారు ఆగకుండా పోయిందని పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తుజరుపుతున్నట్టు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.


ఓటరు జాబితాలో
పొరపాట్లకు బాధ్యులెవరు?



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటరు జాబితాలోని పొరపాట్లకు బాధ్యులెవరని కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తప్పులు దొర్లాయని సీఈవో రజత్‌కుమార్ స్వయంగా ప్రకటించారని, సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

చంద్రబాబు ఎంవోయూలన్నీ ఎన్నికల ఎత్తుగడే


- వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంవోయూలు, శంకుస్థాపనల పేరిట ఏపీ సీఎం చంద్రబాబు చేస్తున్నదంతా ఎన్నికల ఎత్తుగడేనని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. 'ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేస్తారు. కానీ చంద్రబాబు పదవి దిగిపోయేముందు శంకుస్థాపన ఫలకాలువేయడం, లక్షలకోట్ల పెట్టుబడులు వస్తున్నాయనడం మభ్యపెట్టడమే' అని ట్వీట్‌చేశారు. 'ఎన్టీఆర్ బయోపిక్.. ఆయన జీవితాన్ని ఈ తరానికి చూపే సమయంలో యదార్థంగా ఉండాలి. బాలకృష్ణ, ఆయన వెనుక ఉన్న చంద్రబాబు దింపుడు కల్లం ఆశతోనే ఎన్నికల ముందుసినిమాను విడుదలచేశారు. ఈ ప్రయత్నాన్ని ఈసడించుకుంటున్నారు' అని పేర్కొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి.. తప్పించుకునే యత్నంలో ఇద్దరు యువకుల మృతి

విజయవాడ: కృష్ణా జిల్లాలో కోడిపందేలరాయుళ్లపై పోలీసులు చేసిన దాడులు ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొన్నాయి. చాట్రాయి మండలం చిత్తపూర్‌లో గురువారం అర్ధరాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు దాడిచేశారు. తప్పించుకునే క్రమంలో చిత్తూరి శ్రీనివాసరావు (20), కుక్కల చెన్నకేశవరావు (26) బావిలోకి దూకగా, కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయారు.



కొండెంగ సాక్షిగా నామినేషన్లు



కొండెంగ సాక్షిగా నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న రేణికుంట సర్పంచ్ అభ్యర్థి బొల్లం సుధాకర్

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి క్లస్టర్ కేంద్రంలో శుక్రవారం పలువురు అభ్యర్థులు సర్పంచ్, వార్డు సభ్యులకు కొండెంగ సాక్షిగా నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. కోతుల బెడద నివారణకు కొద్ది రోజుల క్రితం కొండంగను కొనుగోలు చేసి గ్రామ పంచాయతీ ఆవరణలో చెట్టుకు కట్టేశారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కాగా, రేణికుంటకు చెందిన బొల్లం సుధాకర్‌తోపాటు పలువురు అభ్యర్థులు కొండెంగ ముందుకు వెళ్లి నామినేషన్ పత్రాలపై సంతకం చేశారు.

-తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ



వెంకటమ్మ



కృష్ణవేణి

సర్పంచ్ బరిలో తోటికోడళ్లు

అంతర్గాం టీటీఎస్‌లో ఫైట్

అంతర్గాం: పెద్దపల్లి జిల్లా అంతర్గాం పంచాయతీలో ఆసక్తికర పోటీ నెలకొన్నది. సర్పంచ్ స్థానానికి తోటి కోడళ్లు నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది. అంతర్గాం మండలంలోని టీటీఎస్ కాలనీ ఇటీవల కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఈ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా తొలి విడతలో ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన తోటి కోడళ్లు కుర్ర వెంకటమ్మ, కుర్ర కృష్ణవేణి ఇటీవల నామినేషన్ వేశారు. మండల కేంద్రం కావడం, అందులోనూ కొత్త పంచాయతీ కావడంతో తొలి సర్పంచ్‌గా గెలిచి చరిత్రలో నిలువాలని ఎవరికి వారు భావిస్తున్నారు.

మొదలైన రెండోవిడుత

4,137 పంచాయతీలకు ఎన్నికలు.. తొలిరోజు 14,048 నామినేషన్లు దాఖలు

తొలిదశలో అభ్యంతరాల స్వీకరణ పూర్తి.. నేడు పరిశీలన

11 పంచాయతీల్లో నామినేషన్లు నిల్ .. సోమవారం నుంచి ప్రచార పర్వం.. ఆరురోజులకే పరిమితం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పంచాయతీ ఎన్నికల్లో మరో కీలక ఘట్టం మొదలైంది. రెండో విడుత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఈ విడుతలో 4,137 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా.. తొలిరోజు 14,048 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిదశకు సంబంధించి శుక్రవారం నామినేషన్లపై అభ్యంతరాలను స్వీకరించారు. వాటిని శనివారం పరిశీలించనున్నారు. తొలి విడుతలోని 11 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం లేదని ఎన్నికల అధికారులు ప్రకటించారు. పరిశీలన అనంతరం నామినేషన్లు మిగలకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మరోవైపు పంచాయతీ ఎన్నికల్లో ప్రచార గడువును ఆరు రోజులకే పరిమితం చేశారు. అభ్యర్థుల తుదిజాబితా ప్రకటించిన తర్వాత ప్రచారాన్ని ప్రారంభించి, పోలింగ్ సమయానికి 38 గంటల ముందు నిలిపివేయాలని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టంచేశారు.

నామినేషన్ల పర్వం ప్రారంభం

రెండో విడుతలో ఎన్నికలు జరగనున్న పంచాయతీలకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ జారీచేశారు. వెంటనే 4,137 సర్పంచ్ స్థానాలు, 36,620 వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ మొదలైంది. మొదటిరోజు సర్పంచ్ స్థానాలకు 4,850, వార్డు స్థానాలకు 9,198 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 13 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 25న పోలింగ్ జరుగుతుంది.

11 గ్రామాల్లో నామినేషన్లు నిల్

తొలి విడుతకు సంబంధించి 11 గ్రామాల్లో ఎన్నికలు జరుగడం లేదని ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ల పరిశీలన పూర్తయ్యేనాటికి ఈ గ్రామాల్లో నామినేషన్లు మిగలలేదని చెప్పారు. కొన్నిచోట్ల నామినేషన్లు దాఖలు చేయలేదని, మరికొన్నిచోట్ల వేసినా తిరస్కరణకు గురయ్యాయని పేర్కొన్నారు. రిజర్వేషన్లు అనుకూలించకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని ఐదు గ్రామాలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ప్రశాంత్‌నగర్, లక్ష్మాపూర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి, కల్ములోనిపల్లి గ్రామాల్లో ఒక్క గిరిజన కుటుంబం లేకున్నా అధికారులు ఎస్టీ రిజర్వ్‌డ్‌గా గుర్తించారు. దీంతో ఇక్కడ ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సంగెం, నారాయణరావుపేట ఎస్సీకాలనీ, మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ధర్మారావుపేట, వేమనపల్లి మండలం రాజారంలోనూ ఇదే పరిస్థితి. ఈ గ్రామాల్లో ఎస్టీలు లేకున్నా అధికారులు సర్పంచ్ స్థానాలను ఎస్టీ రిజర్వ్ చేయడంతో నామినేషన్లు పడలేదు. కరీంనగర్ జిల్లాలోని రెండు గ్రామాల్లోనూ ఎన్నికలు జరుగడం లేదని అధికారులు తెలిపారు. ఈ పంచాయతీల పరిధిలోని 206 వార్డు స్థానాలకు సైతం ఎన్నికలు వాయిదా పడ్డాయి. వీటిపై పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.



నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా తరలివెళ్తున్న అభ్యర్థి భూమారెడ్డి

తొలివిడుతలో 8,900 నామినేషన్లు తిరస్కరణ

తొలి విడుత ఎన్నికలకు సంబంధించి నామినేషన్లపై అభ్యంతరాలను శుక్రవారం స్వీకరించారు. 4,479 పంచాయతీల నామినేషన్ల స్వీకరణ, పరిశీలన గురువారంతో ముగిసిన సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల శుక్రవారం ఉదయం వరకు పరిశీలన కొనసాగింది. మొత్తం 8,900 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. సర్పంచ్ స్థానాలకు 27,940 నామినేషన్లు దాఖలు కాగా 4,711 తిరస్కరించారు. వార్డు స్థానాలకు 97,690 నామినేషన్లు రాగా 4,189 తిరస్కరణకు గురయ్యాయి. కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం, సంతకాలు పొరపాటుగా చేయడం వంటివి తిరస్కరణకు ప్రధాన కారణాలని అధికారులు చెప్తున్నారు. సర్పంచ్ స్థానాలకు 23,229, వార్డు స్థానాలకు 93,501 నామినేషన్లు అర్హత సాధించాయి. ఆమోదించిన, తిరస్కరణకు గురైన నామినేషన్ల అభ్యంతరాలను శుక్రవారం స్వీకరించారు. వీటిపై శనివారం విచారణ జరుపనున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు వరకు ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. తుది జాబితాను ఆదివారం సాయంత్రం విడుదల చేసి, గుర్తులను కేటాయిస్తారు. అదేరోజు ఏకగ్రీవ పంచాయతీలను అధికారికంగా ప్రకటించనున్నారు.

ప్రచారం ఆరురోజులే..

పంచాయతీ ఎన్నికల్లో ప్రచార పర్వాన్ని ఆరు రోజులకే పరిమితం చేశారు. అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించిన తర్వాత ఆరు రోజుల్లో ప్రచారం ముగించాల్సి ఉంటుంది. ఎక్కువ కాలం ప్రచారం కొనసాగితే గొడవలు జరిగే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ప్రచార గడువును తగ్గించారు. పోలింగ్ ప్రారంభానికి 38 గంటల ముందే ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుంది. తొలివిడుతకు సంబంధించి సోమవారం నుంచి ప్రచారం ప్రారంభం కానున్నది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మైక్‌లు వినియోగించి ప్రచారం చేసుకోవచ్చు. ఆ తర్వాత ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగించనున్నారు. 21న ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుంది.

సోపానం

సర్పంచ్ నుంచే బాజిరెడ్డి ప్రస్థానం

- సుదీర్ఘ రాజకీయ అనుభవం
- నిరంతరం ప్రజల వెన్నంటే



నిజామాబాద్ రూరల్ /ఇందల్వాయి : సుదీర్ఘ రాజకీయంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సర్పంచ్‌గానే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని తన సొంతూరు చీమన్‌పల్లి గ్రామానికి 1973లో బాజిరెడ్డి గోవర్ధన్ పోలీసు పటేల్‌గా ఉద్యోగవిధుల్లో చేరారు. ఏడేండ్లపాటు పోలీసుపటేల్ ఉద్యోగాన్ని సమర్థంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు. 1981లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆయనను గ్రామస్థులు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో పోలీసుపటేల్ ఉద్యోగానికి రాజీనామాచేసి 27వ ఏటలోనే సర్పంచ్‌గా ఎన్నికై రాజకీయంలో తొలి అడుగు వేశారు. 1986లో కాంగ్రెస్‌పార్టీ తరపున బాజిరెడ్డి సిరికొండ మండల ఎంపీపీగా, 1992లో ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏడాది పాటు బాధ్యతలు నిర్వహించారు. 1994లో ఆర్మూర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి 33 వేల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 1994లో రెండోసారి సిరికొండ ఎంపీపీగా ఆయన ఎన్నికయ్యారు. 1999లో ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా.. 2004లో బాన్సువాడ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో బాన్సువాడ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2014లో నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ నుంచి టీఆర్‌ఎస్ తరపున బరిలో నిలిచి డీ శ్రీనివాస్‌పై 26 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇప్పుడు 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో బాజిరెడ్డి తన ప్రత్యర్థి భూపతిరెడ్డిపై 29,894 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ప్రజానాయకుడిగా పేరొందిన బాజిరెడ్డి గతంలో మావోయిస్టులు పాల్పడిన దాడుల్లో మూడుసార్లు మృత్యుంజయుడిగా నిలిచారు. 37 ఏండ్లపాటు సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారు. నిరంతరం ప్రజలతో మమేకమై ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తారు. పల్లెల్లో తరుచుగా పర్యటిస్తూ ప్రజలను పేరుపేరునా పలుకరిస్తూ వారి బాగోగులు పట్టించుకుంటారు

నామినేషన్ వేసిన బాలింత



కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని 41 సర్పంచ్ స్థానాలకు రెండో విడతకు శుక్రవారం నామినేషన్లు స్వీకరించారు. లింగంపేట మండలం నల్లమడుగు గ్రామానికి చెందిన కొండ లావణ్య అనే బాలింత 17 రోజుల బాలుడితో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. - లింగంపేట

వేలం పాడితే చర్యలు తప్పవు

- మంచిర్యాల జిల్లా ఎన్నికల పరిశీలకుడు శర్మణ్
- 'లంబడిపల్లి ఏకగ్రీవం'పై గ్రామంలో విచారణ

చెన్నూర్ రూరల్: సాధారణ ఎన్నికల్లో వేలం పాట పాడి గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా ఎన్నికల పరిశీలకులు శర్మణ్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం లంబడిపల్లి గ్రామ పంచాయతీ ఏకగ్రీవం చేసేందుకు వేలం పాట నిర్వహించారనే ఆరోపణలపై శుక్రవారం ఆయన గ్రామంలో విచారణ చేపట్టారు. ఈమేరకు స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేలం పాట నిర్వహించలేదని, ఏకగ్రీవంతో గ్రామం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతోనే తామంతా స్వచ్ఛందంగా ఏకగ్రీవానికి తీర్మానాలు చేస్తున్నామని ఎన్నికల అధికారికి తెలిపినట్టు గ్రామస్థులు చెప్పారు.



శుక్రవారం మంచిర్యాల జిల్లా లంబడిపల్లిలో ఏకగ్రీవాలపై మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు శర్మణ్

పంచాయతీలకు దండిగా నిధులు

- స్థానికసంస్థలకు త్వరలోనే నిధులు కేటాయింపు
- ఫిబ్రవరిలో సర్పంచ్‌లకు నిధులు-విధులపై అవగాహన సదస్సు
- రాష్ట్ర ఆర్థికసంఘం చైర్మన్ రాజేశంగౌడ్ వెల్లడి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శితో చైర్మన్ భేటీ



శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌చందాతో భేటీ అయిన రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పంచాయతీలకు భారీగా నిధులు వస్తాయని రాష్ట్ర ఆర్థికసంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్ తెలిపారు. శుక్రవారం నాడు ఆయన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌చందాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 2014 నుంచి 2018 వరకు వివిధ శాఖల ద్వారా పన్నులు, పన్నేతర ఆదాయ వివరాలు సేకరించారు. 2014-15లో పన్నుల ద్వారా రూ.6,446.82 కోట్లు, 2015-16లో రూ.14,414.36 కోట్లు, 2016-17లో రూ. 9,781.71 కోట్లు, 2017-18లో రూ.65.99 కోట్లు పన్నుల రూపంలో ఆదాయం వచ్చిందని వివరించారు. పంచాయతీరాజ్ నుంచి 2014-15 నుంచి ఇప్పటివరకు సీనరేజ్ ద్వారా రూ.2,226.9 కోట్లు పొందామని, ఇందులో రూ.57.83 కోట్లు స్థానిక సంస్థలకు బదిలీచేశామన్నారు. ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అసైన్డ్ రెవెన్యూ లోకల్‌బాడీస్ కింద 2014-15 నుంచి ఇప్పటివరకు రూ.2,907.18 కోట్లు వసూలయ్యాయని, వీటిలో స్థానికసంస్థలకు రూ.2,794.57 కోట్లు కేటాయించామని, ఇంకా రూ.112.61 కోట్లు కేటాయించాల్సి ఉన్నదని వివరించారు. ఫిబ్రవరిలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లతో పంచాయతీ నిధులు, విధులపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. సీఎం కేసీఆర్ పంచాయతీలకు రూ.1,500 కోట్లు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారని, వీటిని ఆర్థికసంఘం ద్వారా పంచాయతీలకు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, సీఈవోలు, జెడ్పీటీసీలు, మేయర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్‌ఎఫ్‌సీ సభ్యుడు చెన్నయ్య పాల్గొన్నారు.


నేడు ఎస్‌ఈసీ జిల్లాల పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి శనివారం పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఎన్నికల అధికారులు, పోలీసులతో సమావేశం కానున్నారు. ఆయన శనివారం ఉదయం సిద్దిపేట జిల్లాకు చేరుకుంటారని, ఆ తర్వాత రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పర్యటిస్తారని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

రెండు గ్రామాలకు ఒకే సర్పంచ్

- పంచాయతీ విభజనతో ప్రత్యేక పరిస్థితులు
- ఇక్కడ ఏడాదిన్నర తర్వాతే ఎన్నికలు
- ఆదిలాబాద్ జిల్లా కొబ్బాయి, మాంగ్రూడ్‌లో కొనసాగుతున్న పాలన

బేల: పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న వేళ అందరి దృష్టి ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని కొబ్బాయి గ్రామంపై పడింది. ఈ గ్రామాన్ని రెండు పంచాయతీలుగా విభజించినా సర్పంచ్ మాత్రం ఒక్కరే ఉన్నారు. కొబ్బాయి గ్రామ పంచాయతీకి ఎందుకు ఎన్నికలు జరగడం లేదు?, రెండు పంచాయతీలుగా మారినా ఒక్కరే సర్పంచ్‌గా ఎందుకు కొనసాగుతున్నారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో ఏజెన్సీ ప్రాంతమైన కొబ్బాయి గ్రామ పంచాయతీ మహారాష్ట్రకు సరిహద్దున ఉంటుంది. ఇక్కడి జనాభా 1970. ఈ పంచాయతీ పరిధిలో మాంగ్రూడ్, శంకర్‌గూడ గ్రామాలు ఉన్నాయి. కొబ్బాయి పంచాయతీ మీదుగానే అంతర్ రాష్ట్ర రహదారి వెళ్తున్నది. నిత్యం భారీ వాహనాలు రాకపోకలతో సాగిస్తుండటంతో ఈ రహదారి తరుచూ అధ్వానంగా మారుతుంది. ఫలితంగా మాంగ్రూడ్, శంకర్‌గూడ గ్రామాల వారు మండల కేంద్రమైన బేలకు రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. ఆ గ్రామస్థులు ఆందోళన బాట పట్టినా పరిస్థితి మారలేదు. 2013లో వచ్చిన పంచాయతీ ఎన్నికలను వారు అవకాశంగా మార్చుకున్నారు. బేల నుంచి మాంగ్రూడ్ క్రాస్ రోడ్డు వరకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి నిర్మాణం జరిగే వరకూ ఎన్నికలు నిర్వహించబోమని ఏకగ్రీవంగా తీర్మానించి ఆదిలాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మళ్లీ ఎన్నికల ప్రకటన జారీ అయినా అందరూ ఏకతాటిపై నిలిచి మూకుమ్మడిగా బహిష్కరించారు. రెండేండ్ల తర్వాత రహదారి నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరుకావడంతో గ్రామస్థులు ఎన్నికలకు సుముఖత వ్యక్తంచేశారు.



సర్పంచ్ టేకం పూజ

కొబ్బాయి గ్రామ ముఖచిత్రం

ఇక్కడ 2015లో ఎన్నికలు..

2013కు బదులు 2015 జూలై 4న కొబ్బాయి గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరిగాయి. సర్పంచ్, 12 మంది వార్డు సభ్యుల పదవుల కోసం ఎన్నికలు నిర్వహించారు. వీరి పదవీకాలం 2020 జూలై 3వ తేదీతో ముగియనున్నది. దీంతో అప్పటివరకు అక్కడ ఎన్నికలు ఉండవు. ప్రత్యేక అధికారి పాలన ఉండదు.

రెండు పంచాయతీలకు ఒకే సర్పంచ్..

ఈ పంచాయతీ పరిధిలోని మాంగ్రూడ్ జనాభా 1094. ఇటీవలే ప్రత్యేక పంచాయతీగా ఆవిర్భవించింది. కొబ్బాయి, శంకర్‌గూడ గ్రామాలను కలిపి 876 జనాభాతో కొబ్బాయి వేరే పంచాయతీగా రూపుదిద్దుకున్నది. ఉమ్మడి పంచాయతీ పదవీ కాలం పూర్తికాకపోవడంతో ఇక్కడి సర్పంచ్ టేకం పూజ రెండు పంచాయతీలకు సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. కొబ్బాయి, మాంగ్రూడ్ గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను నియమించినా పాలన మాత్రం సర్పంచ్ ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నది. ఇలా కొబ్బాయి, మాంగ్రూడ్ పంచాయతీలది జిల్లాలోనే అన్నింటికంటే భిన్నమైన పరిస్థితి.

నాడు



గతంలో ఉన్న రోడ్డు (ఫైల్)

నేడు



పోరాటం చేసి సాధించుకొన్న అంతర్ రాష్ట్రరోడ్డు ఇదే..

కోహ్లీ, శాస్త్రికి ఎస్‌సీజీ సభ్యత్వం

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, చీఫ్ కోచ్ రవిశాస్త్రికి తగిన గౌరవం దక్కింది. క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా కోహ్లీ, శాస్త్రికి సిడ్నీ క్రికెట్ స్టేడియం(ఎస్‌సీజీ) గౌరవ సభ్యత్వం దక్కింది. ఆస్ట్రేలియా గడ్డపై 71 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ భారత్ ఈమధ్యే టెస్ట్ సిరీస్‌ను ముద్దాడిన సంగతి తెలిసిందే. ఈ చిరస్మరణీయ విజయంలో కెప్టెన్ కోహ్లీ, కోచ్ శాస్త్రి కీలకంగా వ్యవహరించారు. 'ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్ట్ సిరీస్‌ను దక్కించుకున్న భారత జట్టుకు ఎస్‌సీజీ తరఫున అభినందనలు. టెస్ట్ క్రికెట్‌ను కోహ్లీ, శాస్త్రి మరింత ముందుకు తీసుకెళుతున్నారు. సుదీర్ఘ ఫార్మాట్‌కు అభిమానుల్లో మరింత ఆసక్తి కల్గించేలా పోటీ వాతావరణం నెలకొల్పుతున్నారు. ప్రపంచంలోనే క్రికెట్‌ను అమితంగా అభిమానించే భారత్ లాంటి దేశం టెస్ట్ క్రికెట్‌పై దృష్టిపెట్టడం చాలా బాగుంది' అని ఎస్‌సీజీ చైర్మన్ టోనీ షెఫర్డ్ అన్నాడు. ఇంతకుముందు ఎస్‌సీజీ సభ్యత్వం పొందిన క్రికెటర్లలో సచిన్ టెండూల్కర్‌తో పాటు బ్రియాన్ లారా ఉన్నారు.



నిరవధిక నిషేధం

రాహుల్, పాండ్యాలపై సస్పెన్షన్

విచారణ ముగిసేవరకు జట్టు నుంచి ఉద్వాసన

సీవోఏ కమిటీ చైర్మన్ వినోద్ రాయ్



న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీమ్ ఇండియా యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్‌పై వేటు పడింది. బీసీసీఐ నిర్వహించే విచారణ ముగిసే వరకు శనివారం నుంచి ప్రారంభం కానున్న ఆసీస్ పర్యటన, న్యూజిలాండ్ టూర్‌తో పాటు అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌నుంచి నిరవధిక సస్పెన్షన్ విధించినట్లు బీసీసీఐ పాలకుల కమిటీ (సీవోఏ)చైర్మన్ వినోద్ రాయ్ తెలిపారు.కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొన్న సందర్భంగా ఇద్దరు క్రికెటర్లూ లైంగికపరమైన వ్యాఖ్యలతో మహిళలను కించపరిచేలా మాట్లాడడం.. సామాజికమాధ్యమాల్లో ఇద్దరు క్రికెటర్లపై విమర్శల వర్షం కురవడంతో సీవోఏ కమిటీ కఠిన నిర్ణయం వెలువరించింది. ఆసీస్ పర్యటనలో ఉన్న ఇద్దరు క్రికెటర్లను తక్షణమే స్వదేశం రావాలని ఆదేశాలు ఇచ్చింది.
ఇప్పటికే ఈ విషయంలో హార్దిక్ పాండ్యా బహిరంగ క్షమాపణలు చెప్పినా శాంతించని కమిటీ శుక్రవారం ఇద్దరిపై నిషేధం వేటు వేసింది. తాజాగా షోకాజ్ నోటీస్ జారీ చేసిన వీరిద్దరిపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని వినోద్ రాయ్ స్పష్టం చేశారు. రాహుల్, పాండ్యాలపై విచారణ కోసం తాత్కాలిక అంబుడ్స్‌మన్ లేదా బీసీసీఐ అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలా అన్నది ఇంకా నిర్ణయించలేదని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. కాగా, ఇప్పటికే వీరిద్దరిపై రెండు వన్డేల నిషేధం వేటు వేయాలని సీవోఏ కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం బీసీసీఐ లీగల్ సెల్ సలహా కోసం సంప్రదించింది. ఈ నేపథ్యంలో రాహుల్, పాండ్యా చేసిన వ్యాఖ్యలు కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించలేదని బీసీసీఐ లీగల్ సెల్ స్పష్టం చేసింది. ఆటగాళ్లు లేదా సహాయక సిబ్బంది, బీసీసీఐకి వ్యతిరేకంగా మాట్లాడలేదని స్పష్టం చేసింది

నోరు జారారిలా..

ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడుతూ వెలుగులోకి వచ్చిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అనతి కాలంలోనే టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. ఆసియా కప్ టోర్నీ సందర్భంగా వెన్నెముక గాయంతో విశ్రాంతి తీసుకున్నాడు. చికిత్స అనంతరం కోలుకున్న పాండ్యా ఆసీస్‌తో జరిగే చివరి రెండు టెస్ట్‌లకు జట్టుకు ఎంపికయ్యాడు. కాగా, విశ్రాంతి సమయంలో లోకేశ్ రాహుల్‌తో కలిసి కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పాండ్యా తనకు చాలామంది అమ్మాయిలతో ఆ రకమైన సంబంధాలున్నాయని, వారితో గడిపి వచ్చిన విషయాన్ని మా అమ్మానాన్నలతో పంచుకుంటానని పాండ్యా వెకిలిగా మాట్లాడాడు. 'మా ఇంట్లో వారితో (అమ్మానాన్నలు సహా) అన్ని విషయాలు పంచుకుంటాను. సెక్స్‌కు సంబంధించిన అనుభవాలనూ చెబుతుంటాను. ఏ విషయాన్నీ దాచుకోను. నేను మొదటిసారి సెక్స్ చేసిన విషయాన్నీ మా కుటుంబసభ్యులతో పంచుకున్నాను. ఇంకా చెప్పాలంటే అమ్మాయిలను అదే దృష్టితో చూస్తుంటాను. ముఖ్యంగా మహిళల వెనుకభాగం నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. వెనుకగా కనిపించే వారి అందాలను గమనించేందుకే వారి వెనుక నడుస్తాను' అని అసభ్యకరంగా పాండ్యా పేర్కొన్నాడు. పురుషహంకారం బయటపడేలా మహిళలను సంబోధించే విషయంలో 'ఇది, అది, దానిని' అంటూ రెచ్చిపోయి వెకిలి వ్యాఖ్యలు కూడా చేశాడు. ఇదే షోలో రాహుల్ మాట్లాడుతూ '18 ఏండ్ల వయసునుంచే అమ్మాయిలతో ఎంజాయ్ చేశాను. ఆ సమయంలో నా జేబులో మా అమ్మకు కండోమ్ దొరికింది. దీంతో ఈ విషయాన్ని మా అమ్మ ..మా నాన్న దృష్టికి తీసుకెళ్లింది. మొదట మా నాన్న నన్ను తిట్టాడు. తర్వాత 'ఫర్లేదు..రక్షణ కవచం వాడావు' అంటూ మెచ్చుకున్నారు' అని రాహుల్ అదో పెద్ద ఘన కార్యంగా చెప్పుకొచ్చాడు. వీరిద్దరూ ఆసీస్ పర్యటనలో ఉండగా ఈ షో ప్రసారమైంది. అసభ్యంగా వీరు చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు కురిశాయి. మహిళా సంఘాలతో సహా క్రికెట్ అభిమానులంతా దుమ్మెత్తి పోయడంతో బీసీసీఐ రంగంలోకి దిగింది. దీంతో తను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ హార్దిక్ పాండ్యా ట్విట్టర్ వేదికగా మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పినా బీసీసీఐ శాంతించలేదు. ఒకవైపు వీరిద్దరి వ్యాఖ్యలు బయటకు వచ్చిన వెంటనే 24 గంటల్లో వివరణ ఇవ్వాలంటూ నోటీస్ జారీ చేసిన బీసీసీఐ ..మళ్లీ తాజాగా ఇరువురికీ షోకాజ్ నోటీస్ జారీ చేయాలని నిర్ణయించింది.

సరదాగానే మాట్లాడాడు: హిమాన్షు పాండ్యా

భారత యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను అతని తండ్రి హిమాన్షు పాండ్యా వెనకేసుకొచ్చారు. డేటింగ్, అమ్మాయిల గురించి టాక్‌షో అడగడంతో పాండ్యా సరదాగానే బదులిచ్చాడని చెప్పుకొచ్చారు. అభిమానులను అలరించాలన్న ఉద్దేశంతోనే అలా మాట్లాడాడని చెప్పారు.. . ' పూర్తి వినోదత్మకమైన షోలో హార్దిక్ పాండ్యా పాల్గొన్నాడు. ప్రేక్షకుల ఆనందం కోసం అతను సరదాగా మాట్లాడాడు. ఈ మాటలను తీవ్రంగా తీసుకోవాల్సిన అవసరం లేదు. వినోదాత్మక షోలో మాట్లాడిన మాటలకు ఇంత రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. అతను చాలా అమాయకుడు. సరదా మనిషి' అని పాండ్యాకు బాసటగా హిమాన్షు పాండ్యా స్పందించారు.



ఆరంభం అదరాలి..

ప్రపంచకప్ తుది సన్నాహాల్లో భారత్.. ఒత్తిడిలో ఆస్ట్రేలియా

ఇరు జట్ల మధ్య తొలి వన్డే నేడు

ఆస్ట్రేలియా గడ్డపై భారత్ అద్భుత ఫలితాలతో దూసుకెళుతున్నది. టీ20 సిరీస్‌ను సమం చేయడంతో మొదలుపెడితే ఏడు దశాబ్దాల తర్వాత కంగారూల గడ్డపై టెస్ట్ సిరీస్ కలను సాకారం చేసుకున్న కోహ్లీసేన గెలుపు జోరు కొనసాగించాలన్న పట్టుదలతో ఉన్నది. ప్రపంచకప్‌నకు సమయం దగ్గరపడుతున్న వేళ పరిమిత ఓవర్ల సిరీస్‌లో ప్రయోగాలకు పోకుండా ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలనలోకి తీసుకోవాలన్న తలంపుతో ఉన్నది. మెగాటోర్నీ నాటికి 13 వన్డేలు మిగిలున్న క్రమంలో జట్టుపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చిన మేనేజ్‌మెంట్ తుది సన్నాహాల్లో మునిగిపోయింది. హార్దిక్, రాహుల్ సస్పెన్షన్ వేటు ఓ రకంగా అలజడి కలుగజేసినా పట్టుసడలకుండా పోరాడేందుకు కోహ్లీసేన సిద్ధమవుతున్నది. గతానికి భిన్నంగా ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరాజయాలు ఎదుర్కొంటున్న కంగారూలు కనీసం వన్డేల్లోనైనా పరువు నిలుపుకునేందుకు ప్రాకులాడుతున్నారు. పాత, కొత్తల కలయికతో కనిపిస్తున్న ఆసీస్..ప్రత్యర్థి భారత్‌కు పోటీనిచ్చే ప్రయత్నాల్లో ఉన్నది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు మూడు వన్డేల సిరీస్ మొదలుకాబోతున్నది.


సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య మరో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. పొట్టి, సుదీర్ఘ ఫార్మాట్‌లో అంచనాలకు భిన్నంగా రాణించిన టీమ్ఇండియా..వన్డేల్లోనూ కంగారూలపై ఆధిపత్యం చెలాయించేందుకు తహతహలాడుతున్నది. టెస్ట్ సిరీస్ విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో వన్డేల్లోనూ ఆసీస్ పని పట్టాలన్న పట్టుదలతో కోహ్లీసేన కనిపిస్తున్నది. అందుకు తగ్గట్లు పూర్తిస్థాయి బలగంతో కంగారూలను కసిగా వేటాడాలన్న కృతనిశ్చయంతో ఉన్నది. దీనికి తోడు ప్రపంచకప్ టోర్నీకి సమయం దగ్గర పడుతున్న క్రమంలో మిగిలిన 13 వన్డేల ద్వారా ఆటగాళ్ల ఎంపికపై అంచనాకు వచ్చేందుకు టీమ్‌మేనేజ్‌మెంట్ పావులు కదుపుతున్నది. మరోవైపు భారత్‌కు టెస్ట్ సిరీస్ కోల్పోయిన ఒత్తిడిలో ఉన్న ఆసీస్ వన్డేల్లోనైనా పోటీనిచ్చి మెగా టోర్నీకి ముందు గాడిలో పడాలన్న ఆశతో ఉన్నది. బాల్ ట్యాంపరింగ్ వివాదంతో మసకబారిన తమ ప్రతిష్ఠను తిరిగి నిలబెట్టుకోవాలనుకుంటున్న ఆసీస్..పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవాలనుకుంటున్నది. స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్, సీనియర్ పేసర్ పీటర్ సిడిల్ చేరికతో ఒకింత పటిష్ఠంగా కనిపిస్తున్న కంగారూలు.. మంచి జోరుమీదున్న భారత్‌కు ఏమాత్రం పోటీనిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

హార్దిక్, రాహుల్ లేకుండానే:

ఓ టెలివిజన్ షోలో మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడి బీసీసీఐ సస్పెన్షన్‌కు గురైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, ఓపెనర్ కేఎల్ రాహుల్ లేకుండానే భారత్ మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగుతున్నది. గతేడాది ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే రోహిత్‌శర్మ, ధవన్, కెప్టెన్ కోహ్లీతో టీమ్ఇండియా టాపార్డర్ పెట్టనికోటలా కనిపిస్తున్నది. ప్రత్యర్థి ఎవరన్నది సంబంధం లేకుంగా ఈ బ్యాటింగ్ త్రయం టన్నుల కొద్ది పరుగులతో జట్టుకు విజయాలందించింది. ఈ ముగ్గురు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే ఆసీస్‌కు పట్టపగలే చుక్కలు కనిపించడం ఖాయం. వీరి తర్వాత తెలుగు తేజం అంబటి రాయుడు, కేదార్ జాదవ్, ధోనీ మిడిలార్డర్ భారాన్ని మోయనున్నారు. అయితే గత 20 వన్డేల్లో మహీ కేవలం 25 సగటుతో 275 పరుగులకే పరిమితమయ్యాడు. ఇందులో కనీసం ఒక అర్ధసెంచరీ లేకపోవడం గమనార్హం. వన్డేల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్న ఈ జార్ఖండ్ డైనమైట్ తన ఓవరాల్ వన్డే స్ట్రైక్‌రేట్ 87.89 కంటే తక్కువ(71.42) రేట్‌తో బ్యాటింగ్ చేస్తుండటం ఆందోళన కల్గిస్తున్నది. ఐపీఎల్ సూపర్‌ఫామ్‌తో జట్టులోకి వచ్చిన రాయుడు నాలుగో స్థానానికి అతికినట్లు సరిపోతున్నాడు. ఆసియాకప్‌తో పాటు స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో 11 మ్యాచ్‌లాడిన రాయుడు 392 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీతో సహా మూడు అర్ధసెంచరీలు ఉన్నాయి. దీంతో జట్టును తెగ ఇబ్బందిపెడుతున్న నాలుగో నంబర్‌కు తానే సరైనోడినని రాయుడు చాటిచెప్పాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై సస్పెన్షన్‌తో జట్టు కూర్పు ఒక రకంగా దెబ్బతిన్నది. పాండ్యా జట్టులో ఉంటే అదనపు బౌలర్ అవసరం లేకుండా ఉండేది. ఇదిలా ఉంటే బౌలర్ల కూర్పును పరిశీలించేందుకు మేనేజ్‌మెంట్ ఇదే సరైన సమయంగా భావిస్తున్నది. మొదటి వన్డేకు వేదికైన సిడ్నీ పిచ్‌పై పచ్చిక కనిపిస్తున్న క్రమంలో భువనేశ్వర్‌తో పాటు షమీ, ఖలీల్ అహ్మద్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశముంది. ఇదే జరిగితే ఆల్‌రౌండర్ కోటాలో జడేజా, ఏకైక స్పిన్నర్‌గా చైనామన్ కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చే చాన్స్ ఉంటుంది.

పాత, కొత్తల కలయికతో:

వన్డే సిరీస్‌కు ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు పాత, కొత్తల కలయికతో సిద్ధమైంది. స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్ గైర్హాజరీలో ఇప్పటికే బలహీనంగా కనిపిస్తున్న ఆసీస్..పేస్ త్రయం మిచెల్ స్టార్క్, కమిన్స్, హాజిల్‌వుడ్ లేకుండానే భారత్‌తో సిరీస్‌లో బరిలోకి దిగుతున్నది. సుదీర్ఘ ఫార్మాట్‌లో కీలక ఆటగాడైన స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్..వన్డే జట్టులోకి రాగా, ఎనిమిదేండ్ల తర్వాత పేసర్ పీటర్ సిడిల్ వన్డే మ్యాచ్ ఆడబోతున్నాడు. 2010లో ఆఖరి వన్డే ఆడిన సిడిల్..తనకున్న అనుభవంతో జట్టును గెలిపించాలని ప్రయత్నిస్తున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరుగ్గా రాణించిన వికెట్‌కీపర్ బ్యాట్స్‌మెన్ అలెక్స్..కెప్టెన్ ఆరోన్ ఫించ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టనున్నాడు. ఉస్మాన్ ఖవాజ, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కోంబ్‌తో ఆసీస్ మిడిలార్డర్ పటిష్ఠంగానే కనిపిస్తున్నది. ఆల్‌రౌండర్లు మ్యాక్స్‌వెల్, స్టోయినిస్ ఏ మేరకు రాణిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ జాసన్ బెహ్రెన్‌డార్ఫ్ వన్డేల్లో అరంగేట్రం చేయబోతున్నాడు. భారత్‌తో తొలి వన్డే మ్యాచ్‌కు ముందే ఆస్ట్రేలియా 11 మందితో జట్టును శుక్రవారం ప్రకటించింది.



జట్లు అంచనా

భారత్: కోహ్లీ(కెప్టెన్), రోహిత్‌శర్మ, ధవన్,రాయుడు, ధోనీ, జాదవ్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్, ఖలీల్, షమీ.
ఆస్ట్రేలియా: ఫించ్(కెప్టెన్), అలెక్స్ క్యారీ, ఖవాజ, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కోంబ్, మార్కస్ స్టోయినిస్, మ్యాక్స్‌వెల్, పీటర్ సిడిల్, రిచర్డ్‌సన్, లియాన్, బెహ్రెన్‌డార్ఫ్.

ఉదయం: 7.50 నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-3లో ప్రత్యక్ష ప్రసారం

పిచ్, వాతావరణం

శనివారం సిడ్నీలో ఎండ కాసే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో సిడ్నీ పిచ్ చాలా ఫ్లాట్‌గా కనిపిస్తున్నది. గత కొన్ని రోజులుగా వర్షం కురుస్తున్నా..మైదానాన్ని కవర్లతో కప్పివుంచడం వల్ల మ్యాచ్‌లో భారీ స్కోరు నమోదయ్యే చాన్స్ ఉంది.

65 వన్డేల్లో ఐదువేల పరుగుల మైలురాయిని అందుకోవడానికి ధవన్‌కు కావాల్సిన పరుగులు.

వన్డేల్లో 2000వేల క్లబ్ చేరడానికి జడేజా 18 పరుగుల దూరంలో ఉన్నాడు. **18**

1 100 వికెట్ల ఫీట్‌ను అందుకోవడానికి భువనేశ్వర్‌కు ఒక వికెట్ కావాలి.

రిటైర్మెంట్ ఇస్తే.. మళ్లీ బ్యాటు పట్టను- కోహ్లీ

మామూలుగా అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తే..స్టార్ క్రికెటర్లు ప్రపంచంలో వేర్వేరు లీగ్‌లతో బిజీగా గడుపుతుంటారు. కానీ భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ నైజమే వేరని చెప్పచ్చు. మీరు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతారా అంటూ ప్రశ్నించిన మీడియా ప్రతినిధులకు కోహ్లీ తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. 'భవిష్యత్తులో ఎప్పుడు ఏం జరుగుతుందో నాకు అంత కచ్చితంగా తెలియదు. కానీ ఇప్పటికే చాలా క్రికెట్ ఆడేసాను. గత ఐదేండ్ల నుంచి విరామం లేకుండా ఆడుతూనే ఉన్నాను. రిటైర్మెంట్‌పై ఇప్పుడే ఏం మాట్లాడను. ఒకవేళ ఆటకు రిటైర్మెంట్ ప్రకటిస్తే..మళ్లీ బ్యాటు పట్టుకోను. తిరిగి మైదానంలోకి దిగే ఆడను' అని కోహ్లీ అన్నాడు.

మెయిన్ డ్రాకు ప్రజ్నేశ్ ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: భారత వర్ధమాన ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్‌డ్రాకు అర్హత సాధించాడు. తద్వారా ఐదేండ్ల కాలంలో గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన మూడో భారతీయుడిగా రికార్డులకెక్కాడు. అంతకుముందు పురుషుల సింగిల్స్‌లో యుకీ బాంబ్రి, సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ మాత్రమే గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాలో చోటు సంపాదించుకున్నారు.శుక్రవారం జపాన్ ఆటగాడు యోసికె వటానుకితో జరిగిన చివరి అర్హత మ్యాచ్‌లో 6-7(5), 6-4,6-4 స్కోరుతో గుణేశ్వరన్ విజయం సాధించాడు. 29 ఏండ్ల ప్రజ్నేశ్‌కు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ కావడం గమనార్హం.'గ్రాండ్‌స్లామ్ ఆడాలన్నది నా కల. ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించడంతో నా కల నిజమైంది. ఇప్పుడు నాకు ఎంతో సంతోషంగా ఉంది. నాకు మాటలు రావడం లేదు' అని మ్యాచ్ ముగిసిన అనంతరం గుణేశ్వరన్ ఉద్వేగంగా పలికాడు. తొలి సెట్ ఓడిపోవడంతో కాస్త ఒత్తిడికి గురైనా.. కోర్టులో పోరాడానని చెప్పాడు. దీంతో చివరి రెండు సెట్లను గెలుచుకున్నట్లు వివరించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్‌లో అమెరికా టెన్నిస్ ఆటగాడు ఫ్రాన్సెస్ తియాఫోతో తలపడనున్నాడు.

కివీస్‌దే ఏకైక టీ20

ఆక్లాండ్: శ్రీలంకతో శుక్రవారం జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 35 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను దక్కించుకుంది. కివీస్ నిర్దేశించిన 180 పరుగుల లక్ష్యఛేదనలో లంక..ఫెర్గుసన్(3/21), ఇష్ సోధీ(3/30) ధాటికి 16.5 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. తొలుత బ్రేస్‌వెల్(44), కుగెల్జిన్(35 నాటౌట్), టేలర్(33) బ్యాటింగ్‌తో కివీస్ 20 ఓవర్లలో 179/7 స్కోరు చేసింది. కసున్ రజిత్(3/44), మలింగ(2/24) ఆకట్టుకున్నారు. బ్రేస్‌వెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



జోరుగా రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలు

మంచిర్యాల స్పోర్ట్స్: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ వాలీబాల్ బాలబాలికల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ శుక్రవారం ఈ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల జట్లు ఈ టోర్నీలో పోటీ పడుతున్నాయి. తొలి రోజు పోటీల్లో బాలుర విభాగంలో వరంగల్ జట్టు మెదక్‌పై, రంగారెడ్డి జట్టు ఖమ్మంపై, ఆదిలాబాద్ జట్టు నల్లగొండపై, నిజామాబాద్ జట్టు హైదరాబాద్‌పై విజయం సాధించాయి.

ఫైనల్లో బెంగళూరు రాప్టర్స్

సెమీస్‌లో అవధె వారియర్స్‌కు షాక్.. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

బెంగళూరు: భారత స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ సెమీస్‌లోనూ చెలరేగారు. దీంతో పీబీఎల్ సీజన్-4లో బెంగళూరు జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం పటిష్ఠమైన అవధె వారియర్స్‌తో జరిగిన సెమీస్‌లో 2-4 తేడాతో బెంగళూరు రాప్టర్స్ జట్టు విజయం సాధించింది. తొలుత మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ను అవధె వారియర్స్ జట్టు ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఈ సీజన్‌లో అద్భుత విజయాలు సాధిస్తున్న అవధె జోడీ క్రిస్టియన్‌సెన్, అశ్విని పొన్నప్ప జోడీ 15-7,15-10 స్కోరుతో బెంగళూరు జంట సునాయాసంగా ఓడించారు. వరుస విజయాల ఊపును కొనసాగిస్తూ సెమీస్‌లోనూ జట్టుకు 2-0తో తిరుగులేని ఆధిక్యం కట్టబెట్టారు. పురుషుల సింగిల్స్ ఆడిన సాయి ప్రణీత్ విజయంతో జట్టుకు ఊరటనిచ్చాడు. 15-9,15-4 స్కోరుతో వారియర్స్ షట్లర్ లీడాంగ్‌ను సునాయాసంగా వరుసగేముల్లో చిత్తు చేశాడు. బెంగళూరుకు 1 పాయింట్ అందించాడు. ఆ తర్వాత బెంగళూరు రాప్టర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న శ్రీకాంత్ తనపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయలేదు.15-7,15-10 స్కోరుతో అవధె ఐకాన్ ఆటగాడు సన్ వాన్ హోపై విజయం అందించి జట్టు స్కోరును 2-2తో సమం చేశాడు. చివరగా ఒత్తిడి జయిస్తూ పురుషుల డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో అవధె జోడీ యాంగ్ లీ, క్రిస్టియన్‌సెన్‌పై 14-15,9-15 స్కోరుతో హెండ్రా సెతివన్, మహ్మద్ అషాన్ జోడీ విజయం సాధించింది. దీంతో 4-2 ఆధిక్యంతో బెంగళూరు ఫైనల్‌కు దూసుకెళ్లింది. హైదరాబాద్ హంటర్స్, ముంబై రాకెట్స్ మధ్య నేడు జరిగే రెండో సెమీస్ విజేతతో ఫైనల్లో తలపడనుంది.

గీసుగొండలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

గీసుగొండ: రాష్ట్ర అంతర్‌జిల్లాల సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు వీరాగోని రాజుకుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈపోటీలను ఆర్జేడీ రాజీవ్, సాఫ్ట్‌బాల్ జిల్లా చైర్మన్ చల్లా జ్యోతి ప్రాంభించారు. 15 జిల్లాల నుంచి సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ సాంబశివరావు తెలిపారు.



సెన్సెక్స్	నిఫ్టీ
36,010	10,795
97	27

ముడి చమురు (బ్రెంట్) 61.35 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)

24 క్యారెట్లు	33,030
22 క్యారెట్లు	32,880
వెండి (కిలో)	40,450

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	67.70	74.20
యూరో	77.70	85.70
బహ్రెయిన్ దినార్	179.60	191.60
కువైట్ దినార్	223.10	236.10
సౌదీ రియాల్	17.80	19.60
యూఏఈ దిర్హామ్	18.20	19.80

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	79.00
రిటైల్ లైవ్	101.00
డ్రెస్డ్	146.00
స్కిన్‌లెస్	167.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	453-00
రంగారెడ్డి	453-00
మెదక్	453-00
కరీంనగర్	455-00
వరంగల్	455-00
రిటైల్ ప్రైస్	5-15

ఇన్ఫీ లాభం తగ్గింది

అమ్మకాల్లో వృద్ధి.. క్షీణించిన మార్జిన్లు.. రూ.4 ప్రత్యేక డివిడెండ్

బెంగళూరు, జనవరి 11: మరో ప్రధాన ఐటీ కంపెనీ ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశపరిచే విధంగా ఉన్నాయి. మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడిన ఇన్ఫోసిస్ ఫలితాలు అన్ని రకాలుగానూ నిరాశజనకంగానే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నికరలాభం 30 శాతం మేర క్షీణించి రూ. 3,610 కోట్లకు పడిపోయింది. గత ఏడాది ఇదే కాలానికి రూ. 5,129 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. కానీ, ఆదాయం 20.3 శాతం పెరిగి రూ. 17,794 కోట్ల నుంచి రూ. 21,400 కోట్లకు చేరుకుంది. నికరలాభం, స్థూల లాభం, నిర్వహణ మార్జిన్ల విషయంలో మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. నికరలాభం ఈ ఏడాది రెండో త్రైమాసికంతో పోల్చినా సరే 12 శాతం తక్కువగా ఉంది. మార్కెట్ వర్గాలు రూ. 4,115 కోట్ల నికరలాభాన్ని అంచనా వేశాయి. గత త్రైమాసికంలో రూ. 4,110 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. రూపాయిల్లో ఆదాయం 3.8 శాతం పెరిగి రూ. 21,400 కోట్లకు చేరుకుంది. కాగా, డాలర్లలో ఆదాయం 2.3 శాతం పెరిగి 2,987 మిలియన్ డాలర్లకు చేరుకుంది. రెవెన్యూ విషయంలో మార్కెట్ అంచనాలను అందుకోగలిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ 8.5 శాతం నుంచి 9 శాతం మేర పెరుగుతుందనీ, అలాగే నిర్వహణ మార్జిన్ 22–24 శాతం మేర ఉంటుందని ఇన్ఫోసిస్ గైడెన్స్‌ను జారీ చేసింది. నిర్వహణ లాభ మార్జిన్లు 1.1 శాతం తగ్గి 22.6 శాతంగా నమోదైంది. 23.6 శాతంగా ఉండవచ్చునని మార్కెట్ వర్గాలు, వివిధ బ్రోకరేజీలు సగటున అంచనా వేశాయి. ఈ త్రైమాసికంలో రూ. 4,830 కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించింది. ఇది కూడా అంచనాలను అందుకోలేకపోయింది. ఇదిలాఉండగా, ప్రతిషేరుకు నాలుగు రూపాయల ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకోసం ఈ నెల 25వ తేదీని రికార్డ్ తేదిగా నిర్ణయించారు.



ఆర్థిక ఫలితాలు ప్రకటిస్తున్న ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్. చిత్రంలో సీవోవో ప్రవీణ్ రావు తదితరులు

ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కిరణ్ మజుందార్ షా

ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కిరణ్ మజుందార్ షాను తిరిగి నియమించుకున్నది సంస్థ. ఈ పదవిలో ఆమె మార్చి 22, 2022 వరకు కొనసాగుతారు. కంపెనీ స్థిరపడేందుకు, వృద్ధి బాటలో పయనించేందుకు గత 18 నెలలుగా ఆమె అందించిన సేవలు విలువైనవని ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. ఆమె అనుభవం కంపెనీకి అవసరమని అన్నారు. ఇదిలావుండగా, పనయాతో పాటు మరో రెండు అనుబంధ సంస్థలు స్కావ, కల్లిడస్‌లను అమ్మేయాలన్న ప్రతిపాదనలను విరమించుకున్నట్టు ఇన్ఫోసిస్ ప్రకటించింది. కొనుగోలుదారులు దొరకనందునే ఈ ప్రతిపాదనను విరమించుకున్నట్టు తెలిపారు.

రూ.8,2600 కోట్ల షేర్ల బైబ్యాక్

రూ. 8,260 కోట్ల విలువైన షేర్లను బైబ్యాంక్ చేయనున్నట్టు ఇన్ఫోసిస్ తెలిపింది. మొత్తం 10,32,50,00 షేర్లను, అంటే ఈక్విటీలో 2.36 శాతానికి సమానమైన షేర్లను ఓపెన్ మార్కెట్ ద్వారా కొనుగోలు చేయనున్నారు. ప్రతి షేరు దాదాపు రూ. 800 చొప్పున వెచ్చించనున్నది సంస్థ. అమెరికన్ డిపాజిటరీ షేర్లను (ఏడీఎస్)ఈక్విటీ షేర్లుగా మార్చుకుని ఆ తర్వాత వాటిని అమ్ముకునేందుకు వీలు కల్పించారు. గత ఏడాది దాదాపు రూ 13,000 కోట్లతో ప్రతిషేరుకు రూ. 1,150 చొప్పున 11.3 కోట్ల షేర్లను బైబ్యాక్ చేసిన విషయం తెలిసిందే. బైబ్యాక్ కోసం కమిటీ నియమించినట్టు తెలిపింది. ప్రత్యేక తీర్మానం ద్వారా ఈ బైబ్యాక్ ప్రతిపాదనకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆమోదం పొందనున్నట్టు తెలిపింది.

మళ్లీ పెట్రోపోటు

లీటర్ పెట్రోల్‌పై 19 పైసలు, డీజిల్‌పై 28 పైసల వడ్డన



న్యూఢిల్లీ, జనవరి 11: సామాన్యుడిపై మళ్లీ పెట్రోల్ పోటు పడింది. గడిచిన రెండు నెలలుగా ఊరటనిస్తూ ధరలు తగ్గించిన ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలు మళ్లీ ధరలను పెంచడం ప్రారంభించాయి. వరుసగా రెండో రోజు శుక్రవారం లీటర్ పెట్రోల్‌పై 19 పైసలు పెంచిన సంస్థలు..డీజిల్‌పై 28 పైసలు వడ్డించాయి. దీంతో ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.69.07కి చేరుకున్నది. ప్రస్తుత నెలలో ఇదే గరిష్ఠ స్థాయి. గురువారం రూ.68.88గా ఉన్న ధర ఆమరుసటి రోజు రూ.69 దాటిందని ఇంధన విక్రయ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) వెల్లడించింది. అలాగే లీటర్ డీజిల్ ధర రూ.62.53 నుంచి రూ.62.81కి చేరుకున్నది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న స్థానిక పన్ను, వ్యాట్ ఆధారంగా ఆయా ధరల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. దీంట్లోభాగంగా ముంబైలో పెట్రోల్ రూ.74.72కి చేరుకోగా, డీజిల్ రూ.65.73 పలికింది. హైదరాబాద్ విషయానికి వస్తే లీటర్ పెట్రోల్ 20 పైసలు పెరిగి రూ.73.27కి చేరింది. డీజిల్ మరో 30 పైసలు అందుకొని రూ.68.28కి చేరుకున్నది. నూతన సంవత్సరం తొలి నెలలో ఇలా ధరలు పెరుగడం ఇది మూడోసారి. గురువారం పెట్రోల్ 38 పైసలు పెరుగగా, డీజిల్ 29 పైసలు అందుకున్నది. ఈ నెల 7న 21 పైసలు పెరిగిన పెట్రోల్, డీజిల్ 8 పైసలు ఎగబాకింది. వరుసగా మూడుసార్లు పెంచడంతో పెట్రోల్ ధర 78 పైసలు, అదే డీజిల్ 55 పైసలు అధికమైనట్లు అయింది. అక్టోబర్ 18, 2018 తర్వాత తగ్గుముఖం పట్టిన ధరలు ఒకదశలో ఏడాది కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. ఈ మూడు నెలల్లోనే పెట్రోల్ రూ.14.54 తగ్గగా, అదే డీజిల్ రూ.13.53 తగ్గినట్లు అయింది. కాగా, ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 4 వరకు పెట్రోల్ రూ.6.86 పెరుగగా, డీజిల్ రూ.6.73 పెరిగాయి.

మళ్లీ పడకేసిన పారిశ్రామికం

నవంబర్‌లో 0.5 శాతానికి పరిమితం
గడిచిన 17 నెలల్లో ఇదే కనిష్ఠ స్థాయి

న్యూఢిల్లీ, జనవరి 11: పారిశ్రామిక ప్రగతి మళ్లీ పడకేసింది. కొన్ని నెలలుగా ఎగువముఖం పట్టిన దేశపారిశ్రామిక ఉత్పత్తి నవంబర్ నెలలో భారీగా పతనం చెంది 0.5 శాతానికి పరిమితమైంది. గడిచిన 17 నెలల్లో ఇదే కనిష్ఠ స్థాయి. తయారీ రంగంలో నెలకొన్న నిరాశాజనక పనితీరు, కన్స్యూమర్, క్యాపిటల్ గూడ్స్ విభాగాలు కూడా మందకొడి వృద్ధి ఇందుకు కారణమయ్యాయని కేంద్ర గణాంక శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో పరిశ్రమల వృద్ధి 8.5 శాతంగా ఉన్నది. జూన్ 2017లో ఐఐపీ వృద్ధి 0.3 శాతంగా ఉన్నది. అక్టోబర్ నెలకుగాను విడుదలైన ఐఐపీ గణాంకాలను 8.1 శాతానికి బదులు 8.4 శాతానికి సవరించింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో(ఏప్రిల్–నవంబర్) పరిశ్రమల్లో వృద్ధి 5 శాతానికి పెరిగింది. అంతక్రితం ఏడాది ఇది 3.2 శాతంగా ఉన్నది. పారిశ్రామిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నెలకొన్న మందకొడి పరిస్థితులు మొత్తం గణాంకాలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఏడాది క్రితం 10.4 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న తయారీ విభాగం ఈ సారి 0.4 శాతానికి పరిమితమైంది.



వీటితోపాటు గనులు కూడా 2.7 శాతం మాత్రమే వృద్ధి చెందాయి. 2017 నవంబర్‌లో నమోదైన 1.4 శాతం పోలిస్తే మాత్రం రెండింతలు పెరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోలేకపోయింది. ఇంధన రంగం 5.1 శాతం వృద్ధిని కనబరుచగా, క్యాపిటల్ గూడ్స్ 3.4 శాతానికి పరిమితమవగా, కన్స్యూమర్ గూడ్స్ 3.1 శాతం నుంచి 0.9 శాతానికి పడిపోయింది. కన్స్యూమర్ నాన్–డ్యూరబుల్ భారీగా పతనమయ్యాయి. ఏడాది క్రితం 23.7 శాతంగా ఉండగా, ఈసారికి మాత్రం 0.6 శాతంతో సరిపెట్టుకున్నది. 23 రంగాల్లో 10 మాత్రమే ఆశావాదంగా ఉండగా, మిగతా 13 ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. కీలక వస్తువులు ప్రతికూల నుంచి 3.2 శాతానికి పెరుగడం విశేషం.

ఎన్‌ఎస్‌ఈ చైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా

న్యూఢిల్లీ, జనవరి 11: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చైర్మన్ అశోక్ చావ్లా తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామా వెంటనే అమలులోకి వచ్చింది. ఎయిర్‌సెల్–మాక్సిస్ కేసులో ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించిన కొన్ని గంటల్లోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఆయనకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ప్రాసిక్యూట్ చేయడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మరింత సమాచారం ఇవ్వడానికి ఎక్స్ఛేంజ్ నిరాకరించింది. మాజీ ఆర్థిక కార్యదర్శి అయిన చావ్లా..మార్చి 28, 2016 నుంచి ఎన్‌ఎస్‌ఈ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పౌర విమానకార్యదర్శిగాను, సీసీఐ చైర్‌పర్సన్‌గాను పనిచేశారు. గత నవంబర్‌లో యెస్ బ్యాంక్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

వీహబ్ ఆధ్వర్యంలో రుణమేళా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్న వీహబ్ మరో ఆర్థిక సహాయ మేళాను నిర్వహించింది. ఇప్పటికే ఎస్‌బీఐతో కలిసి రుణమేళా నిర్వహించిన వీహబ్ తాజాగా మరో 7 బ్యాంకులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థలతో కలిసి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఔత్సాహికులకు అవగాహన కల్పించడంతో పాటుగా అర్హులైన వారికి రుణాలు ప్రతిపాదించినట్లు వీహబ్ సీఈవో దీప్తి రావుల తెలిపారు.

హెటిరో నుంచి రొమ్ము క్యాన్సర్ వ్యాధి ఔషధం


హైదరాబాద్, జనవరి 11: రాష్ర్టానికి చెందిన ఔషధాల తయారీ సంస్థ హెటిరో డ్రగ్..రొమ్ము క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించే ఔషధానికి ప్రత్యామ్నాయంగా జనరిక్ వెర్షన్ లాపాటినిబ్ ట్యాబ్లెట్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. హెర్టాబ్ బ్రాండ్ కింద లభించనున్న ఈ ఔషధం 250 ఎంజీల్లో దొరకనున్నదని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఔషధాన్ని దేశీయంగా మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్‌ను హెటిరో హెల్త్‌కేర్ లిమిటెడ్ నిర్వహిస్తున్నది. ఇందుకోసం సంస్థ రెండు ఎస్కేయూఎస్‌లను సిద్ధంగా ఉంచింది. క్యాన్సర్ సెల్స్‌ను నియంత్రించడానికి కెపెసిటాబిన్ లేదా లెట్రోజోల్ కాంబినేషన్‌తో ఈ మందును తయా రు చేసింది సంస్థ.

ఆకట్టుకున్న కర్ణాటక బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన కర్ణాటక బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలంలో బ్యాంక్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 60.7 శాతం ఎగబాకి రూ.140.41 కోట్లకు చేరుకున్నది. వడ్డీల మీద వచ్చే ఆదాయం భారీగా పుంజుకోవడం ఇందుకో దోహదం చేసిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. ఏడాది క్రితం బ్యాంక్ రూ.87.38 కోట్ల లాభాన్ని గడించింది.

భారీగా పెరిగిన విదేశీ మారకం నిల్వలు

ముంబై, జనవరి 11: విదేశీ మారకం నిల్వలు భారీగా పెరిగాయి. గడిచిన కొన్ని నెలలుగా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్న ఫారెక్స్ నిల్వలు ఈ నెల 4తో ముగిసిన వారంలో ఏకంగా 2.68 బిలియన్ డాలర్లు పెరిగి 396.084 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కరెన్సీ రూపంలో ఆస్తులు పెరుగడం, పసిడి హోల్డింగ్స్ అధికమవడం వల్లనే విదేశీ మారకం నిల్వల్లో గణనీయ వృద్ధి నమోదైందని రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. అంతక్రితం వారంలో 116.4 మిలియన్ డాలర్లు మాత్రమే పెరిగి 393.404 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ మరో 2.215 బిలియన్ డాలర్లు ఎగబాకి 370.292 బిలియన్ డాలర్లకు చేరాయి. ఏప్రిల్ 13, 2018న రిజర్వులు రికార్డు స్థాయి 426.028 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పతనమవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో రిజర్వు బ్యాంక్ 34 బిలియన్ డాలర్ల మేర నష్టపోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో పసిడి రిజర్వులు 465.5 మిలియన్ డాలర్లు పెరిగి 21,689 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జూన్ 2018తో ముగిసిన ఏడాది కాలంలో ఆర్బీఐ మరో 8.46 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలను పెంచుకున్నది. దీంతో ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ వద్ద 566.23 టన్నుల పసిడి ఉన్నాయి.



హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు అవార్డ్

హైదరాబాద్, జనవరి 11: ప్రతిష్ఠాత్మక ఐసీఎస్ఐ సీఎస్ఆర్ అవార్డును జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు దక్కించుకుంది. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో సెబీ మాజీ ఛైర్మన్ జీఎన్ బాజ్‌పాయ్, ఇండియా ప్రొఫెషనల్ ఫోరమ్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ కౌల్ చేతులు మీదుగా ఎయిర్‌పోర్ట్ ఛీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాజేశ్ అరోరా ఈ అవార్డును అందుకున్నారు. సీఎస్ఆర్ కింద జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ పరిసర గ్రామాల్లో జీవన ప్రమాణాలు మెరుగుదల, సామాజిక మౌలిక వసతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. తమకు ఈ అవార్డు దక్కినందుకు గర్వంగా ఉందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ఎస్‌జీకే కిశోర్ అన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమాలు ద్వారా సామాజిక సుస్థిరాభివృద్ధికి దోహదపడుతాయని ఆయన్న పేర్కొన్నారు.



బిగ్‘సి’లో సంక్రాంతి వినూత్న ఆఫర్లు

హైదరాబాద్, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రముఖ రిటైల్ మొబైల్ సంస్థ బిగ్‘సి’ వినూత్న ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా ఎంపిక చేసిన మొబైళ్లపై విలువైన బహుమతులతోపాటు సున్న శాతం వడ్డీ, డౌన్‌పేమెంట్‌లు, ప్రాసెసింగ్ ఫీజు వంటి ఆకర్షణీయమైన రుణ సదుపాయాన్ని అందచేస్తున్నామని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. వీటితోపాటు బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ప్రతి మొబైల్‌పై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.2,200 వరకు జియో క్యాష్ బ్యాక్, 30 జీబీల డాటాను ఉచితంగా అందిస్తున్నది. ఎంపిక చేయని మొబైళ్లు కొనుగోలు చేసిన వారికి కూడా ఒకసారి స్క్రీన్ రీప్లేస్‌మెంట్ కూడా సంస్థ ఇస్తున్నది. ఇవియే కాక, సామ్‌సంగ్ గెలాక్సీ జే6, జే6 ప్లస్, ఏ7 మొబైళ్ల కొనుగోళ్లపై 10 శాతం క్యాష్‌బ్యాక్, బజాజ్ ఫైనాన్స్ ఈఎంఐ సదుపాయం, టీవీఎస్ క్రెడిట్ సులభంగా ఈఎంఐ లభించనున్నది. ఒప్పో ఎఫ్9 ప్రొ మొబైల్‌పై రైస్‌కుక్కర్, అన్ని వివో మొబైళ్లపై సర్‌ప్రైజ్ గిఫ్ట్, రూ.1,590 విలువైన కార్బన్ కే3 బూమ్ మ్యాక్స్ మొబైల్‌ను రూ.2,500 విలువైన పెడెస్టాల్ ఫ్యాన్‌ను ఉచితంగా అందిస్తున్నది. ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి కూడా ఇస్తున్నది సంస్థ.

మెప్పించని రాబడులు

- లాభాల స్వీకరణకే ఇన్వెస్టర్ల మొగ్గు
- నిఫ్టీకి 27 పాయింట్ల నష్టం

టీసీఎస్, టాటామోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ తదితర హెవీ వెయిట్ షేర్ల నష్టాలతో ప్రధాన సూచీలు వరుసగా రెండో రోజున కూడా నష్టాలతో ముగిశాయి. గరిష్ఠ స్థాయిల్లో ప్రారంభం అయినప్పటికీ మూమెంటమ్ నిలదొక్కుకోలేకపోయింది. మూడో త్రైమాసిక రాబడుల్లో ఆశించిన వృద్ధి కనిపించకపోవడంతో లాభాల స్వీకరణకే ఇన్వెస్టర్లు మొగ్గుచూపారు. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడ్ అవుతుండడం, రూపాయి మారకం విలువ క్షీణిస్తూ ఉండడంతో మార్కెట్లో అప్రమత్త ధోరణి కనిపించింది. చివరి గంటలో వచ్చిన రికవరీతో సూచీలు స్వల్ప నష్టాలకే పరిమితం అయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 96.66 పాయింట్ల నష్టంతో 36,009.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 26.65 పాయింట్ల నష్టంతో 10,794.95 వద్ద ముగిసింది. క్రూడాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక శాతం పెరిగింది. అతి పెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను మెప్పించలేకపోయాయి. మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడిన ఇన్ఫోసిస్ ఫలితాలు కూడా నిరాశజనకంగా ఉండడంతో ఈ సీజన్ లో ఆర్థిక ఫలితాలపై ఆశలు అడుగంటిపోతున్నాయి. ఆర్థకసేవలు, ఎఫ్ఎంసీజీ రంగాల ఇండెక్స్‌లు మినహా మిగతా అన్నిరంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 12 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi





నగరంలో తియ్యని వేడుక

2nd International Sweet Festival

నగరం తియ్యని వేడుకకు సిద్ధమైంది. దేశంలోని అన్ని రాష్ట్రాల సంప్రదాయ తీపి పదార్థాలతో నగరవాసుల నోరు తీపి చేసేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. తెలంగాణలో స్థిరపడిన పలు రాష్ట్రాల మహిళలు స్వయంగా చేసిన తీపి వంటకాలు ఈ స్వీట్ ఫెస్టివల్ లో ప్రదర్శనకు ఉంచనున్నారు. తెలంగాణ పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రేపటి నుంచి ఈ నెల 15 వరకు మూడురోజుల పాటు పరేడ్‌గ్రౌండ్స్‌లో ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. 1200 తీపి వంటకాలు ఈ తియ్యటి వేడుకలో నగర ప్రజల నోరు తీపి చేయనున్నాయి. ఆ తియ్యటి వేడుకల విశేషాలు మీ కోసం..

హైదరాబాద్ భారతదేశానికి ప్రతీక. దేశంలోని భిన్న సంస్కృతులు, సంప్రదాయలు, సకల కళలు హైదరాబాద్‌లో కనిపిస్తాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు హైదరాబాద్‌లో కనిపిస్తారు. అందుకే హైదరాబాద్ మినీ భారతం అనడంలో అతిశయోక్తి లేదు. దేశం మొత్తాన్ని ఒకేచోట చూడాలనుకుంటే అది హైదరాబాద్‌లో తప్ప మరెక్కడా కనిపించదు. దేశంలోని మిగతా మెట్రోపాలిటన్ నగరాల కంటే హైదరాబాద్ ప్రత్యేకం. దేశం మొత్తాన్ని ఒకేచోట చూడాలనుకుంటే హైదరాబాద్‌లో చూడొచ్చు. 25 రాష్ట్రాల సంప్రదాయ తీపి వంటకాలతో మూడురోజుల పాటు ఈ స్వీట్ ఫెస్టివల్ జరుగనుంది. ఇందుకు గాను సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. స్టాల్స్‌లో ఉండే మహిళలు వారి రాష్ట్రాన్ని ప్రతిబింబించే వేషధారణలో ఉంటారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వివిధ రాష్ట్రాల మహిళలు ఇంట్లో తయారుచేసిన సంప్రదాయ స్వీట్లు మాత్రమే ఇక్కడ ప్రదర్శిస్తారు. రకరకాల స్వీట్లతో నోరూరించడమే కాదు.. రంగురంగుల పతంగుల వేడుక కూడా దీనికి జతగా కనువిందు చేయనున్నది. హైదరాబాద్‌లో నివసించే వివిధ రాష్ట్రాలు, దేశాల ప్రజల ఆహారపు అలవాట్లను ప్రతిబింబించేలా ఈ వేడుక ఉంటుంది.

హైదరాబాద్ మినీ భారతం..



విభిన్న రాష్ట్రాల ప్రజలను ఒక్కచోటకు చేర్చి నగరాన్ని ఒక మినీ భారతంగా ఆవిష్కరించనున్నాం. ఈ స్వీట్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసే స్టాల్స్ అన్నీ మహిళలే స్వయంగా స్వీట్లు తయారుచేసి, నిర్వహిస్తారు. దేశంలోని బహు భాషత్వం, భిన్నత్వంలో ఏకత్వాన్ని, భారతీయుల సమిష్ఠిని, జాతీయ సమైక్యతను ప్రపంచానికి చాటేలా ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్‌లో భారతదేశాన్ని ఆవిష్కరించి హైదరాబాద్ ఒక మినీభారతం అని నిరూపిస్తాం. హైదరాబాద్‌లో నేషనల్ ఇంటిగ్రేషన్ టవర్ పేరుతో 25 అంతస్తుల భవనాన్నీ నిర్మిస్తున్నాం. ఒక్కో అంతస్తులో ఒక్కో రాష్ట్రాలకు సంబంధించిన అన్ని అంశాలు ప్రదర్శించబడుతాయి. సందర్శకులకు భద్రత, పార్కింగ్, టాయ్‌లెట్లు, వైద్య సదుపాయం, ఎమర్జెన్సీ తదితర ఏర్పాట్లు చేశాం.

- బుర్రా వెంకటేశం,
టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి

తియ్యని కలయిక..



25 రాష్ట్రాలు, 15 దేశాల సంస్కృతులు, వంటలు, కళారూపాలు అన్నీ ఒకేచోట కనిపించే తియ్యటి కలయిక ఇది. ఆకాశం నిండా రంగు రంగుల పతంగులు ఒకవైపు, గ్రౌండ్ నిండా వెయ్యికి పైగా వెరైటీ స్వీట్లతో మరోవైపు నగరంలో సరికొత్త వేడుకకు సన్నాహాలు పూర్తయ్యాయి. హైదరాబాద్ అంటే సేఫ్ సిటీ, సెక్యూర్ సిటీగా పేరు తెచ్చుకుంది. ఈ స్వీట్ ఫెస్టివల్ వల్ల స్వీట్ సిటీగా కూడా హైదరాబాద్‌ను పిలుచుకుంటాం. దేశంలోనే ఇలాంటి వేడుక నిర్వహిస్తున్న ఘనత కేవలం తెలంగాణకే దక్కుతుంది. మరే రాష్ట్రంలో, దేశంలో కూడా ఇలాంటి వేడుక జరుగలేదు.

- మామిడి హరికృష్ణ,
భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్

సకుటుంబ సపరివార సమేతంగా..

జనవరి 13న ప్రారంభం కానున్న ఈ ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొనేవారి ఇండ్లలో వారం రోజుల ముందు నుంచే హడావిడి మొదలైంది. మూడురోజుల పాటు నగరవాసులకు తమ సంప్రదాయ తీపి వంటకాన్ని రుచి చూపించడానికి వారంరోజుల ముందే వంటకాలు సిద్ధం చేయడంలో మునిగిపోయారు. ఇంట్లో ఉండే వాళ్లంతా సకుటుంబ సపరివార సమేతంగా వంట ఏర్పాట్లలో మునిగిపోయారు. తమది కాని రాష్ట్రంలో నివసిస్తూ తమ సంప్రదాయాన్ని, ఆహారపు అలవాట్లను, సంప్రదాయ వస్త్ర ధారణను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఉత్సాహంతో దాదాపు 1200 మంది మహిళలు స్వీట్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. కేవలం ఇంట్లోవాళ్లకే పరిమితం కాకుండా ఎంతోమందికి తమ స్వీట్లు రుచి చూపించి తద్వారా కొంత ఆదాయం కూడా పొందే అవకాశం ఉండడంతో ఎంతోమంది మహిళలు ఈ స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

దేశమంతా ఇక్కడే..

గతేడాది జరిగిన ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్‌కు వచ్చిన భారీ స్పందనను గమనించిన సాంస్కృతిక శాఖ ఈసారి పటిష్ఠంగా ఏర్పాట్లు చేసింది. పోయినేడాది నిర్వహించిన స్వీట్, కైట్ ఫెస్టివల్‌కు ఎనిమిది లక్షల సందర్శకులు వచ్చారు. ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే వివిధ ప్రభుత్వ శాఖల సహకారం కూడా తీసుకొని ప్రపంచానికి హైదరాబాద్ గొప్పతనాన్ని చాటిచెప్పేలా, దేశం మొత్తాన్ని ఒకేచోట చూపించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక కార్యదర్శి బుర్రా వెంకటేశం. వివిధ రాష్ట్రాల సాంస్కృతిక సంఘాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. 25 రాష్ట్రాలు, 15 దేశాల నగరాల స్వీట్ వెరైటీలు ఇక్కడ ప్రదర్శిస్తారు. ప్రతిరోజూ వివిధ రాష్ట్రాల కళారూపాలు కూడా ప్రదర్శిస్తారు. ఫుడ్‌కోర్టులు, స్నాక్స్, హస్తకళల ప్రదర్శన కూడా ఉంటాయి. ఒక్కో ఐటమ్ చాలా రకాల వెరైటీల్లో లభిస్తుంది. 70 రకాల లడ్డూలు, 80 రకాల పాయసాలు ఇలా ఒక్కో ఐటమ్ కనీసం 60,70 రకాల్లో దొరుకుతుంది. ఇవి ఈ స్వీట్ ఫెస్టివల్‌లో తప్ప మరెక్కడా దొరికే అవకాశం లేదు.

... ప్రవీణ్‌కుమార్ సంకరి

హైలెట్స్

- 25 రాష్ట్రాలు, 15 దేశాల వెరైటీ స్వీట్లు
- 1200 స్టాల్స్‌లో 1200 రకాల తీపి పదార్థాలు
- ఒక్కో తీపి వంటకం 70 నుంచి 80 వెరైటీలు
- 78 రకాల లడ్డూలు, 44 రకాల హల్వా, 68 రకాల ఖీర్
- దాదాపు 5000 మంది మహిళల చేత స్టాల్స్ నిర్వహణ
- 10వేల మంది వలంటీర్ల సేవలు
- పదిలక్షల మంది పాల్గొనే అవకాశం
- 19 దేశాల నుంచి 42 మంది ఇంటర్నేషనల్ గాలిపటాల పోటీలో పాల్గొంటారు.
- దేశవ్యాప్తంగా 60 మంది గాలిపటాల పోటీదారులు కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు.
- చీకట్లో కూడా కనిపించే ప్రత్యేక గాలిపటాలతో కైట్ ఫెస్టివల్ నిర్వహణ



నలుపు తగ్గేదిలా!



- తులసి ఆకులని బాగా చూర్ణం చేసి అందులో కాస్త పాలమీగడ, పసుపు కలుపుకోండి. ఈ మిశ్రమాన్ని మోచేతులకు రాయాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే కచ్చితంగా నలుపు పోతుంది.
- నిమ్మకాయను రెండు భాగాలుగా కోయాలి. దీంతో మోచేతుల వద్ద మృదువుగా మర్దన చేయాలి. దీంతో పాటు తేనె, చక్కెర కలిపిన మిశ్రమాన్ని మోచేతులకు రాయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే చర్మం తెల్లగా మారుతుంది.
- గోరువెచ్చని కొబ్బరినూనె, నిమ్మరసాన్ని బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని నలుపు చర్మానికి రాయాలి. తరచూ ఇలా చేస్తే నలుపు తగ్గుతుంది.
- పెరుగు, శనగపిండిని కలుపాలి. ఈ మిశ్రమాన్ని మోచేతులకు రాయాలి. 30 నిమిషాల తరువాత నీటితో శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ఆలివ్‌నూనె, చక్కెరను కలుపాలి. ఈ మిశ్రమాన్ని మోచేతులకు రాయాలి. ఆరాక నీటితో కడుగాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే చేతులు తెల్లగా మారుతాయి.
- టమాట రసంలో కొంచెం తేనె వేసి కలుపాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి రాయాలి. 20 నిమిషాల తరువాత కడుగాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే చర్మానికి ఉండే నలుపు, గరుకుదనం పోతుంది.

తానేంటో నిరూపించుకుంది!



అది 2010 మే 28. అర్ధరాత్రి 1.30 గంటలు అవుతున్నది. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్ కోల్‌కతా నుంచి ముంబైకి వస్తున్నది. రైలులోని ప్రయాణికులంతా గాఢ నిద్రలోకి జారుకున్నారు. ఆ తర్వాత ఓ ఘోర ఉపద్రవం.. ఈ యువతి జీవితాన్ని మలుపు తిప్పింది.

ఆ రోజు జరిగింది నక్సల్స్ దాడి. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌ను ధ్వంసం చేసి, అల్లర్లు సృష్టించేందుకు నక్సల్స్ ఓ గూడ్స్ ట్రెయిన్‌తో ఎదురుగా ఢీకొట్టించారు. దీంతో అర్ధ రాత్రి సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం. కళ్లు తెరిస్తే.. ఆర్తనాదాలు, ఆహాకారాలు. అంతా తమవారి కోసం వెతుకుతున్నారు. ఎవరు ఎక్కడున్నారో తెలియదు. ఎంతమంది చనిపోయారో తెలియదు. అక్కడంతా భయానక వాతావరణం అలుముకుంది. ఆ దాడిలో శ్రేయాసేన్ అనే ఈ యువతి కూడా తీవ్రంగా గాయపడింది. రైలు భోగీలు నుజ్జునుజ్జు అవడంతో తన కుడి చేయి చితికిపోయింది. ఆమె సోదరుడు హుటాహుటిన ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు కుటుంబీకులతో మాట్లాడి శ్రేయా కుడిచేతిని పూర్తిగా తొలిగించారు. అప్పటికి శ్రేయా ఆర్కిటెక్చర్ చదువుతుంది. జీవితంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నది. ఆ బాధతో కొద్దిరోజులు కాలేజ్‌కు వెళ్లలేదు. ఆ సమయంలో స్నేహితులు, కుటుంబసభ్యులు శ్రేయాకు అండగా నిలిచారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ విద్యార్థులు ఏదో ప్లాన్ గీస్తూనే ఉండాలి. ఒక చేయి లేకపోతే ఎలా? అనేది శ్రేయా బాధ. అయినా భరించి కాలేజ్‌కు వెళ్లింది. తన పట్టుదలను చూసి కాలేజ్ అధ్యాపకులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అలా కష్టపడి చదివి ఆర్కిటెక్చర్‌గా నిలిచింది. త్వరలో 'యాన్యువల్ నాసా' వర్క్‌షాపులో పాల్గొననున్నది. ఈ క్రమంలో మద్రాస్‌కు చెందిన ఐఐటీ రూర్కీ విద్యార్థి ప్రతీక్‌ను పెండ్లి చేసుకుంది. 'డిసేబులిటీ టు ఎబిలిటీ' అనే అంశంపై ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నది శ్రేయా.

వంట చిట్కాలు



- పకోడీలు చేసేటప్పుడు శనగపిండి, బియ్యంపిండికి తోడుగా వేయించిన శనగపప్పుపొడి కూడా వేస్తే పకోడీలు చాలా రుచిగా ఉంటాయి.
- కందిపప్పు ఎక్కువ రోజులు పాడవ్వకుండా ఉండాలంటే డబ్బాలో ఎండుకొబ్బరిని ఉంచాలి.
- ఉప్పుని డబ్బాలో ఉంచినప్పుడు మూత సరిగా పెట్టాలి. లూజ్‌గా ఉంచడం వల్ల దాని అయోడిన్ పవర్ పోతుంది.
- వెల్లుల్లి ఎక్కువరోజులు నిలువ ఉండాలంటే వాటిని ఒలిచి డబ్బాలో ఉంచి ఫ్రిజ్‌లో పెట్టాలి.

సిరిముగ్గు



19 చుక్కలు
1 వచ్చే వరకు



రావుల శరణ్యలత
మణుగూరు,
భద్రాద్రి
కొత్తగూడెం జిల్లా

మీరు ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
బంజారాహిల్స్, రోడ్ నం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ
నిధి
[హైదరాబాద్]
శనివారం 12 జనవరి 2019

ఒడిదుడుకులదే పైచేయి..

కొత్త సంవత్సరం వచ్చేసింది. గతేడాది తీపి గుర్తులు, చేదు అనుభవాల మధ్య కోటి ఆశలతో నూతన ఏడాదిలోకి అడుగుపెట్టాం. అయితే స్టాక్ మార్కెట్ మదుపరులకు మాత్రం గతేడాది.. నిరాశాజనక ఫలితాలనే అందించింది. ఒక్క భారతీయ స్టాక్ మార్కెట్లే కాదు.. ప్రపంచ స్టాక్ మార్కెట్లలోనే నిరుడు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితులు మదుపరుల ఓర్పును, సహనాన్నేగాక పట్టుదలనూ పరీక్షించాయి. ఏడాది ఆరంభంలో వచ్చిన అనేక అంచనాలు, ఊహాగానాలను మార్కెట్ తలకిందులు చేసింది. ఇన్వెస్టర్ పోర్ట్‌ఫోలియోలు బ్రాడర్ ఇండెక్స్‌ను ప్రతిబింబించలేకపోయాయి. దీనివల్ల చాలా మంది చాలా రకాలుగా నష్టపోయారు. నిజానికి 2018 ప్రారం



భంలోనే మేము దేశీయ స్టాక్ మార్కెట్ల హై వాల్యుయేషన్ల గురించి హెచ్చరించాం. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల కదలికలు, అగ్రరాజ్యాల మధ్య వాణిజ్య యుద్ధాల వల్ల రాబోయే అనుకూల, అననుకూల పరిణామాల్ని అంచనా వేశాం. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రభావాన్నీ తెలియజేశాం. కానీ వీటికి భిన్నంగా స్టాక్ మార్కెట్ల నుంచి ఫలితాలు వచ్చాయి.

వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ప్రభావం అన్నింటా పెరిగిపోయింది. అదీగాక ఎన్నో అనూహ్య పరిణామాలు మార్కెట్ పోకడను ప్రస్ఫుటంగా శాసించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద నిర్ణయాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రకంపనల్ని సృష్టించగా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ బయటకు రావడానికి సంబంధించిన అంశాలూ విశ్వ మార్కెట్లను కుదిపేయగా, ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ రుణ సంక్షోభం దేశీయ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) ఇబ్బందులకు దారితీసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)-కేంద్ర ప్రభుత్వం మధ్య విభేదాలు, తదనంతర పరిణామాల మధ్య గవర్నర్ ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామా కూడా మార్కెట్లను పెద్ద ఎత్తునే ప్రభావితం చేసింది. ఆర్బీఐ స్వతంత్రతకే ముప్పు వాటిల్లేలా మోదీ సర్కారు కుట్ర చేస్తుందన్న వాదనలు మదుపరుల పెట్టుబడులను తాకాయి. దీంతో ఒడిదుడుకులు తప్పలేదు. అమ్మకాల ఒత్తిడి, కొనుగోళ్ల మద్దతుకు మధ్య సూచీలు పడుతూ లేస్తూ పయనించాయి. ఫలితంగా మదుపరుల్లో ఒకింత అలజడే నెలకొన్నది.

స్థూలంగా చెప్పాలంటే 2018 మదుపరులకు గొప్ప అనుభవాల్నే ఇచ్చింది. ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలపై సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని కల్పించింది. తద్వారా తమ ప్రాధాన్యతలను మరోసారి ఎంచుకోవాలని సూచించింది. తమకు సరిపోయే పోర్ట్‌ఫోలియోలను ఎంచుకోవాలనే చాటిచెప్పింది. కాబట్టి 2019లో ఈ అనుభవాలను మూల్యాంకనం చేసుకుని పెట్టుబడులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరమైతే ఉన్నది. ఇక దేశంలో లోక్‌సభ ఎన్నికలు రానున్నాయి. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనంలో నడుస్తున్నది. అమెరికా దేశాధినేత ట్రంప్ దూకుడు, బ్రెగ్జిట్ సంక్షోభం ఉండనే ఉన్నాయి. వీటికితోడు ముడి చమురు ఉత్పాదక దేశాలు తమ ఉత్పత్తిని తగ్గించడంతో మార్కెట్‌లో మళ్లీ క్రూడాయిల్ ధరలు విజృంభిస్తున్నాయి. దిగుమతులపైనే ఆధారపడ్డ భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద దెబ్బే. ఈ ఏడాది స్టాక్ మార్కెట్లను నిర్దేశించగలిగిన అంశాలు ఇప్పటివరకైతే ఇవే. వీటిని దృష్టిలో పెట్టుకుని మదుపరులు తమ పెట్టుబడుల ప్రణాళికను రూపొందించుకోవడం ఉత్తమం. ఈ ఏడాది లాభదాయకంగా ముగియాలని ఆశిద్దాం.



కే నరేశ్ కుమార్
సహ వ్యవస్థాపకులు,
వెలాసిటీ,
వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ
knk@wealocity.com

శరణ్య ఓ బ్యాంక్ ఉద్యోగి. జీవితంలో కచ్చితమైన లక్ష్యాలను కలిగి ఉన్న వ్యక్తి. పొదుపు చేయడమే లక్ష్యంగా ఆర్థిక ప్రణాళికను రూపొందించుకున్నారు. అయితే, గత కొంత కాలంగా బ్యాంక్ వడ్డీ రేట్లు తగ్గుతూ ఉన్న కారణంగా తన ఫైనాన్షియల్ ప్లానింగ్ ఏదో లోపం ఉన్నట్టు గుర్తించారు. ప్లానింగ్‌లో రిస్క్ ఉన్నట్టు గమనించారు. వివాహం, విహారయాత్రలు, పిల్లల విద్య, పదవి విరమణ తదితర జీవిత లక్ష్యాలను ప్రస్తుతం ఫైనాన్షియల్ ప్లానింగ్‌తో సాధించడం సాధ్యం కాదని గమనించారు. దీనికి తోడు పొదుపు ప్రణాళిక కుటుంబ భద్రతకు భరోసా ఇవ్వడం లేదని భావించారు. రూపాయి మారకం విలువ పతనం, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర పెరుగుదలకు తోడు వడ్డీరేట్లు పెరగకపోవడం, స్టాక్ మార్కెట్ స్తబ్దుగా ఉండడం వంటి అంశాలు చాలా మంది ఇన్వెస్టర్ల మాదిరిగానే శరణ్యనూ మనోవేదనకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో కచ్చితమైన రాబడులను ఇవ్వగలిగిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళిక అవసరం అందరికీ కనిపిస్తున్నది.



జీవితబీమా

రాబడి ఖాయం భరోసా అదనం

నిర్దేశిత కాలానికి మనకు ఎంత రాబడి కావాలో స్పష్టత ఉంటే మంచిది. అయితే ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికకు ప్రస్తుతం ఉన్న సంప్రదాయ పద్ధతుల్లో కనిపిస్తున్న సాధనాలేవీ లేవు. అందుకే గ్యారంటీ రాబడులను ఇవ్వగల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లను మొదట అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మార్కెట్ పరిస్థితులు, వడ్డీరేట్లలో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా మనకు కచ్చితమైన రాబడిని ఇవ్వగలగాలి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో జీవిత బీమాకు హామీ ఇసూన్న గ్యారంటీ రాబడులను ఇవ్వగల లైఫ్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులు అనేకం మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఇలాంటి సాధనాలు ఆకర్షణీయంగా కూడా ఉన్నాయి.

దీర్ఘకాలానికి కచ్చితమైన రాబడి

ఇతర సంప్రదాయ పొదుపు సాధనాలతో పోల్చితే గ్యారంటీ రాబడికి తోడు జీవిత బీమాను కల్పిస్తూ దీర్ఘకాలానికి పన్ను మినహాయించిన రాబడిని మెరుగ్గా ఇవ్వగలిగినవి లైఫ్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులే.

బీమా, పొదుపుల సమ్మేళనం

ఇలాంటి కచ్చితమైన రాబడిని ఇవ్వగల లైఫ్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులు రెండు రకాలుగా ప్రయోజనాలను అందిస్తాయి. జీవిత బీమా మొదటి అయితే క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో సొమ్మును వెనక్కి తీసుకునే సదుపాయాన్ని కల్పించడం. భద్రతకు తోడు తమ ఇన్వెస్ట్‌మెంట్ కూడా కాల క్రమేణా పెరుగుతూ ఉంటుంది. తక్కువ రిస్క్‌తో పాటు కచ్చితమైన రాబడిని కోరుకునే వారికి ఇలాంటి జీవితా బీమా ఉత్పత్తులు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. ఒకవేళ పాలసీ దారు అకాల మరణం పాలైతే బీమా మొత్తాన్ని నామినీకి అందచేస్తారు. ఇలాంటి పాలసీ ఎవరికీ



అత్యుత్తమ సాధనం అంటే..

1. కచ్చితమైన రాబడిని హామి ఇచ్చే జీవిత బీమా పాలసీలో ఎవరైనా సరే నిర్ణీత సమయాల్లో వెనక్కి తీసుకోవచ్చు. ఇలా క్రమంగా వస్తున్న రాబడులను లైఫ్‌స్టైల్ రాజీ పడకుండా రుణాల తీర్చుకునేందుకు కూడా ఉపయోగపడుతాయి.

2. రుణాలను తీర్చేయడమే కాకుండా ఇల్లు కొనుక్కోవడం, పిల్లలను విదేశీ విద్య కోసం పంపించడం, వినోద పర్యటనలను చేయడం, రిటర్మెంట్ వంటి జీవిత లక్ష్యాల కోసం కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ సరదాలను తీర్చుకోవాలంటే మాత్రం క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక అవసరం. రాబడుల గ్యారంటీ ఇచ్చే బీమా పథకాలు అలాంటి సరదాలను తీర్చుకోవడానికీ ఉపయోగపడతాయి.

3. నిర్ణీత సమయానికి కచ్చితమైన మొత్తాన్ని హామీ ఇవ్వగలిగిన ఏకైక సాధనం జీవిత బీమానే. తాము సంపాదించిన మొత్తానికి రిస్క్ లేకుండా రాబడి హామిని జీవిత బీమా ఉత్పత్తులే అందిస్తాయి. అతి తక్కువ రిస్క్ ఉన్న ఈ బీమా ఉత్పత్తులే బెస్ట్ ఆప్షన్‌గా పరిగణించాల్సి ఉంటుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే గ్యారంటీ రాబడులను అందిస్తున్న జీవిత బీమా ధీమాతో పాటు కుటుంబ భవితకు భద్రతను కల్పిస్తాయి. కచ్చితమైన రాబడులు తమ జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడుతాయి. అలాగే ఇన్వెస్ట్‌మెంట్, పొదుపు ప్రణాళికల సమ్మేళనానికి ఇవి ఉపయోగపడుతాయి. స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలను చేరుకోవడానికీ ఉపయోగపడుతాయి. డెత్ బెనిఫిట్‌తో కుటంబ భద్రతకు భరోసాను జీవిత బీమా కల్పిస్తుంది. రాబడుల్లో హెచ్చుతగ్గుల రిస్క్‌లు ఉండవు.

అందుకే కచ్చితమైన రాబడికితోడు క్రమం తప్పకుండా రాబడిని చేతికి అందించడం వంటి ప్రయోజనాలున్న జీవిత బీమా ఉత్పత్తులు ఫైనాన్షియల్ ప్లానింగ్ ఒక భాగంగా ఉండాల్సిందే.

పరాగ్ రాజా
సీడీఓ, ఆదిత్యా బిర్లా
సన్‌లైఫ్ ఇన్సూరెన్స్





పదవీ విరమణకు 7 అడుగులు

ఉద్యోగం సంపాదించడం ఎంత కష్టమో..వచ్చిన తర్వాత ఆ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడం కూడా అంతే కష్టం. పగలనక, రాత్రి అనకా కష్టపడి విధులు నిర్వహించి అటు జీవితాన్ని, ఇటు సంసారాన్ని మోసుకొచ్చిన వారికి పదవీ విరమణ ఒక విధంగా సువర్ణయుగం లాంటిది. రిటైర్‌మెంట్ తర్వాత ఇక తాము ఉద్యోగం చేసే సమయంలో చేయలేని పనులు, ముఖ్యంగా కుటుంబానికి దూరంగా ఉన్నవారి వీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పదవీ విరమణకు ముందు తీసుకోవాల్సిన ఏడు అడుగులపై నిశితంగా పరిశీలిద్దాం..అవే ఇవి..

1 అత్యవసర సమయంలో ఇదే ఆపన్న హస్తం

మీ కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రిలో చేరారు..చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుందని డాక్టర్ చెప్పారనుకో. అప్పుడు మీ పరిస్థితి ఏంది. అందుకే ముందే మేల్కొని పొదుపు చేయండి. ఇదే అత్యవసర సమయంలోను, శుభకార్యాలు జరిగేటప్పుడు ఇది సంజీవనిలాగా పనిచేస్తున్నది. ఏడాదిలో మూడు నుంచి ఆరు నెలల వరకు మీరు సంపాదించిన జీతం/ఆదాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా పొదుపు బ్యాంక్ ఖాతాల్లో జమచేసిన డబ్బు ఉపయోగపడనున్నది. ఊహించని ఉపద్రవాల నుంచి ఉపశమనం లభించాలంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి మరి. వీటిలో పొదుపుకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉన్నది.

2 పొదుపుపై ప్రత్యేక దృష్టి

ఉద్యోగం పొందిన ఏడాది నుంచే పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలి. అత్యవసర సమయంలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నెలకు సంపాదించిన జీతంలో కనీసంగా 10 శాతమైన పొదుపు చేయాలి. విద్యా, ఇతర రుణాలు లేనివారు మాత్రం గరిష్ఠంగా 25 శాతం వరకు చేయాలి. పొదుపు భవిష్యత్తుకు పునాదిలాంటిది. ఈ దిశగా ఆలోచించేవారు లేకపోవడం పలు సమస్యలకు తావిస్తున్నది. పదవీ విరమణకు సంబంధించి చిన్న వయస్సు నుంచే ఆలోచించాలి, అప్పుడే భవిష్యత్తు అందకారం కాకుండా అడ్డుపడనున్నది.

3 ఆస్తులను కూడబెట్టుకోవడం

ఆస్తులను కూడబెట్టుకోవడానికి పెద్దపీట వేయాలి. స్థిర, చర ఆస్తుల్లో ఏదైన సరే ఓకే. ప్రస్తుతం టీవీ, రిఫ్రిజిరేటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లకు కేటాయిస్తున్న నిధులను రియల్ ఎస్టేట్ రంగం వైపు మళ్లించండి. మెట్రోనగరాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం ఖర్చుతో కూడుకున్న పని, కానీ చిన్నస్థాయి నగరాల్లో కొనుగోలు పెద్ద కష్టమైనది కాదు, కావున ప్రతి ఒక్కరు వీటిపై దృష్టి సారించాలి. మిగతా వాటితో పోలిస్తే రియల్ ఎస్టేట్ రంగం అధిక రిటర్నులను పంచుతున్నది. తద్వారా పన్ను ప్రయోజనాలు కూడా పొందవచ్చును. ఒకవేళ దిద్దుబాటుకు గురైన సమయంలో ఇవే ప్రత్యామ్నాయం.

4 పెట్టుబడులను వివిధీకరించండి..

పెట్టుబడులను ఒకేదాంట్లో కాకుండా వివిధ రూపాల్లో ఇన్వెస్ట్ చేస్తే మంచిది. పాత విధానంలో ఒకేదాంట్లో కుక్కడం వల్ల ఎలాంటి ప్రయోజనం పొందే అవకాశాలు చాలా తక్కువ. ఒకవేళ వివిధ దాంట్లో పెడితే ఈ రంగం భారీ వృద్ధిని నమోదు చేసుకుంటే ఆర్థికంగా బలోపేతం అవడానికి దోహదపడనున్నది. ముఖ్యంగా ఈక్విటీ, బంగారం, రియల్ ఎస్టేట్ రంగాలు ఇందులో కొన్ని. మీరు పనిచేసే సమయంలో ప్రావిడెంట్ ఫండ్ కింద చెల్లించే 12 శాతం పదవీ విరమణ చేసిన తర్వాత ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి. అలాగే సుఖన్య సమృద్ధి యోజన పథకం కింద మీ కుతురిపై జమ చేసిన సొమ్ము కూడా ఆ అమ్మాయి ఎదుగుతున్న సమయంలో అధిక మొత్తంలో లభించనున్నది. ఈక్విటీలో పెట్టుబడులు పెట్టేముందు మార్కెట్ విశ్లేషకుల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం మరిచిపోకండి. ఉదాహరణకు అధిక మొత్తంలో గృహ రుణం తీసుకున్నవారు వారి జీవిత విధానాలు, ఇతర ఆస్తులను కొనుగోళ్లపై ప్రభావం చూపనున్నాయి.

5 పెట్టుబడులపై సమీక్షించండి

తాము పెట్టిన పెట్టుబడులపై అప్పుడప్పుడైనా పర్యవేక్షిస్తుండాలి. రోజు లేదా నెల కొకసారి కాకుండా మూడు లేదా ఆరు, ఏడాదికొకసారి సమీక్షించుకోవాలి. ఎందుకంటే ఆస్తులకోసం కూడబెట్టడంతో పదవీ విరమణ చేసిన తర్వాత తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి సులభంకానున్నది. ఈక్విటీ పెట్టుబడులను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఆరు నుంచి తొమ్మిది నెలలపాటు చేస్తే భవిష్యత్తుకు ఢోకా ఉండదు. రిటైర్‌మెంట్ తర్వాత ఇవి రిటర్నులు పంచనున్నాయి.

6 చిన్న వయస్సు నుంచే..

మీ భద్రతే మీకు శ్రీరామరక్ష. అలాంటి మంచి అలవాట్లను చిన్నప్పటి నుంచి అలవాటు చేసుకోవాలి. బీమా, ఆరోగ్యానికి సంబంధించిన భద్రతకు పెద్దపీట వేయడానికి యువత ముందుకురావాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా మీ కుటుంబం మొత్తం భద్రత కల్పించే బీమాను తీసుకోవాలి. ఒకవేళ ప్రమాదం జరిగినప్పుడు గానీ, ఏదైన అత్యవసర సమయంలో వచ్చే రోగాలు, ముఖ్యంగా మలిదశలో వచ్చే రోగాల నుంచి కాపాడుకోవడానికి బీమా సర్వరోగ నివారణిలాగా పనిచేస్తున్నది. యవ్వన వయస్సులో బీమా పాలసీకోసం తక్కువ స్థాయిలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. కానీ, మలిదశలో మాత్రం ఎక్కువగా ఉంటుంది. పదవీ విరమణను దృష్టిలో పెట్టుకొని హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోండి.

7 విశ్లేషకుల అభిప్రాయాలు తీసుకోండి..

విశ్లేషకుల అభిప్రాయాలకు పెద్దపీట వేయండి. ఆరోగ్యానికి సంబంధించి ఎలా మెడికల్ చెకప్ చేసుకుంటారో అలాగే ఆర్థిక అనుభవజ్ఞుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోండి. మీ బ్యాంక్ మేనేజర్ లేదా మంచి స్నేహితుడు/పొరుగువారు ఆర్థిక పరిజ్ఞానం ఉన్న ఎవరి నుంచైనా వారి సహాయం తీసుకోవడానికి వెనుకంజ వేయకండి.

మధుసూదన్ హెగ్డే,
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
దక్షిణ విభాగ అధిపతి



హెల్త్‌కేర్ : సడలిన విశ్వాసం

హెల్త్‌కేర్ దేశంలో ప్రస్తుతం అతి పెద్ద సవాల్. అసలు హెల్త్ కేర్ వ్యవస్థ మీద 96.5 శాతం మంది ప్రజలకు విశ్వాసమే లేదని ఓ సర్వే తేల్చి చెప్పింది. మరో 67.8 శాతం మంది హాస్పిటల్స్‌ను అస్సలు నమ్మడం లేదు. ఆసుపత్రి ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతుండటంతో హెల్త్ ఇన్సూరెన్స్‌లను తప్పనిసరిగా తీసుకోవాలని 62.8 శాతం మంది భావిస్తున్నారు. 30 ఏండ్ల వయసులోనే ఆరోగ్య పాలసీని తీసుకోవాల్సిందేనని 80 శాతం మంది అభిప్రాయపడుతున్నారట. జీఓక్యూఐఐ అనే సంస్థ ఇండియా ఫిట్ నివేదికను ఇటీవల విడుదల చేసింది. ఈ నివేదికలో చాలా ఆశ్చర్యకర విషయాలు వెల్లడించింది. అందులో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ అర్థం చేసుకోలేకపోవడం కారణంగానే తీసుకోవడం లేదట మరికొంత మంది. హెల్త్‌ఇన్సూరెన్స్ ప్రీమియం ఎక్కువగా



వసూలు చేస్తున్నందునే పాలసీలను తీసుకోవడం లేదు. అయితే ఇప్పటికే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నవారిలో దాదాపు 88 శాతం మంది క్యాష్‌లెస్ హాస్పిటలైజేషన్ పాలసీలకే మొగ్గు చూపుతున్నారు. 20-45 ఏండ్ల మధ్య వయస్సు వారిలో కనీసం 38.3 శాతం మంది డయాబెటిస్, బీపీ, థైరాయిడ్, ఎసిడిటీ వంటి ఏదో జబ్బుతో బాధపడుతున్నారు. గత రెండేండ్లలో లైఫ్‌స్టయిల్ జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఇలా పెరుగుతున్న జబ్బులు ఒక వైపు మరోవైపు హెల్త్‌కేర్ వ్యవస్థపై నమ్మకం లేకపోవడంతో ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఆర్థిక భారం భారీగా పెరిగిపోతుండడంతో చాలా మంది ఫిట్‌గా ఉండడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రోజూ నడవడం, జిమ్‌లో చేరడం, సైక్లింగ్, ఎక్కువ సేపు నిద్రపోవడం వంటివి చేస్తున్నారట. ఈ నివేదిక ప్రకారం బెంగళూరు దేశంలో ఆరోగ్యకరంగా ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉందట. దేశంలో ఎక్కువగా బాధిస్తున్నది కాలుష్యమేనట. పుణె నగరంలో గాలి, నీరు, ఆహార కాలుష్యం తక్కువగా ఉన్నట్టు ఆ నివేదిక తేల్చింది.

సుడోకు

డైలీ సుడోకు 34 సమాధానం

5	3	1	8	4	6	9	2	7
2	4	7	9	3	1	6	5	8
6	9	8	7	2	5	1	3	4
1	8	4	6	5	2	7	9	3
7	2	3	1	8	9	4	6	5
9	5	6	3	7	4	2	8	1
8	7	9	2	1	3	5	4	6
3	6	5	4	9	7	8	1	2
4	1	2	5	6	8	3	7	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -35

4	8			5		9		3
7					3	8		
	3	6		1			2	
			4			6	5	
							7	
					5			
		9	1			7	6	
6	1	3						
	4				6	3		

నమస్తే తెలంగాణ
సంపద
[హైదరాబాద్]
శనివారం 12 జనవరి 2019

2019లో ప్రప్రథమ ప్రాపర్టీ షో..

ప్రాపర్టీ షోల నిర్వహణలో క్రెడాయ్ హైదరాబాద్ ముందునుంచీ విభిన్నంగా ఆలోచిస్తుంది. పీపుల్స్ ప్లాజా అయినా హైటెక్స్ అయినా.. కొనుగోలుదారులకు అవసరమయ్యే ప్రాజెక్టులను ప్రదర్శిస్తుంది. ఈసారి నిర్వహించే ప్రాపర్టీ షో కాస్త భిన్నమైందని చెప్పుకోవాలి. ఎందుకంటే, తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. క్రెడాయ్ హైదరాబాద్ నిర్వహిస్తున్న ప్రప్రథమ ప్రాపర్టీ షో ఇది. ఫిబ్రవరి 15 నుంచి 17 మధ్యలో నిర్వహించే మూడు రోజుల ప్రదర్శనలో దాదాపు 120 సంస్థల దాకా పాల్గొంటాయని నిర్వాహకులు చెబుతున్నారు. కేవలం రియల్టర్లు, డెవలపర్లే కాకుండా నిర్మాణ సామగ్రి సరఫరాదారులు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు వంటివి పాల్గొంటాయని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్.రాంరెడ్డి తెలిపారు. ఈసారి కనీసం యాభై వేల మంది సందర్శకులు విచ్చేస్తారని క్రెడాయ్ హైదరాబాద్ అంచనా వేస్తున్నది. పాతవాటితో బాటు కొత్త అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, హరిత భవనాలు, సమీకృత పట్టణాలతో బాటు వాణిజ్య సముదాయాల వివరాలు సందర్శకులు ఈ ప్రదర్శన ద్వారా తెలుసుకోవచ్చు.

క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో
ఫిబ్రవరి 15 - 17 తేదీల్లో
వేదిక: హైటెక్స్, మాదాపూర్



వ్యర్థాల నుంచి నిర్మాణ సామగ్రి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆవాసాల సంఖ్య ఏటా పెరుగుతున్నాయి. అయితే ఇదే క్రమంలో నిర్మాణానికి అవసరమైన సహజవనరులు నానాటికి తరిగిపోతున్నాయి. దీంతో ఇసుక, సున్నపురాయి, కాంక్రీటు తదితర నిర్మాణ సామాగ్రి భవిష్యత్తు తరాలకు దొరకని దుస్థితి నెలకొనే ప్రమాదముంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పలువురు శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ నిర్మాణ సామగ్రిపై చాలా కాలం నుంచి పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో జలంధర్‌లో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భోపాల్ సీఎంబీ విభాగం ఆవిష్కరించిన ప్రత్యామ్నాయ నిర్మాణ సామగ్రి ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

వ్యర్థాల నుంచి ఉత్పత్తులు..

పరిశ్రమ వ్యర్థాల సాయంతో ఇసుక, కాంక్రీటు, సిమెంట్ వంటి సరికొత్త నిర్మాణ సామగ్రిని తయారు చేయవచ్చని నిరూపితమైంది. దేశ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలు నానాటికి పెరిగిపోతున్నాయి. అయితే వాటి నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు మానవాళికి సమస్యగా మారుతున్నది. ఈ తరహా వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపెడుతూనే.. మరోవైపు వ్యర్థాలకు అర్థం తెచ్చేలా నూతన ఆవిష్కరణలు జరిపారు సీఎంబీ శాస్త్రవేత్తలు. పరిశ్రమల నుంచి విడుదలైన వ్యర్థాలే ఆధారంగా పునరుత్పత్తులను తయారు చేసేందుకు పరిశోధనలు ప్రారంభించి విజయం సాధించారు. ఫ్లై యాష్, రెడ్ మడ్ నుంచి ఇసుక, సిమెంట్ ఫ్రీ కాంక్రీట్, హైబ్రిడ్ కాంపోసిట్స్ తయారు చేస్తున్నారు.
అల్యూమినియం ఉత్పత్తి ప్రక్రియలో రెడ్ మడ్ అనేది వ్యర్థ ఉత్పత్తి. మన దేశంలో దాదాపు 50లక్షల టన్నుల రెడ్ మడ్ వ్యర్థ ఉత్పత్తిగా విడుదలవుతుంది. దీన్ని భూమిపై పారేస్తుండటం వల్ల భూకాలుష్యం పెరుగుతున్నది. ప్రస్తుతం సీఎంబీ రెడ్ మడ్ నుంచి ఇసుకను తయారు చేయడం ప్రారంభించింది. ఇక మరొక పరిశ్రమ వ్యర్థమైన ఫ్లైయాష్ నుంచి ఇప్పటికే పలు చోట్ల ఇటుకల తయారు జరుగుతున్నది. దీంతో సిమెంట్ ఫ్రీ కాంక్రీట్‌ను తయారు చేస్తున్నారు. వ్యర్థ పదార్థాల నుంచి హైబ్రిడ్ కాంపోసిట్లను తయారు చేసే విధానాన్ని ఆవిష్కరించారు. సముద్ర ఇసుక నుంచి కాపర్ టైళ్లను తయారు చేస్తున్నారు.



భవిష్యత్తు అవసరాల కోసం..

తరిగిపోతున్న ఇసుక నిల్వలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు భోపాల్‌లోని ఏఎంపీఆర్ఐలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్న జగిత్యాల జిల్లా మోతె వాసి శ్రీరాం సత్తయ్య తెలిపారు. అందరికి అందుబాటు ధరలో ఉండేలా వీటిని ఆవిష్కరిస్తున్నామని, భవిష్యత్తు తరాల అవసరాలను ప్రత్యామ్నా నిర్మాణ సామగ్రి తీర్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు



కన్సల్టెంట్లతో కాస్త జాగ్రత్త



పశ్చిమ హైదరాబాద్‌కు చెందిన డెవలపర్.. కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థ నుంచి అనుమతి లభించగానే.. రెరాకు దరఖాస్తు చేశారు. రెరా దరఖాస్తు పత్రంలో డెవలపర్ పేరు, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. కాకపోతే, అతనికి తీరిక లేకపోవడంతో ఆ పనిని ఒక కన్సల్టెంట్‌కు అప్పగించారు. దీంతో, అతను చేసిన తప్పిదాలకు బిల్డర్ బాధ్యత వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఇలాంటివి దాదాపు డజనుకు పైగా ఉదంతాలు ఇటీవల హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చాయి. అందుకే, రెరాకు సమర్పించే దరఖాస్తులో ఎట్టి పరిస్థితుల్లో డెవలపర్ మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ అందజేయాలని రెరా సూచిస్తున్నది.

హైదరాబాద్‌కు చెందిన అధిక శాతం మంది డెవలపర్లకు తీరిక ఉండదు. అందుకే, అపార్టుమెంట్ అనుమతి అయినా రెరా దరఖాస్తు అయినా కన్సల్టెంట్లకే అప్ప చెబుతుంటారు. ఈ పనిని సక్రమంగా నిర్వహిస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదు. కాకపోతే, రెరాకు సంబంధించి కొందరు కన్సల్టెంట్లు చేసే తప్పిదాల వల్ల డెవలపర్లు ఇబ్బంది పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. వాస్తవానికి, రెరా దరఖాస్తు నింపేటప్పుడు ఎలాంటి సందేహాలున్నా.. రెరా హెల్ప్ డెస్క్ సాయం చేస్తున్నది. దరఖాస్తు పత్రంతో బాటు రెరా కార్యాలయానికి వెళ్లినా.. అక్కడి సిబ్బంది తగిన సహాయాన్ని అందజేస్తారు. ఈ విషయం తెలియని అధిక శాతం మంది బిల్డర్లు, రియల్టర్లు.. రెరా దరఖాస్తు నింపడం ఓ పెద్ద ప్రహసనంగా భావిస్తున్నారు. ఇలాంటి సమస్యల్ని పరిష్కరించడానికి ఎల్లవేళలా తాము సిద్ధంగా ఉంటామని రెరా మెంబర్ సెక్రెటరీ కొమ్ము విద్యాధర్ తెలిపారు.

డెవలపర్ వివరాలు తప్పనిసరి..

రెరా దరఖాస్తు పత్రంలో డెవలపర్ వివరాల్ని తప్పకుండా పొందుపర్చాలి. తన మొబైల్ నెంబర్, ల్యాండ్ లైన్, ఈ మెయిల్ ఐడీ వంటివి పొందుపర్చాలి. భవిష్యత్తులో సదరు డెవలపర్‌కి కొనుగోలుదారులతో ఎలాంటి సమస్యలొచ్చినా.. అట్టి నెంబరుకే రెరా అధికారులు సమాచారం అందిస్తారు. అలాంటి సందర్భాల్లో డెవలపర్ ఫోన్ నెంబర్ పని చేయకపోతే, సమాచారం మొత్తం కన్సల్టెంట్‌కు వెళుతుంది. ఒకవేళ డెవలపర్‌తో వినియోగదారుడికి సమస్య ఏర్పడితే.. ఆయా సందర్భాల్లో రెరా అథారిటీ పంపించే సమాచారం కన్సల్టెంట్‌కు చేరుతుంది. అంతేతప్ప, డెవలపర్‌కి చేరే అవకాశమే లేదు. ఇదే జరిగితే గనక, రెరా ముఖ్య ఉద్దేశ్యమే దెబ్బతినే ప్రమాదమున్నది. కొన్ని సందర్భాల్లో కన్సల్టెంట్లు చేసే పొరపాట్లు డెవలపర్‌కు తలనొప్పి తెచ్చే అవకాశముంది. మరికొందరు కన్సల్టెంట్లు అయితే.. రకరకాల కారణాలు చెప్పి డెవలపర్ల వద్ద అధిక సొమ్ము వసూలు చేసే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి 2017 జనవరి 1 తర్వాత, తెలంగాణ రాష్ట్రంలో 500 చదరపు మీటర్లు లేదా అంతకంటే అధిక విస్తీర్ణంలో లేఅవుట్లు, అపార్టుమెంట్లు అభివృద్ధి చేసినట్లయితే తప్పకుండా రెరాకు దరఖాస్తు చేసుకోవాలని రెరా మెంబర్ సెక్రెటరీ కె. విద్యాధర్ సూచించారు.



రియల్టర్లు రెరాలో నమోదు చేయవద్దా?

లేఅవుట్లు అభివృద్ధి చేసే రియల్టర్లు రెరాలో నమోదు చేసుకోవాలా? వద్దా?
లేఅవుట్లను అభివృద్ధి చేసే చాలామంది రియల్టర్లు.. తాము 'రెరా' పరిధిలోకి రామని భావిస్తున్నారు. ఇది కేవలం అపోహే అని గుర్తుంచుకోండి. రెరా చట్టం ప్రకారం.. 2017 జనవరి 1 తర్వాత తెలంగాణలో 500 చదరపు మీటర్లు లేదా 8 యూనిట్లు లేదా అంతకంటే అధిక విస్తీర్ణంలో లేఅవుట్లు, అపార్టుమెంట్లను అభివృద్ధి చేసేవారు తప్పకుండా రెరాలో నమోదు చేసుకోవాల్సిందే.

రెరాలో నమోదు చేయకుండా ప్రమోటర్ ప్రకటనల్ని విడుదల చేయవచ్చా?
రియల్టర్ అయినా డెవలపర్ అయినా, రెరాలో నమోదు చేసుకున్నాకే ప్లాటు కానీ ఫ్లాటు కానీ అమ్మకానికి పెట్టాలి. లేకపోతే, ప్రాజెక్టు వ్యయంతో పాటు పది శాతం జరిమానాను విధిస్తారు. అంతేకాదు, కస్టమర్లకు ఫోన్లు చేసినా, ఫాంప్లెట్లు పంపిణీ చేసినా జరిమానా విధిస్తారని గుర్తుంచుకోండి.

రెరాలో నమోదు కాని ప్రాజెక్టుల వద్ద ఎందుకు కొనవద్దు?
రెరాలో రిజిస్టర్ కాని ప్రాజెక్టుల వద్ద కొనుగోలు చేసిన తర్వాత.. పొరపాటున డెవలపర్ నిర్మాణం పూర్తి చేయకున్నా.. రియల్టర్ లేఅవుట్ అభివృద్ధి చేయకపోయినా.. అతనిపై ఫిర్యాదు చేయలేరు. రెరా చట్టం ప్రకారం, న్యాయం పొందలేరు.

రెరాలో నమోదు అయ్యిందా? లేదా?
ఒక ప్రాజెక్టులో ఫ్లాటు కొనాలనే నిర్ణయానికి వచ్చాక.. అది టీఎస్ రెరాలో నమోదు అయ్యిందా? లేదా? అని తెలుసుకోవడానికి rera.telangana.gov.in పోర్టల్ చూస్తే సరిపోతుంది. కొనుగోలు చేయాలనుకునే ప్లాటు, ఫ్లాటు.. ప్రమోటర్ చరిత్ర, అట్టి ప్రాజెక్టు విశేషాలు వంటివి సంపూర్ణంగా తెలుస్తాయి.



తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ 2019 డైరీని ఆవిష్కరించిన జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్. చిత్రంలో సీసీపీ దేవేందర్‌రెడ్డి, టీబీఎఫ్ జీఎస్ జక్కా వెంకట్‌రెడ్డి ఇతర సంఘ సభ్యులు

పారిశ్రామిక పార్కుల్లో రెసిడెన్షియల్ ప్రాజెక్టులు

తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో 'వాక్ టు వర్క్' కాన్సెప్టుకు సరికొత్త ప్రోత్సాహం లభించనున్నది. ఈ మేరకు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్యమైన విషయాన్ని వెల్లడించారు. బడా పారిశ్రామిక పార్కుల్లో రెసిడెన్షియల్ ప్రాజెక్టులను అనుమతిస్తామన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఫెట్షియా) సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అవసరమైతే ఆయా పార్కుల్లో పని చేసే వారికోసం గృహవసతిని కల్పిస్తామన్నారు. టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపూర్‌లో ఏర్పాటయ్యే ఎంఎస్ఎంఈ పార్కుకు స్థలం కేటాయిస్తామన్నారు. కేవలం పరిశ్రమల కోసం ప్రభుత్వం 20 నుంచి 30 శాతం స్థలాన్ని కేటాయిస్తుందన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు 20% పార్కింగ్



దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. అన్ని నివాస, వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్ స్థలంలో 20 శాతం స్థలాన్ని ఎలక్ట్రిక్ వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా కేటాయించాలంటూ కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల మార్గదర్శకాల్ని విడుదల చేసింది. దీని ప్రకారం పార్కింగ్ ఏరియా, నిర్మాణాల రకం ఆధారంగా వాహనాల ఛార్జింగ్ పరికరాలను అమర్చుకోవటంతో పాటు, తగినంత విద్యుత్ సరఫరా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా నిర్మాణాల్లో ఉండే వాహన వినియోగదారులు ఛార్జింగ్‌కు అయ్యే ఖర్చును యజమానికి చెల్లించాలి. దీంతో పాటు సందర్శకుల ఎలక్ట్రికల్ వాహనాల కోసం ప్రత్యేకంగా ఓపెన్ మీటరింగ్‌ను ఏర్పాటు చేసి ఛార్జింగ్ సదుపాయాన్ని కల్పించాలి. విద్యుత్ సరఫరా విషయంలో తగినంత ఏర్పాట్లను విద్యుత్ పంపిణీ కంపెనీలు చేయాల్సి ఉంటుంది. వాహనాల ఛార్జింగ్ పరికరాల ఏర్పాట్ల విషయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మార్గదర్శకాల్లో సూచించింది. నగరంలో ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్, జాతీయ రహదారిపై ప్రతి 25 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. వాహనాలకు అందించే ఛార్జింగ్‌కు గాను సరఫరాకు అవుతున్న సరాసరి ఖర్చు కంటే 15 శాతం అదనంగా వసూలు చేసుకోవచ్చని పేర్కొంది. నూతనంగా ఏర్పాటు చేసే ప్రజా సర్వీస్ ఛార్జింగ్ స్టేషనల్లో సర్వీస్ ఛార్జీలను ఎంత వసూలు చేయాలనే విషయాన్ని ఆయా రాష్ట్రాలకు అప్పగించింది.

ఏరియా ప్రొఫైల్

ఏఎస్‌రావు నగర్.. ఎందుకంత డిమాండ్?

కాస్త తక్కువ ధరలో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని భావించేవారికి ఏఎస్ రావు నగర్ చక్కటి ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. హైదరాబాద్‌కు ఈశాన్య భాగంలో ఉన్న ఈ ప్రాంతం వాణిజ్యపరంగా, గృహసముదాయాల పరంగా మెరుగైన రీతిలో అభివృద్ధి చెందింది. నివాసితులకు ఇక్కడ దొరకని సదుపాయాలంటూ లేవనే చెప్పుకోవాలి. అత్యవసరాల్లో ఆస్పత్రులు, వినోదానికి సినిమా థియేటర్లు, షాపింగ్ మాళ్లు.. ఇలా ఓ ఆధునిక పట్టణంగా ఏఎస్ రావు నగర్ విరాజిల్లుతున్నది. గత కొంతకాలం నుంచి ఈ ప్రాంతంలో జనాభా కూడా గణనీయంగా పెరిగింది. నేరెడ్‌మెట్, ఈసీఐఎల్, సైనిక్‌పురి, మౌలాలీ, కాప్రా వంటి ప్రాంతాల్లో ఆకాశహర్మ్యాలు, టౌన్‌షిప్పులు, అపార్టుమెంట్లు, విల్లా ప్రాజెక్టులు వంటివి వెలిశాయి. కొన్ని ప్రాంతాల్లో నేటికీ ప్లాట్లు లభిస్తున్న ప్రాంతం ఏదైనా ఉందా ఉంటే.. అది ఏఎస్ రావు నగర్ చుట్టుపక్కల ప్రాంతాలే కావడం గమనార్హం.



పశ్చిమ హైదరాబాద్, దక్షిణ హైదరాబాద్ వంటి ప్రాంతాలతో పోల్చితే, ఏఎస్ రావు నగర్‌లో ఇండ్ల ధరలు నేటికీ అందుబాటులో ఉన్నాయనే చెప్పాలి. అందుకే, ఇక్కడ నివాస సముదాయాలకు గిరాకీ గణనీయంగా పెరిగింది. ఈసీఐఎల్ నుంచి నాగారం దాటిన తర్వాత కూడా కాలనీలు విస్తరించాయి. నేటికీ సింగిల్, డబుల్ బెడ్‌రూము ఫ్లాట్లు ఇక్కడి చుట్టుపక్కల కాలనీల్లో దొరుకుతున్నాయి. సొంతంగా ప్లాటు కొనుక్కుని.. వ్యక్తిగత గృహం కట్టుకునేవారి సంఖ్య గత రెండు, మూడేండ్ల నుంచి అధికంగా పెరిగింది. మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండటం.. వాణిజ్య సదుపాయాలు కూడా విశేషంగా పెరగటం.. వంటి అంశాల కారణంగా.. ఏఎస్ రావు నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

అందుబాటులో ఉన్న సౌకర్యాలు...

ఇక్కడ పేరెన్నిక గల విద్యాసంస్థలకు కొదవే లేదు. ఇంటర్, డిగ్రీ, పీజీ వంటి కాలేజీలున్నాయి. ఆస్పత్రుల విషయానికి వస్తే.. మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్, పాలొమి హాస్పిటల్, తులసీ హాస్పిటల్, అంకురా హాస్పిటల్ వంటివి ఉన్నాయి. ఇక సూపర్ మార్కెట్లు, షాపింగ్ సెంటర్లు, బ్యాంకులు, ఏటీఎంలు వంటివి అందుబాటులో ఉండటంతో అధికశాతం మంది ఇక్కడ నివసించడానికి ప్రాధాన్యతనిస్తున్నారు.

మెరుగైన రవాణా..

ఏఎస్ రావు నగర్ చుట్టు ఉన్న ప్రాంతాలతో అనుసంధానంగా రైల్వే వ్యవస్థ అందుబాటులో ఉంది. ఇక్కడ్నుంచి ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాలు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు, ప్రైవేటు బస్సుల సౌకర్యాలున్నాయి. ఉద్యోగం చేసే ప్రాంతానికి చేరువగా నివసించాలని భావించేవారు.. ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. కాస్త దూరమైనా ఫర్వాలేదకుని.. కేవలం ధర అందుబాటులో ఉందని.. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేవారి సంఖ్య కూడా ఎక్కువే ఉంది. గత కొంతకాలం నుంచి అద్దెలు కూడా స్థిరంగానే ఉన్నాయి.

ఎంతెంత దూరం?

ఏఎస్‌రావు నగర్ సమీపంలోని రైల్వే స్టేషన్ నుంచి 6 కి.మీ దూరంలో ఆర్కేపురం రైల్వే స్టేషన్, 7 కి.మీ దూరంలో మౌలాలీ రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఇటీవల కాలంలో మౌలాలీలో పలు రైళ్లు నిలుస్తున్నాయి. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 70 కి.మీ దూరంలో ఉన్నది. ఆర్టీసీ బస్ స్టాపులకు కొదవే లేదు. మల్టీప్లెక్సులు, సినిమా థియేటర్లు సైతం చేరువగా ఉన్నాయి.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
శనివారం 12 జనవరి 2019

స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్!


కల్యాణ్‌రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం '118'. ప్రముఖ ఛాయాగ్రహకుడు కె.వి.గుహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నివేదా థామస్, షాలిని పాండే కథానాయికలుగా నటిస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ 'ఈ చిత్ర టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్, టీజర్‌ను ఇప్పటికే విడుదల చేశాం. మంచి స్పందన లభిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. కల్యాణ్‌రామ్ లుక్‌తో పాటు సినిమా ఏ జోనర్‌లో వుండనుందో టీజర్ ద్వారానే చెప్పేశాం. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. సీట్ చివరి కూర్చుని చూసేలా వుంటుంది. కల్యాణ్‌రామ్ ఇప్పటి వరకు చేయని జోనర్ చిత్రమిది. వెంకట్, అన్బరివు, రియల్ సతీష్‌ల నేతృత్వంలో చిత్రీకరించిన యాక్షన్ పార్ట్ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. చాలా సినిమాలకు అద్భుతమైన విజువల్స్‌ని అందించిన కె.వి.గుహన్ ఈ చిత్రాన్ని ఆద్యంతం రసవత్తరంగా తెరకెక్కించారు. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌లని ఇష్టపడే ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది' అన్నారు.


మహేష్‌బాబు

ఆసక్తిగా ఎదురుచూస్తున్నా..


సుకుమార్

'రంగస్థలం' సినిమాతో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నారు దర్శకుడు సుకుమార్. గ్రామీణ నేపథ్య ఇతివృత్తానికి మానవీయ విలువల్ని జోడించి హృద్యంగా ఈ సినిమాను తెరకెక్కించి ప్రశంసల్ని అందుకున్నారు. 'రంగస్థలం' తర్వాత మహేష్‌బాబుతో ఓ సినిమా చేయనున్నారు సుకుమార్. 'వన్ నేనొక్కడినే' తర్వాత వీరిద్దరి కలయికలో రూపొందనున్న చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నది. అయితే ఈ సినిమాపై గత కొంత కాలంగా రకరకాల వార్తలు ప్రచారంలో ఉన్నాయి. అయితే అవన్నీ అవాస్తవాలేనని తేల్చిచెప్పారు మహేష్‌బాబు. శుక్రవారం సుకుమార్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన మహేష్‌బాబు 'మన సినిమా ప్రారంభం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని తెలిపారు. సుకుమార్ కెరీర్‌లో ఈ ఏడాది గొప్పగా నిలవాలని పేర్కొన్నారు. సుకుమార్, మహేష్‌బాబు కలయికలో రూపొందిన 'వన్ నేనొక్కడినే' చిత్రం ఐదేళ్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా చిత్రీకరణలో సుకుమార్‌తో ముచ్చటిస్తున్న ఓ వర్కింగ్‌స్టిల్‌ను అభిమానులతో పంచుకున్న మహేష్‌బాబు ఆ జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు.


దిల్ రాజు, అనిల్ రావిపూడి, మెహరీన్, వరుణ్‌తేజ్, వెంకటేష్, తమన్నా, రాజేంద్రప్రసాద్, శిరీష్

అనిల్ దగ్గర ఏదో మ్యాజిక్ వుంది!

వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా నటించిన చిత్రం 'ఎఫ్2'. అనిల్ రావిపూడి దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. తమన్నా, మెహరీన్ కథానాయికలు. నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా చిత్ర బృందం గురువారం రాత్రి హైదరాబాద్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. వెంకటేష్ మాట్లాడుతూ 'సంక్రాంతికి నా నుంచి వచ్చిన ప్రతి చిత్రాన్నీ ప్రేక్షకులు ఆదిరించారు. ఈ సారి వస్తున్న 'ఎఫ్2' కూడా అలానే సక్సెస్ అవుతుందన్న నమ్మకముంది. ఓ కథ విన్నప్పుడు ప్రేక్షకుడిలానే వింటా. దర్శకుడితో స్నేహితుడిలా అభిప్రాయాలు పంచుకుంటా. అనిల్ రావిపూడిలో ఏదో ఓ మాయ ఉంది. తను వినోదాన్ని అత్యున్నత స్థాయిలో చూపించాడు. సాధారణంగా కామెడీ పండించడం చాలా కష్టం. ఒకట్రెండు టేకుల్లో సీన్ ఓకే అయిపోవాలి. లేదంటే మళ్లీ రాదు. ఓ సీన్ చేశాక అనిల్ సహాయ దర్శకులతో చర్చించేవాడు. దాంతో మళ్లీ చేయమంటారేమో అయిపోయ్రా అని భయపడేవాడిని' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'తొలిసారి ఓ మాస్ పాత్రని ప్రయత్నించాను. ఈ సినిమా షూటింగ్ ఎలా మొదలైందో, ఎలా ముగిసిందో అర్థం కావడం లేదు. అనిల్ రూపంలో మంచి స్నేహితుడు దొరికాడు. మా ఇంట్లో రాజేంద్రప్రసాద్‌గారు నటించిన సీడీలు వుంటాయి. నవ్వుకోవాలని అనిపించినప్పుడు ఆయన సినిమాలు చూసేవాడిని. అలాంటి నటుడితో కలిసి పనిచేయడం ఆనందంగా వుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని 80 శాతం కామెడీతోనే నింపేశాం. టైమింగ్ వున్న గొప్ప నటులు ఈ సినిమాలో పనిచేశారు. వెంకీ, తమన్నా మధ్య వుండే కెమిస్ట్రీ, కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. వరుణ్ తెలంగాణ యాసతో ఆకట్టుకుంటాడు' అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ 'ఓ సినిమా సిద్ధం కావడానికి 24 విభాగాలు శ్రమించాల్సిందే. ఈ సినిమాకు మేమంతా అలాగే కష్టపడ్డాం. 'కలియుగ పాండవులు'తో వెంకటేష్‌గారికి అభిమానిని అయ్యా. ఆయనతో రెండవ సారి కలిసి పనిచేసే అవకాశం దక్కింది. కథ విన్న వెంటనే వరుణ్ ఒప్పుకున్నాడు. అనిల్ దగ్గర ఓ మ్యాజిక్ వుంది. పూర్తి స్క్రిప్ట్ లేకుండా సినిమా తీయడానికి ఒప్పుకోను. కానీ నాకు సన్నివేశాలు మాత్రమే చెప్పి ఒప్పిస్తాడు' అన్నారు.

లక్ష్మీపార్వతి లుక్


యజ్ఞాశెట్టి

రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'లక్ష్మీస్ ఎన్టీఆర్'. ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించిన తర్వాత చోటుచేసుకున్న అత్యంత కీలకమైన పరిణామాల్ని ఆధారంగా చేసుకొని వర్మ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శుక్రవారం లక్ష్మీపార్వతి పాత్ర లుక్‌ను ట్విట్టర్ ద్వారా విడుదలచేశారు వర్మ. ఈ పాత్రలో కన్నడ నటి యజ్ఞాశెట్టి నటిస్తున్నది. ఇతర కీలక పాత్రల్లో నూతన నటీనటులు కనిపిస్తున్నారు. లక్ష్మీపార్వతి తో పాటు ఎన్టీఆర్ సన్నిహితుల ద్వారా సమాచారాన్ని సేకరించి నిరూపించగలిగే నిజాలతో ఈ సినిమా చేస్తున్నట్లు ప్రకటించారు రామ్‌గోపాల్‌వర్మ. రాకేష్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సరికొత్త ప్రేమకథ!


అనిల్, సుభాంగి

నెమలి అనిల్, సుభాంగి పంత్ జంటగా నటిస్తున్న చిత్రం 'రావే రా చెలియా'. ఎన్. మహేశ్వర్‌రెడ్డి దర్శకుడు. సూర్యచంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై నెమలి అనిల్, నెమలి శ్రవణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ లోగోను శుక్రవారం హైదరాబాద్‌లో నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'టైటిల్ ఆకట్టుకునే విధంగా వుంది. సినిమా కూడా అదే స్థాయిలో వుంటుందని భావిస్తున్నాను. సినిమాలో కంటెంట్ వుంటే కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు. 'హీరోగా ఇది నా మొదటి సినిమా. కథ బాగుందంటే ప్రేక్షకులు చిత్రాన్ని ఆదిరిస్తున్నారు. సరికొత్త ప్రేమకథ నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది' అని హీరో నెమలి అనిల్ పేర్కొన్నారు.